మెయిన్ గత వారం రోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కర్నూలు

: fb.com/vaartha Digital

Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-2-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 11 పేజీలు: 10+4 వెల: 6.50



బాబ్రీ మసీదుపై ఆశలు వదులుకోండి: సిఎం యోగి 5లో

పాకిస్థాన్‌ను చైనా, భారత్‌లు నమ్మడంలేదు


# కల్తీ నెయ్యి కేసు రంగంలోకి ఇడి



## రూ.235 కోట్లు హవాలా మార్గంలో చేతుల మారినట్లు గుర్తింపు

## సిట్ అధికారుల నుంచి సమగ్ర సమాచారం సేకరించిన ఇడి

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నెయ్యి వివాదంలో తాజాగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసును సిట్ విచారణ చేసి.. అనేక అంశాలను గుర్తించింది. రూ.235 కోట్ల విలువైన ఈ కుంభకోణంలో హవాలా మార్గాల ద్వారా భారీ మొత్తాల్లో సొమ్ము చేతులు మారినట్లు పేర్కొంది. దీంతో, ఈ వ్యవహారంలో తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను ఇడి అధికారులు సిట్ నుంచి తాజాగా తీసుకున్నారు. ఈ కేసుకు సంబం ధించిన ఎఫ్‌ఐఆర్, 36 మంది నిందితుల సమాచారం, వారి రిమాండ్ రిపోర్టులు, ఇప్పటివరకూ దాఖలు చేసిన అభియోగ పత్రాలు, వివిధ రాష్ట్రాల్లోని హవాలా ఏజెంట్ల ప్రమేయం, వారి పాత్ర తదితర అంశాలపై సమాచారం తీసుకుని ఇడి విచారణకు సిద్ధం అయింది. ఈ కేసులో భారీ ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భావిస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఇడి వివరాలు కోరింది. పూర్తి సమాచారం రాబట్టేందుకు సిద్ధమైంది. సిట్ విచారణలో టిటిడికి నెయ్యి సరఫరా వివరాలు... ఏ సంస్థ నుంచి ఎంత మేర సరఫరా చేసారు.. అందులో నాణ్యత ఎంత వంటి అంశాలపైన పూర్తి స్థాయి సమాచారం సేకరించింది. తమ సంస్థతో పాటు వైష్ణవి, ఏఆర్, మాల్‌గంగా డెయిరీల ద్వారా టిటిడికి సరఫరా చేసిన భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు ఈ అక్రమ కార్యకలాపాల కోసం విజయవాడ, చెన్నై, హైదరాబాద్, గుజరాత్, ఢిల్లీ, గ్వాలియర్ తదితర ప్రాంతాల్లోని పలువురు హవాలా ఏజెంట్ల ద్వారా డబ్బులు చెల్లింపులు జరిగినట్లు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది... ఎవరికి నగదు ముట్టింది వంటి అంశాల పైన ఆరా తీస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో హవాలాతో పాటు వివిధ మార్గాల్లో వచ్చిన డబ్బు ఏం చేశారు? ఎక్కడికి మళ్లించారు? అనేది ఇడి దర్యాప్తు చేయనుంది. దీంతో.. ఇడి ఇప్పుడు ఎవరికి నోటీసులు ఇవ్వనుంది?.. ఏం తేల్చనుంది?. ఈ కేసు ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

విశాఖ మెట్రో రైలు

# రైట్ రైట్!



కేంద్రమంత్రి ఖట్టర్‌తో సిఎం చంద్రబాబు

## కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

## సిఎంకు స్వయంగా చెప్పిన ఖట్టర్

## మెట్రోనగరాల అభివృద్ధికి నిధుల్వికండి

## మనోహర్‌లాల్‌కు చంద్రబాబు వినతి

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ మెట్రో రైలుకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి మనోహర్ లాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మనోహర్‌లాల్ స్వయంగా ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ, విజయవాడ మెట్రోకు ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో మెట్రోకు పచ్చజెండా ఊపినట్లు సిఎంకు కేంద్రమంత్రి తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ప్రయాణాన్ని సులభతరం చేయడానికి ఈ మెట్రో ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగనుంది. విశాఖ మెట్రో మొదటిదశ ప్రాజెక్టుకు రూ.11వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మెట్రోను మొదటి దశలో 3 కారిడార్లలో నిర్మించాలని డిపిఆర్ సిద్ధం చేశారు. 3 కారిడార్లలో కలిపి మొత్తం 46.22 కి.మీ, 43 మెట్రో స్టేషన్లను నిర్మించనున్నారు. అలానే ఈ మెట్రో ప్రాజెక్టును డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టులో ఎన్ఎడి, తాటిచెట్ల పాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాక వద్ద ఇం టిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి. మొదటిదశలో 3 కారిడార్లు నిర్మిస్తారు. కూర్మన్నపాలెం- కొమ్మాది జంక్షన్ మధ్య మొదటి మెట్రో లైను 34.4 కి.మీ, 29 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి. గురుద్వారా - పాత పోస్టాఫీసు మధ్య 2వ మెట్రో లైను రానుంది. ఈ కారిడార్‌లో 5.07 కి.మీ, 6 స్టేషన్లు నిర్మించనున్నారు. తాడిచెట్లపాలెం- వాల్తేరు మధ్య 3వ మెట్రో లైను రానుంది. ఈ కారిడార్‌లో 6.75 కి.మీ, 7 మెట్రో స్టేషన్లు రాను న్నాయి. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల డిపిఆర్‌లను 2015లోనే అప్పటి టిడిపి ప్రభుత్వం మొదటిసారి కేంద్రానికి పంపింది. వాటికి అప్పట్లోనే కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. తర్వాత కేంద్రం తీసుకువచ్చిన కొత్త మెట్రో రైలు విధానానికి అనుగుణంగా మళ్లీ డిపిఆర్‌లు సమ ర్పించాలంటూ వాటిని తిప్పి పంపింది. 2019లో వైఎస్సార్సీపీ అధికా రంలోకి వచ్చాక మిగతా ప్రాజెక్టులలాగే మెట్రో ప్రాజెక్టును కూడా తీవ్ర నిర్లక్ష్యం చేసింది. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును పూర్తిగా >>2

## రాజధానిగా అమరావతికి

# చట్టబద్ధత కల్పించండి



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రహోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు

## పోలవరం రెండో దశ నిధులు విడుదల చేయండి

## ఉద్యాన ఉత్పత్తుల రవాణాకు 50 శాతం రాయితీకి ఖాళీ రీఫర్ కంటైనర్లు

## ఉత్తర, దక్షిణ భారతంలను కలుపుతూ ఫ్రైట్ కారిడార్లు నిర్మించాలి

## ఎపిలో మఖానా డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేయండి

## పూర్వోదయ సహా, కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులపై విజ్ఞాపన

## రాష్ట్ర ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై సహకారం కోరుతూ సిఎం వినతులు

## హోంమంత్రి అమిత్ షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వరుస భేటీలు

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వీటితో పాటు వివిధ అంశాల్లో రాష్ట్రానికి సహకారం అందించాలని కోరుతూ విజ్ఞాపన పత్రం అందించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మంగళవారం కేంద్ర హోం మంత్రి సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో వేర్వే రుగా సమావేశమయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు నిర్వహించారు. అమిత్ షాతో సహా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమైన సీఎం పూర్వోదయ పథకం ద్వారా రాయలసీ మను ఉద్యాన హబ్ గా మార్చే ప్రణాళికకు నిధులు ఇవ్వాలని కోరారు. అలాగే వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర వాటాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో భేటీ అయిన ముఖ్యమంత్రి ఏపీలో మఖానా డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని అభ్య ర్థించారు. మఖానా సాగుకు ఏపీలో అను కూలమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు. కొల్లేరు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగు చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర వ్యవసాయ మంత్రితో సీఎం చర్చించారు. పీఎం ప్రణామ్ పథకం కింద ఏపీలో సామూహిక సహజ వ్యవసాయాన్ని విస్తరించేందుకు నిధులు విడుదల చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిని కోరారు. ఈ పథకం కింద గత ఏడాది రసాయన ఎరువుల వాడకం తగ్గించిన రాష్ట్రంగా ఏపీకి రూ.216 కోట్ల మేర ప్రోత్సాహకాలను మంజూరు చేయాలని అడి గారు. ఏపీలో కొబ్బరి సాగు చేసేందుకు రూ.200 కోట్ల మేర సాయం అందించాలని కూడా సీఎం కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు, కర్ణాటక తరహాలో ఆధునిక టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకారం అందించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం కింద పెండింగ్ లో



మంగళవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

ఉన్న రూ.695 కోట్లను విడుదల చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. ప్రైస్ డెఫిషి యన్సీ పేమెంట్ సిస్టం కింద 202526 సీజన్ లో తోతాపురి మామిడి రైతులకు కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.100 కోట్లను విడుదల చేయాలని సీఎం కోరారు.

**పోలవరం రెండో దశకు రూ.32 వేల కోట్లు అవసరం:** పోలవరం ప్రాజెక్టు రెండో దశలో భాగంగా తదుపరి భూసేకరణ, పునరావాసానికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు విజ్ఞప్తి చేశారు. దీని కోసం రూ.32 వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. >>2



మంగళవారం సభ ఏర్పాట్లపై అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

# నేటి నుంచి అసెంబ్లీ

## ఉదయం 10గం.లకు సమావేశం

## ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

## ఆ తర్వాత బిఎసి సమావేశం

## నేడు సభకు హాజరుకావాలని వైసిపి నిర్ణయం

## 14న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం

## సభ ఏర్పాట్లపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమీక్ష

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రేపు ఉదయం 10 గంటలకు శాసనసభ, ఉదయం 11 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌లతో కూడిన సెక్రటరీల బృందం, డిజిపి హరీష్ కుమార్ గుప్తాతో పాటు పలువురు ఉన్నత పోలీస్ అధికారులు పాల్గొన్నారు. సమావేశాల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పీకర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లో సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారుల నుండి ఖచ్చితమైన సమాధానాలు సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం గవర్నర్ ప్రసంగంతో సభ ప్రారంభం కానున్నది. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశం జరుగుతుంది.

**ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు పంపండి:** అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖాధికారులు సకాలంలో సమాధానాలు పంపాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. సభ్యులు అడిగిన ప్రజలకు నెల రోజులైనా సమాధానాలు రాకపోవడం చూస్తు న్నామన్నా ఇకపై అలా జరగకుండా సకాలంలో సమాధానాలు పంపేలా చూడాలని కార్యదర్శులను స్పీకర్ ఆదేశించారు. వచ్చే >>2

## అవిశ్వాసంపై చర్చ పూర్తయ్యే దాకా

# లోక్‌సభకు రాను!



## స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కీలక నిర్ణయం

## పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ సభాధ్యక్షుడిపై లోక్‌సభ సెక్రటరీ నోటీసు ఇచ్చిన విపక్ష ఎంపీలు

## రెండోవిడత బడ్జెట్ సమావేశాల్లోకు చర్చకు అవకాశం

## 4న లోక్‌సభలో మహిళా ఎంపీల నిరసన వీడియో విడుదల చేసిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి

## మళ్లీ నరవణె పుస్తక ప్రస్తావన తెచ్చిన రాహుల్‌గాంధీ

## సభలో గందరగోళం... పలుమార్లు వాయిదా

## ఆ పుస్తకం ఇంకా ప్రచురించలేదు: పెంగ్విన్ ప్రకటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవే శపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడుతున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. అంతకుముందు అధికార పార్టీకి తలొగ్గి >>2

# శివభక్తులకు అన్ని ఏర్పాట్లు చేయండి

## వసతి, భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోండి

## అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

## ఢిల్లీ నుంచి మంత్రులు, అధికారులతో సమీక్ష

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాల్లో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయా లని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డిజిపిలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రి సమీక్షను నిర్వహించారు. అధికారులు, జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను, సౌకర్యాలను సమీక్షించిన ముఖ్య మంత్రి. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తులరద్దీ, సౌకర్యాలపై సమ గ్రసమాచారం అధికారుల ద్వారా సిఎం చంద్రబాబు తెలుసుకున్నారు. శివరాత్రి నాటికి శ్రీశైలంలో భక్తుల >>2

## జిఎస్‌డిపిపై అన్నీ

# తప్పుడు లెక్కలు



## కాగ్ నివేదికకు విరుద్ధంగా గణాంకాలు

## 11.75శాతం వృద్ధి అంటూ గొప్పలు

## రాష్ట్ర పన్నుల రాబడి 1.97శాతమే

## కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు

**విజయవాడ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు ప్రభుత్వం జిఎస్‌డిపిపై తప్పుడు లెక్కలు చెబుతోందని వైసిపి అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రం పన్నుల వసూళ్ల వృద్ధిలో 23 రాష్ట్రాల్లో ఎపికి 22వ స్థానం లభించిందని, ఇందుకు విరుద్ధంగా సిఎం చెబుతున్నారన్నారు. అప్పులు, అవినీతి, కక్ష సాధింపుల్లోనే ఎపి ప్రథమ స్థానంలో ఉందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఆయన మంగళవారం వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ శాసనసభ్యులు, మాజీ మం త్రులతో మాట్లాడారు. కూటమిప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి >>2



# హెచ్1బి వీసా రద్దుకు ప్రతినిధుల సభలో బిల్లు

## రిపబ్లికన్ పార్టీ సభ్యుడు గ్రెగ్ స్ట్యూబ్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 10:** అమెరికాలో విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీ యులకు కీలకమైన హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌ను పూర్తిగా రద్దు చేసేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు రిపబ్లికన్ పార్టీకి చెందిన చట్టసభ సభ్యు డు గ్రెగ్‌స్ట్యూబ్, ఎండింగ్ ఎక్స్‌ప్లాయిటేటివ్ ఇం పోర్టెడ్ లేబర్ ఎగ్జెంప్షన్స్ యాక్ట్ పేరుతో ప్రతినిధుల సభలో ఒక బిల్లును ప్రవే శపెట్టారు. ఈ బిల్లు ఆమోదం పొందితే వేలాది మంది భారతీయ టెకీలు, నిపుణులపై తీవ్ర ప్రభా వం పడనుంది. ఈ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా గ్రెగ్ స్ట్యూబ్ మాట్లా డుతూ, అమెరికన్ పౌరుల శ్రేయస్సు కంటే విదేశీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వడం తమ దేశ విలువలకూ, జాతీయ ప్రయోజనాలకు విఘాతం కలిగి స్తోందని అన్నారు. హెచ్1బి వీసా ప్రోగ్రామ్ వల్ల మన కార్మికులు, యువత నిరంతరం నష్టపోతున్నారు. మన శ్రామిక శక్తిని పణంగా పెట్టి కార్పొరేషన్లు, విదేశీ పోటీదారులకు లబ్ధిచేకూరుతోందిఅని ఆయన విమర్శించారు. అమెరికన్లకే ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈఎక్సెల్ యాక్ట్ ద్వారా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం లోని సెక్షన్ 214(1)ను సవరించాలని ప్రతిపాదించారు. దీని ప్రకారం 2027 ఆర్థిక సంవత్సరం నుంచి హెచ్1బి వీసాల సంఖ్యను సున్నాకు తగ్గించాలని బిల్లులో పేర్కొన్నారు. ప్రస్తుతం జారీ అవుతున్న హెచ్1బి వీసాల్లో 80 శాతానికి పైగా భారత్, చైనా దేశాలకు చెందినవారే పొందు తున్నారని గ్రెగ్ స్ట్యూబ్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో >>2



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌ను కలిసిన సీఎం చంద్రబాబు

# నేటి నుంచి అసెంబ్లీ

>>వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను నేషనల్ ఈ విధాన్ కింద డిజిటల్ విధానంలో సభ నిర్వహణ కృషి జరుగుతోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. దీనిపై ఏర్పాట్లు ఈ బడ్జెట్ సమావేశాల అనంతరం మొదలుపెట్టవచ్చు వర్షాకాల సమావేశాల నుండి అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రశ్నల అవర్, జీరో అవర్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు నిర్ణీత సమయంలోగా సమాధానాలు పంపేందుకు వీలుగా ప్రతిశాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. అసెంబ్లీకి 283ప్రశ్నలకు,శాసనమండలికి 562ప్రశ్నలకు ఇంకా వివిధ ప్రభుత్వ శాఖల నుండి సమాధానాలు రావాల్సి ఉందన్నారు. దీనిపై వెంటనే సంబంధిత శాఖల కార్యదర్శులు తక్షణ చర్యలు తీసుకొని అసెంబ్లీకి సమాధానాలు పంపాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఉప సభాపతి మాట్లాడుతూ కె.రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ సభ్యులు అడిగే ప్రజలకు ఆయా శాఖలు సకాలంలో సమాధానాలు పంపితే వాటిని సభ్యులు చదివి సన్నద్ధంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని కావున సకాలంలో సమాధానాలు పంపాలని కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఎస్.ప్రసన్నకుమార్ ముందుగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రజలకు వారం రోజుల్లోగా సంబంధిత శాఖలు నుండి సమాధానాలు రావాల్సి ఉంటుందన్నారు. కాని సమాధానాలు చాలా ఆలస్యంగా పంపిస్తున్నారని ఇకపై సకాలంలో పంపేందుకు కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేషనల్ ఈ విధాన్ కింద త్వరలో డిజిటల్ విధానంలో సభను నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కృష్ణ బాబు, ఎస్ ఎస్ రావత్, అర్జా సిసోడియా, ఎక్స్ అఫిషియో స్పెషల్ సిఎస్ బి.రాజశేఖర్, పలువురు ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు తదితర అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్‌ను ఆహ్వానిస్తు స్పీకర్ అయ్యన్న పాత్రుడు

## అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్‌ను ఆహ్వానించిన స్పీకర్

**విజయవాడ, ఫిబ్రవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం గవర్నర్ కార్యాలయంలో స్పీకర్ భేటీ అయ్యారు సంప్రదాయం ప్రకారం గవర్నర్‌ను అసెంబ్లీ సమావేశాలకు ఆహ్వానించారు. స్పీకర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర కూడా గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సమావేశాల నిర్వ హణకు సంబంధించిన ఏర్పాట్లను వారు గవర్నర్‌కు వివరించారు. బుధవారం ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.

## శివభక్తులకు అన్ని ఏర్పాట్లు చేయండి

>> రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం, హోం మంత్రి అనిత ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా, వసతి లభించేలా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంలో పకడ్బందీ రక్షణ చర్యలు ఉండాలన్నారు. శివదీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరపరిచేలా ఎవరూ వ్యవహరించ కూడదని సిఎం ఆదేశించించారు. ఎక్కడా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై అధికారులు పూర్తి స్థాయి శ్రద్ధ పెట్టాలన్నారు. విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో నది స్నానాల విషయంలో భక్తులకు ఇబ్బందులు ఉండకూడదన్నారు. రోజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తులరద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. శివరాత్రి పర్వదినం వంటిసందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తిసమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసారు.

## హెచ్1బి వీసా రద్దుకు ప్రతినిధుల సభలో బిల్లు

>> తెలిపింది. ఈ ప్రోగ్రామ్ వల్ల అమెరికన్ కార్మికులు ఎలా నష్టపోతున్నారో వివరిస్తూ పలు ఉదాహరణలను ప్రస్తావించారు. ఐదువేల మంది విదేశీ వైద్యుల రాకతో పదివేలమందికి పైగా అమెరికన్ వైద్యులు రెసిడెన్సీ ప్రోగ్రామ్‌లలో అవకాశం కోల్పోయారని తెలిపారు. 2025లో మైక్రోసాఫ్ట్ తొమ్మిదివేల హెచ్1బి వీసాలు పొందిన తర్వాత16వేల మందికి పైగా ఉద్యోగులను తొలగించిందని ఆరోపించారు. డిస్నీ, ఫెడెక్స్, సదరన్ కాలిఫోర్నియా ఎడిసన్ వంటి సంస్థలు కూడా ఈ వీసాలను ఉపయోగించుకుని స్థానిక ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో విదేశీయులను నియమించుకున్నాయని వివరించారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్, వైద్యం, ఫైనాన్స్ వంటి ప్రత్యేక నైపుణ్యం అవసరమైన రంగాల్లో విదేశీ నిపుణులను నియమించుకునేందుకు అమెరికా కంపెనీలకు హెచ్1బి వీసా విధానం వీలు కల్పిస్తోంది. దశాబ్దాలుగా, ముఖ్యంగా భారత్, చైనా నుంచి నిపుణులు అమెరికాలో పనిచేసేందుకు ఇది ప్రధాన మార్గంగా ఉంది. అయితే, ఈ విధానంపై ఉద్యోగాలు, వేత నాలు, వలసల విధానాలకు సంబంధించి రాజకీయంగా ఎప్పటికప్పుడు చర్చ జరుగుతూనే ఉంది.

## రిలయన్స్ అనిల్ అంబాని భార్య టీనాకు ఇడి సమన్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** రియలన్స్ గ్రూపు ఛైర్మెన్ అనిల్ అంబానీ భార్య టీనా అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా సమన్లు జారీ చేయనున్నది. 68 ఏళ్ల టీనా అంబానీని మనీ ల్యాండరింగ్ కేసులో ప్రశ్నించనున్నారు. వాస్తవానికి ఈడీ ముందు సోమవారం హాజరు కావాలని బాలీవుడ్ మాజీ నటి టీనాకు సమన్లు ఇచ్చారు. కానీ ఆమె హాజరుకాలేదు. అయితే ఆ కేసులో మళ్లీ టీనాకు సమన్లు జారీ చేయనున్నట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. న్యూయార్క్‌లోని మన్‌హటన్‌లో ఖరీదైన లగ్జరీ ఇంటిని కొనుగోలు చేసిన కేసులో జరిగిన లావాదేవీలపై ఈడీ ప్రశ్నించనున్నది. ఈ కేసుతో లింకున్న రిలయన్స్ కమ్యూనికేషన్ మాజీ ప్రెసిడెంట్ పునిత్ గార్గ్‌ను ఈడీ ఇటీవల అరెస్టు చేసింది. బ్యాంక్ ఫ్రాడ్‌పై దర్యాప్తు చేపట్టేందుకు సిట్‌ను ఏర్పాటు చేసింది ఈడీ. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూపులో జరిగిన ఆర్థిక అవకతవకలపై కూడా సిట్ విచారణ చేపట్టనున్నది.

# రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించండి

>> ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్ చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రతిపాదనలకు ఆమోదం తెలియజేయాలని అభ్యర్థించారు. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి, సాంకేతిక-ఆర్థిక సాయం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరించేలా వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యూడీటీ) తుది నివేదిక గెజిట్‌లో ప్రచురించాలన్నారు. గోదావరి జలాల పంపకంపై ఏపీ తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని నదీ జలాల పంపకం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఎగువ కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి పాటిల్ కు వివరించారు.

**సరకు రవాణా కారిడార్లు అవసరం**

ఉత్తర దక్షిణ భారత్ ను అనుసంధానిస్తూ ప్రత్యేక సరకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర దక్షిణ భారత్ కలిపేలా ఇటార్సీ విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలని.. పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్ చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయటంతో పాటు కొత్త రైలు మార్గాలు, సర్వీసులను నడపాలని విజ్ఞాపన పత్రం ఇచ్చారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే విశాఖలో తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు అయ్యాయని.. జీఎం సహా ఇతర అధికారులు విధుల్లో ఉన్నారని తెలియచేశారు. అలాగే రాయలసీమలోని తాడిపత్రి నుంచి ముంబైలోని జేఎన్ పీటీ పోర్టుకు



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో ఎపి ఎంపీలు

అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. గుజరాత్ రాష్ట్రంలోని మోర్బీలోనూ ఇదే తరహా రాయితీపై రీఫర్ కంటైనర్లను కేటాయిస్తున్నారని అదే రాయితీని ఏపీకి కూడా పొడిగించాలని కోరారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని విజ్ఞప్తిచేశారు. విశాఖవిజయవాడల మధ్య హైస్పీడ్, విజయవాడకర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతిచిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మం జూరు చేయాలని సీఎం కోరారు. హైదరాబాద్ శ్రీశైలం మార్కాపురం కొత్త రైల్వేలైన్ ద్వారా శ్రీశైల పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని..తిరుపతి మీదుగా విజయవాడబెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని రైల్వే మంత్రికి ఇచ్చిన లేఖలో సీఎం పేర్కొన్నారు. వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం ఇటీవల కేంద్ర బడ్జెట్టులో ప్రతిపాదించిన వివిధ హై స్పీడ్ రైళ్ల కారిడార్లల్లో ఏపీని కనెక్ట్ చేసేలా ప్రతిపాదించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే చెన్నైబెంగళూరు హై స్పీడ్ రైల్ కారిడార్లో తిరుపతిని కనెక్ట్ చేసేలా చూడాలని అశ్వినీ వైష్ణవ్ ను సీఎం చంద్రబాబు విజప్తి చేశారు.

**జీరో ల్యాండ్ ఫిల్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించండి**

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వేస్ట్ మేనేజ్మెంట్, జీరో ల్యాండ్ ఫిల్ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద రూ. 276 కోట్ల ఖర్చుతో జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్ కు కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. కేంద్ర వాటా కింద రూ.105 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అనంతరం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్ డీ కుమారస్వామితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ప్లాంట్ లాభాల బాట పట్టడంలో అందించిన సహకారానికి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక సాయం, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, స్టీల్ ప్లాంట్ కార్మికులుఉద్యోగుల పట్టుదల, శ్రమతో ఈ లాభాలు సాధ్యం అయ్యాయని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడంతో పాటు, పూర్తి స్థాయి సామర్థ్యం మేర పనిచేస్తోందని సీఎం తెలిపారు. ఆర్ఐఎన్ఎల్ విషయంలో భవిష్యత్‌లోనూ ఇంతే తోడ్పాటు, సహకారాన్ని అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. సీఎం చంద్రబాబుతో పాటు వివిధ కేంద్ర మంత్రులను కలిసిన వారిలో కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.

# జిఎస్‌డిపిపై అన్నీ తప్పుడు లెక్కలు

>> ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జిఎస్‌డిపి (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు.

ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025-26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని అన్నారు.

ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్రపన్నుల రాబడివృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. "11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపుఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు.

ఇదే సమయంలో, దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై కాగ్ విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో, అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటని అన్నారు. ఇదే చంద్రబాబు 22వ ర్యాంక్ విజన్ అంటూ ఆయన సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఎపి ఏదైనా విషయంలో మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

## విశాఖ మెట్రో రైలు రైట్ రైట్!

>> అటకెక్కించింది. విశాఖ మెట్రో చేపడతామంటూ కొద్ది రోజులు హడావుడి చేసింది. కానీ ఈ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రానికి మాత్రం ఎలాంటి డిపిఆర్‌లు పంపలేదు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులకు 6 నెలల్లోనే డిపిఆర్‌లు సిద్ధం చేసింది. 2025 డిసెంబరులో కేంద్రం ఆమోదానికి పంపింది. విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుల్ని 2 దశల్లో చేపడతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్య విధానం (జేవీ మోడల్)లో ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెరిసగం భరించాలన్న అంగీకారం గతంలోనే జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు సమకూర్చేందుకు, వాటితో పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. ప్రాజెక్టులో జాప్యాన్ని నివారించేందుకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోగా తన వంతు 20శాతం నిధులతో భూసేకరణ, సివిల్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టెండర్లు కూడా పిలిచింది. ఆ పనులకు అనుమతుల కోసం 2 నెలల క్రితం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టు కావడంతో రాష్ట్ర నిధులతో చేపట్టే పనులకైనా కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అమరావతి పనులు ఊపందుకోవడం, విశాఖకు గూగుల్, ఐటీ లాంటి దిగ్గజ కంపెనీలు వస్తుండటంతో విజయవాడ, విశాఖలకు మెట్రో ప్రాజెక్టులు అత్యంత అవసరం. వచ్చే ఎన్నికల్లోగా తొలి దశ పనులైనా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## అవిశ్వాసంపై చర్చ పూర్తయ్యే దాకా లోక్‌సభకు రాను!

>>తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. మరోవైపు బిజెపి మహిళా ఎంపిలు కూడా విపక్ష మహిళా ఎంపిలు ఆరోజు మోడీ సీటు వద్దకు దూసుకురావడంసభా సాంప్రదాయాలను మంటగలపడమేనని, ఈఎంపిలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసారు. ఆరోజు విపక్ష ఎంపిల నిరసన వల్లనే మోడీ సభలో రాష్ట్రపతి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చలోప్రసంగించలేకపోయారని వారు ఆరోపించారు.

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 79 ర్యాంకులు మెరుగుపడిన భారత్

### పార్లమెంటులో కేంద్ర మంత్రి జితిన్‌ప్రసాద్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: సులభశైలి వాణిజ్యంలో భారత్ గత ఐదేళ్లలో 79 ర్యాంకులు మెరుగుపరుచుకుంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. వరల్డ్ బ్యాంక్ గ్రూప్ గతంలో ప్రచురించిన ర్యాంకింగ్స్‌లో ఈ పురోగతి నమోదైందని ఆయన తెలిపారు. వరల్డ్ బ్యాంక్ 2020లో డూయింగ్ బిజినెస్ రిపోర్ట్ ను నిలిపివేసిందని, దాని స్థానంలో 2024లో బీరెడీ పేరుతో కొత్త అసెస్‌మెంట్‌ను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. 180 దేశాల్లో వ్యాపార జీవితచక్రంలోని 10 అంశాల ప్రాతిపదికన ఈ అంచనా ఉంటుందని చెప్పారు. 2026లో విడుదల కానున్న మూడో బీరెడీ నివేదికలో భారత్‌ను కూడా చేర్చనున్నట్టు ఆయన వివరించారు. దేశంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం పలు చర్యలు చేపట్టిందని జితిన్ ప్రసాద అన్నారు. ఇందులో భాగంగా 2014లో వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించినట్టు తెలిపారు. సింగిల్ విండో వ్యవస్థలు, భవన నిర్మాణ అనుమతుల సరళీకరణ, డిజిటల్ సేవలు వంటివి ఇందులో భాగమని పేర్కొన్నారు.

ఈ ప్రణాళిక కింద ఇప్పటివరకు ఏడుసార్లు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేసినట్టు మంత్రి వివరించారు. దీని ద్వారా రాష్ట్రాల స్థాయిలో 9,700కు పైగా సంస్కరణలు అమలయ్యాయని తెలిపారు. 2020లో ప్రారంభించిన నిబంధనల భారం తగ్గింపు కార్యక్రమం కింద వ్యాపారాలు, పౌరులపై భారం మోపుతున్న 47 వేలకుపైగా నిబంధనలను గత ఐదేళ్లలో తగ్గించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

# ఎఫ్‌స్టీన్ ఆస్తి మొత్తం ప్రియురాలికే..

### వీలునామా రాసిన ఎఫ్‌స్టీన్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 10:** లైంగిక నేరగాడు, అమెరికా ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడి ప్రియురాలు, బెలారస్‌కు చెందిన డెంటిస్ట్ కరీనా షులియాక్ ఎప్‌స్టీన్ ప్రధాన వారసురాలని, జైలు నుంచి అతను చేసిన చివరి ఫోన్ కాల్ ఆమెకేనని తాజాగా విడుదలైన పత్రాలు వెల్లడించాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్" కింద అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన డాక్యుమెంట్లలో ఈ వివరాలు బయటపడ్డాయి. ఎప్‌స్టీన్ ఆగస్టు 10, 2019న జైలులో ఆత్మహత్య చేసుకోగా, దానికి కేవలం రెండు రోజుల ముందు అంటే ఆగస్టు 8న "ది 1953 ట్రస్ట్" పేరుతో తన ఆస్తినంతా బదిలీ చేశాడు. ఇందులో ప్రధాన లబ్ధిదారుగా కరీనా షులియాక్ పేరును చేర్చాడు. సుమారు 100 మిలియన్ డాలర్ల వరకు ఆస్తి, న్యూయార్క్, పారిస్‌లోని ఇళ్లు, 33 క్యారెట్ల వజ్రపు ఉంగరాన్ని ఆమెకు ఇవ్వాలని వీలునామాలో పేర్కొన్నాడు. పెళ్లి చేసుకోబోతున్నందున ఈ ఉంగరాన్ని ఇస్తున్నట్లు చేతిరాతతో రాసిన నోట్ కూడా ఈ పత్రాల్లో ఉంది. ఆగస్టు 9, 2019 సాయంత్రం, అంటే చనిపోవడానికి ఒక రోజు ముందు, ఎప్‌స్టీన్ జైలు నుంచి చివరిసారిగా ఫోన్ చేసింది కూడా కరీనాకే. నిబంధనలకు విరుద్ధంగా, రికార్డ్ చేయని ఈ కాల్ చేసేందుకు జైలు అధికారులు అనుమతించారు. 2004లోనే చనిపోయిన తల్లికి ఫోన్ చేస్తున్నానని చెప్పి అతను కరీనాతో మాట్లాడినట్లు ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫీస్ నివేదిక ధ్రువీకరించింది. ఎప్‌స్టీన్ ఆస్తి విలువ మొదట్లో సుమారు 600 మిలియన్ డాలర్లుగా అంచనా వేసినా, బాధితుల కోసం ఏర్పాటు చేసిన నిధి నుంచి ఇప్పటికే 121 మిలియన్ డాలర్లు చెల్లించడంతో ఆస్తి విలువ గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం దీని విలువ సుమారు 127 మిలియన్ డాలర్లుగా ఉంది. బాధితులు, రుణదాతల క్లెయిమ్‌లు పరిష్కరించిన తర్వాతే వారసులకు ఏమైనా మిగులుతుందని ఎస్టేట్ న్యాయవాదులు చెబుతున్నారు.

## రూ.లక్షల్లో జీతం వదలి ఆటోడ్రైవర్‌గా బెంగళూరు టెకీ..

**బెంగళూరు, ఫిబ్రవరి 10:** కార్పొరేట్ జాబ్ అంటే రూ.లక్షల్లో జీతం.. సౌకర్యవంతమైన జీవితం ప్రారంభించడం అంత ఈజీ కాదని అర్థమైంది. ఖాళీగా కూర్చుంటే బయటి నుంచి వచ్చే మాటలు, చూపులు ఎప్పటికప్పుడు తాకుతూనే ఉన్నాయి. ఆ సమయంలో కుటుంబసభ్యులు అతడికి ఎంతో మద్దతుగా నిలిచారు. అప్పటి నుంచి రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికి చిన్న చిన్న ఉద్యోగాలు చేయడం ప్రారంభించారు. గిగ్ వర్కర్‌గా పనిచేశారు. ఇలా ఒక ఏడాది పనిచేసి, కొంత డబ్బు దాచుకున్నారు. స్వేచ్ఛగా పనిచేయగలిగే ఉపాధి గురించి ఆలోచించారు. చివరకు బ్యాంకులో రుణం తీసుకుని ఒక ఆటోరిక్షా కొనుగోలు చేశారు. ఇప్పుడు రోజుకు రూ.600-800 వరకు సంపాదిస్తున్నారు. గతంలో చేసిన ఉద్యోగంతో పోలిస్తే ఇది చాలా తక్కువ మొత్తం. కానీ ఎలాంటి ఒత్తిడి లేకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. రాకేశ్. రోజూ తన కస్టమర్లతో మాట్లాడుతూ కొత్తకొత్త విషయాలు తెలుసుకుంటున్నారు. అందులో ఆసక్తిగా ఉండే వీడియోలను షేర్ చేస్తున్నారు అని అతడి స్టోరీని 'బెటర్ ఇండియా' రాసుకొచ్చింది. ఈ కొత్త లైఫ్ తనకు మానసికంగా సంతృప్తిని ఇస్తోందని రాకేశ్ వెల్లడించారు. ఈ వీడియోపై నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి చాలా ధైర్యం ఉండాలి బాసూ అంటూ పోస్టులు పెడుతున్నారు.




## వారం - వర్జ్యం

11-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
నవమి ఉ.9.58
అనూరాధ ఉ.10.52
వర్జ్యం : సా.5.07-6.54
దు.ఉ.11.59-12.45
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కొద్దిపాటి మానసిక ఆందోళనకు గురిఅయినా, ఆచరణలో చెడు ఫలితాలను అందుకోరు. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి.

**వృషభం:** విదేశాలలో మీ బంధువుల నుండి సహాయసహకారాలను అందుకుంటారు. వాహనాల కొనుగోలు.

**మిథునం:** ముఖ్యమైన జటిలమైన సమస్యలు పరిష్కారమవుతాయి. సోదరులతో విభేదాలు తలెత్తుతాయి.

**కర్కాటకం :** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**సింహం:** సంతాన విద్యా విషయంలో నూతన బాధ్యతలు చేపడుతారు. కొత్త పెట్టుబడులకు అనుకూలం. వస్త్రలాభం.

**కన్య :** రాజకీయ, కళా రంగాలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

**తుల :** బ్యాంకు ఋణాలు మంజూరవుతాయి. దీర్ఘాలోచనలు కొనసాగుతాయి, నూతన విద్యావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** అన్ని అవకాశాలు అప్రయత్నంగా లభిస్తాయి. వివాదాస్పదమైన అంశాలలో తలదూర్చకండి.

**ధనుస్సు:** ఎంతగానో శ్రమించి వ్యయప్రయాసలకూర్చి ఓ కార్యక్రమాన్ని పూర్తి చేయగలుగుతారు. వాహన సౌలభ్యం.

**మకరం:** విద్యార్థినీ, విద్యార్థులు మరింత శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. ధనం అధికంగా ఖర్చు అవుతుంది. శ్రమ అధికం.

**కుంభం:** నిర్మాణ సంబంధమైన విషయాలు, స్పెక్యులేషన్‌కు సంబంధమైన విషయాలలో ఆచి, తూచి వ్యవహరించండి.

**మీనం :** కుటుంబ సమస్యల పైన దృష్టి సారిస్తారు. స్వయం కృతాపరాధాలు చోటు చేసుకుంటాయి. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జీవన నైపుణ్యాలు, క్రమశిక్షణతోనే యువత భవితవ్యం: శ్రీరాం రాజగోపాల్



సభలో ప్రసంగిస్తున్న టిడిపి జాతీయ కోశాధికారి, శ్రీరాం రాజగోపాల్, వేదికపై మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, విద్యావేత్తలు.

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** జీవన నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ క్రమశిక్షణ అలవర్చుకోవటం ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, నేటి ఆధునిక సామాజిక వ్యవస్థలో నైపుణ్యాలకే అత్యధిక ప్రాధాన్యత ఉన్నదని టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో మంగళవారం లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫేర్వెల్ ఫెస్ట్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజగోపాల్, ఆత్మీయ అతిథిగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ యువతను దిశానిర్దేశం చేస్తూ లక్ష్య సాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆత్మీయ అతిథి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు లైఫ్ స్కిల్స్ ను అధ్యయనం చేసుకుని నైపుణ్యాలతో రకరకాల ఉపాధులను అవలీలగా సాధించుకోవచ్చునని అన్నారు. కాగా కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, ప్రెసిడెంట్ కొత్తమాసు మల్లిఖార్జునరావు, కార్యదర్శి-కరస్పాండెంట్ పెనుగొండ వెంకటరాజీవ్, ప్రిన్సిపాల్ తంగెళ్ళ వెంకటేశ్వరరావు, పలువురు విద్యావేత్తలు షేక్ కరీమ్, భరద్వాజ్, జూటూరి వెంకటేశ్వర్లు, కొల్లా నాగమహేష్, మైనేని రాధా, మన్నె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కాగా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన దిశలో మోడల్ మున్సిపాల్టీగా తీర్చిదిద్దే క్రమంలో దాదాపు రూ.100 కోట్లతో పనులు జరుపుతలపెట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం 29, 30, 31 వార్డుల్లో సుడిగాలి పర్యటనచేసి ప్రతి ఇంటికి వెళ్లి నివాసితులతో మమేకమయ్యారు. వారి స్థితిగతులను తెలుసుకోవటంతోపాటు సమస్యలను పరిష్కరించే దిశలో మున్సిపల్ అధికార యంత్రాంగానికి ఆదేశించారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ ను ఆవిష్కరించారు. సామాజికవేత్త, కర్లపాటి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కర్లపాటి వెంకటశ్రీనివాసరావు ఇటీవల కాలంలో ప్రభుత్వం ద్వారా రెండు ప్రతిష్టాత్మక గుర్తింపులు పొందిన సందర్భంగా ప్రైవేట్ విద్యాసంస్థల రాష్ట్రనేత, వైఎస్ఆర్సీపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు మంగళవారం అభినందిస్తూ సత్కరించారు. సేవలు చాలా మంది చేస్తారని, సమాజానికి వర్తమానంలో ఆశావహమైన అంశాల్లో కర్లపాటి స్ఫూర్తిదాయక సేవలు అందిస్తూ గుర్తింపు పొందటం ప్రశంసనీయమని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్ఆర్సీపి అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓంకారజ్యోతిర్లింగస్వామి శివరాత్రి వేడుకగా నిర్వహిస్తాం ఆలయ కమిటీ సభ్యులు



**తిరుపతి,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదల్ల చెరువు గ్రామంలో వెలసిన ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు 15వ తేదీ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కపిల తీర్థం నంది విగ్రహం వద్ద శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని నూతన రంగులతో సుందరంగా ముస్తాబు చేసి, విద్యుత్ దీపాల అలంకరణను పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. మహాశివరాత్రి రోజున ఉదయం నుండి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు 16న సోమవారం గంగ గౌరీ సమేత పరశురామ స్వామివారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర స్వామి, ఆలయ కమిటీ సభ్యులు సింగంశెట్టి సుబ్బరామయ్య,జంగం శెట్టి ముని సుబ్రహ్మణ్యం , లోక ప్రభాకర్ నాయుడు, ఆదం అనిల్ రెడ్డి ,జనార్దన్ రెడ్డి , తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అన్నారెడ్డి రాజశేఖర్ రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి,కె ఎన్ రాజా పాల్గొన్నారు.

# శాసనసభ చర్చలకు రాకపోవడం ప్రజలిచ్చిన అధికారాన్ని అవమానించినట్లే: ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు



**గుంటూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీలో జరిగే చర్చలకు దూరంగా ఉండటం అంటే ప్రజలిచ్చిన అధికారాన్ని అవమానించినట్లే అని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. రేపటి నుంచి 16వ శాసనసభ ఐదవ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, శాసనసభ సభ్యుల విధులు, బాధ్యతలు గుర్తు చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం. శాసన వ్యవస్థను గౌరవించడం, సభలో ప్రజా సమస్యలు ప్రస్తావించడం, రాష్ట్ర అభివృద్ధిపై జరిగే చర్చల్లో పాల్గొనడం, చట్టాల రూపకల్పనలో సలహాలు సూచనలు ఇవ్వడం.. ఇవన్నీ ఒక శాసన సభ్యుడికి ఉన్న ప్రాథమిక బాధ్యతలు. కానీ వైసీపీ శాసనసభా పక్షం గత నాలుగు సమావేశాలకు డుమ్మా కొట్టడం ద్వారా ఆ బాధ్యతలను పూర్తిగా విస్మరించింది.సభకు రాకుండా అరాచక ప్రవర్తన - ఇది ఎమ్మెల్యేలకు తగునా? గవర్నర్ ప్రసంగం రోజున మొక్కుబడిగా రావడం, పేపర్లు చించేయడం, విసిరికొట్టడం, సభ నుంచి వెళ్లిపోవడం ఇదే వైసీపీ శాసన సభ్యుల తీరు. వేలాది మంది ఆశలతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు చేయాల్సిన పని ఇదేనా అని వైసీపీ ఎమ్మెల్యేలను, శాసనసభా పక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నిస్తున్నామన్నారు. 19 నెలలుగా చట్టసభ సభ్యులుగా మీ ప్రాథమిక బాధ్యతను నిర్వర్తించారా? చేయకపోతే శాసనసభ సభ్యులుగా కొనసాగేందుకు మీకు నైతిక అర్హత ఉందా?అని నిలదీశారు. నియోజకవర్గ సమస్యలపై నోరు మెదపని ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలను ఏనాడూ సభలో ప్రస్తావించని ఎమ్మెల్యేలు, చట్టాల రూపకల్పనపై ఒక్కసారి కూడా నిర్మాణాత్మక చర్చ చేయని శాసన సభ్యులు, శాసనసభ సభ్యులుగా వ్యవహరించడం ఎంతవరకు నైతికమో వైసీపీ నేతలు ఆలోచించాలన్నారు. శాసనసభ పట్ల గౌరవం ఉంటే, శాసన వ్యవస్థపై నమ్మకం ఉంటే, కనీసం ఇప్పుడైనా సభకు వచ్చి చర్చల్లో పాల్గొనాలి.ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వేదిక సిద్ధంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం అని, ఏ అంశంపైనైనా చర్చించడానికి, ఏ ప్రశ్నకైనా సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు.

# భారీగా అక్రమ గుట్కా, పాన్ మసాలా స్వాధీనం

## - రూ.19.17 లక్షల విలువైన స్టాక్ సీజ్



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** విజిలెన్స్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి భారీ ఎత్తున అక్రమ గుట్కా, పాన్ మసాలా నిల్వలను పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేదా బిల్లులు లేకుండా విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన సుమారు రూ. 19,17,787 విలువైన ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని పప్పుల వీధిలో గల భగవాన్ వెంకయ్య స్వామి ట్రాన్స్‌పోర్ట్, స్టోన్ హౌస్ పేటలోని రాజ్యలక్ష్మి ట్రాన్స్‌పోర్టలలో నిర్వహించిన సోదాల్లో వరుసగా రూ. 2.55 లక్షలు, రూ. 2.75 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను గుర్తించారు. అదే విధంగా కావలిలోని శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్‌కు చెందిన ముసునూరు వడ్డిపాలెం వద్ద ఉన్న వారి గోదాముపై అధికారులు దాడి చేశారు. ఈ తనిఖీల్లో సరైన రికార్డులు లేని 9,392 పాన్ మసాలా సాచెట్‌లతో పాటు ఇతర వస్తువులను సీజ్ చేశారు. వీటి విలువ రూ. 13.87 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.చట్టవిరుద్ధంగా ఇటువంటి నిషేధిత ఉత్పత్తులను విక్రయించినా లేదా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిఐ నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు,సంస్కృత అకాడమీలో పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ద్వారా ఖాళీగా ఉన్నపోస్టుల భర్తీ

## - ఆర్. డి. విల్సన్ శరత్ చంద్ర



మంత్రి లోకేష్ తో తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్

**విజయవాడ ఫిబ్రవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:**తెలుగు భాష నేర్పించడానికి వర్చువల్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని విద్యామంత్రి నారాలోకేష్‌ను తెలుగు,సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్. డి. విల్సన్‌శరత్ చంద్ర కోరారు.ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో మంగళవారం ఆయన క్యాంపు ఆఫీస్ లో తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్. డి. విల్సన్‌శరత్ చంద్ర అకాడమీ అంశాల మీద చర్చలు జరిపారు. సి ఆర్ డి ఏ లో రెండు ఎకరాలు కేటాయిస్తే అకాడమీ స్వంత నిధుల తో అకాడమీ భవనం నిర్మించుకుంటామని విల్సన్ కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాను అన్నారు. తెలుగు భాష వ్యాప్తి కోసం తమిళనాడు తరహాలో తెలుగు భాష నేర్పించడానికి వర్చువల్ అకాడమీ ఏర్పాటు కు అనుమతి ఇవ్వమని కోరారు. తమిళనాడులో వర్చువల్ అకాడమీ ద్వారా 45 దేశాల్లోని తమిళ ప్రజలతో పాటు.. ఇతర రాష్ట్రాలకు చెందిన మైగ్రేటడ్ లేబర్ మరియు కేంద్రీయ విద్యా సంస్థలలో విద్య నభ్యసించే వారికి తమిళం నేర్పించినట్టు ఇక్కడ కూడా నేర్పుతామని విల్సన్ మంత్రి కి తెలిపారు. ఇందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి కి 100 కోట్ల నిధులు కోరుతూ లేఖ రాసినట్టు విల్సన్ తెలిపారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం తప్పక కృషి చెయ్యాలని మంత్రి తెలియ చేస్తూ తెలుగు వర్చువల్ అకాడమీ స్థాపన కోసం ఒక ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయవల్సింది గా మంత్రి కోరారు. ఒకటి నుండి పదవతరగతి వరకూ పుస్తకాల ముద్రణ అకాడమీ ద్వారా చేపడతామని ఆ మేరకు అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు.తద్వారా అకాడమీ అభివృద్ధి చెందుతుందని విల్సన్ మంత్రిని అభ్యర్థించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. సంబందిత అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఇక అకాడమీ లోని పలు పోస్టులు భర్తీ చేయవలసి ఉందని ఆ పోస్టుల భర్తీ గురించి అకాడమీ పాలక మండలి తీసుకొన్న నిర్ణయం అమలు కోసం పోస్టు ల భర్తీ విషయంలో తగు ఆదేశాలు ఇవ్వాల్సింది గా విల్సన్ కోరారు.

# 'కల్తీనెయ్యి' దుమారంలో ఇక ఇడి విచారణ

## - ఎవరికెంత చేరిందో తేలనున్న లెక్కలు



**తిరుమల,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వెంకన్న లడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరా జరిగిన తీరు, టెండర్లు దక్కించుకున్న విధానం తదితర అంశాలు, దానివెనుక నడిచిన పెద్ద స్కామ్ లోతుగా తేల్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)రంగంలోకి దిగింది. ఇప్పటికే ఈ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలతో అంతిమంగా భారీగా కోట్లరూపాయలు లబ్ధిపొందిన సూత్రధారులు, పెద్దలను తేల్చేందుకు ఇడికి ఆదేశించింది. కల్తీనెయ్యి కేసులో తొలినుండి టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు పాల్గొనడం, తదుపరి నిబంధనలు ఉల్లంఘించి నెయ్యిసరఫరా చేయడం వంటి అంశాల్లో భారీగా ఆర్థిక లావాదేవీలు నడిచాయనేటి సిబిఐ సిట్ అధికారులు ఆధారాలు రాబట్టారు. ఈ నివేదికలను సుప్రీంకోర్టుకు అందజేయడంతో ఇప్పుడు ఇడి రంగంలోకి దిగింది. 2019-2024 మధ్యకాలంలో 68లక్షల కిలోల నెయ్యి కల్తీచేసి సరఫరా చేశారనేది, ఇందులో 235కోట్లు రూపాయలు అంచనాగా ఉండగా 36మందిని నిందితులుగా సిట్ తేల్చింది. వీరిలో 12మంది టిటిడి మార్కెటింగ్,కొనుగోళ్ళకమిటీ అధికారులే ఉండటం విశేషం. ఈ కేసుతో సంబంధం ఉన్నవారికి ఇడి నోటీసులు జారీచేసి ఆ దిశగా దర్యాప్తు, విచారణ చేపట్టేందుకు సమయం దగ్గరపడింది. ఇప్పటికే లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపానికి కారకులను గుర్తించిన సిబిఐ సిట్ అధికారులు పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తుచేపట్టి నివేదికలు అందించారు. 250కోట్ల రూపాయల మేరకు అవినీతి జరిగిందనే ఆరోపణలపై ఈ కేసులో ఇప్పుడు ఇడి సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కీలక విషయాలను బయటకు తీసుకురానుందనే సంచలనం కలిగిస్తోంది.

# హంస వాహనంపై పార్వతీ పరమేశ్వరులు



**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి10,ప్రభాతవార్త** మహాశివరాత్రిని పురస్కరించుకొని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజులపాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మూడవరోజున శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి.అనంతరం లోక కల్యాణం కోసం జపాలు,పారాయణలు చేయబడ్డాయి.అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు,జపానుష్ఠానాలు, నిత్యహవనాలు,రుద్రహోమం కార్యక్రమాలు శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి. హంస వాహనంపై పార్వతీ పరమేశ్వరులు-ఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగా మంగళవారంనాడు సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు హంస వాహనసేవ జరిపించబడింది.ఈ సేవలో శ్రీస్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో హంస వాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.తదుపరి ఆలయ రాజగోపురం నుండి వెలుపలకు తోడుకోని వచ్చి గంగధర మండపం నుండి ప్రధాన వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు.హంస వాహనంపై దర్శనమివ్వడంతో భక్తులు శివనామస్మరణంతో కన్నులారా వీక్షించి మురిసిపోయారు.గ్రామోత్సవంలో శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్‌నాయుడు,ఈవో యం.శ్రీనివాసరావు దంపతులు,అధికారులు,భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవంలో నాదస్వరం,కోలాటం,చెక్కభజన,రాజభటులవేషాలు,కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం,ముంబాయ్ డోల్ ధేష్,కాళికా నృత్యం,జానపద పగటి వేషాలు, నందికోలుసేవ, గొరవనృత్యం,తప్పెటచిందు,బీరప్పడోలు,నందికోలసేవ,ఢమరుకం,తదితర కళారూపాలను గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని మాజీ సిఎం జగన్ కీలక నిర్ణయం

## నేడు సమావేశాలకు జగన్‌తో సహా వైసిపి సభ్యులంతా హాజరు

**విజయవాడ.ఫిబ్రవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని మాజీ సీఎం జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బుధవారంనుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజున గవర్నర్ ప్రసంగంతో సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశాలకు వైసీపీ హాజరు పైన కొద్ది రోజులుగా చర్చ జరుగుతోంది. తాజాగా పార్టీ నేతలతో భేటీ సమయంలో జగన్ సభకు హాజరు పైన స్పష్టత ఇచ్చారు. జగన్ తో పాటుగా ఎమ్మెల్యేలు సభకు హాజరు కానున్నారు. అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కాగా.. వైసీపీ ఇదే సమయంలో మరో ఆసక్తి కర నిర్ణయం తీసుకుంది.గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో సమావేశాలను ప్రారంభించనున్నారు. ఆ తరువాత బీఏసీ సమావేశంలో సభ నిర్వహణ.. అజెండా.. ఎన్ని రోజులు సమావేశాలు కొనసాగించాలనేది నిర్ణయించనున్నారు. కాగా, సమావేశాల తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి హాజరు కావాలని మాజీ సీఎం జగన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజు మాజీ సీఎం హోదాలో జగన్ వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతి పైన శాసనసభా వర్గాలను వైసీపీ నేతలు ఆరా తీసినట్టు తెలిసింది. ఇందుకు శాసనసభ వర్గాలు కూడా సుముఖతను వ్యక్తం చేసినట్టు సమాచారం. 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, గవర్నర్ ప్రసంగ కార్యక్రమాల కోసం అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు వచ్చారు. ఆ తర్వాత నుంచి శాసనసభా సమావేశాలను బాయ్‌కాట్ చేస్తూ వస్తున్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.గవర్నర్ కు గౌరవం ఇచ్చేలా ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఓడిన తరువాత గవర్నర్ ప్రసంగానికి మాత్రం హాజరు అవుతున్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నిరసనకు దిగే అవకాశం కనిపిస్తోంది. తమ పార్టీ నేతల ఇళ్ల పైన జరిగిన దాడుల పైన నిరసనకు దిగాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశం తరువాత పార్టీ ఎమ్మెల్సీలు.. ఎమ్మెల్యేలతో జగన్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. భవిష్యత్ కార్యాచరణ పైన దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా.. ఎమ్మెల్యేల గైర్హాజరు పైన కూటమి నేతలు వరుసగా విమర్శలు చేస్తున్నారు. సభకు హాజరు కాకుండానే జీత భత్యాలు తీసుకొంటున్నారని.. వారి పైన చర్యలు తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటు ప్రభుత్వం పైన రాజకీయం గానూ ఒత్తిడి పెంచే వ్యూహాలతో జగన్ సిద్దం అవుతున్నట్లు సమాచారం. దీంతో.. పార్టీ నేతల సమావేశంలో జగన్ ప్రకటించే నిర్ణయాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

# తిరుమల సమాచారం

# ఎస్వీ ఆయుర్వేద కళాశాలను అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లాలి : టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,పిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలను దేశంలోనే అత్యుత్తమ కళాశాలగా తీర్చిదిద్దాలని టిటిడి జెఇఒ (వైద్య, విద్య) డాక్టర్ ఎ. శరత్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఎస్వీ ఆయుర్వేద కళాశాల , అనుబంధ వైద్యశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జెఇఒమాట్లాడుతూ కళాశాల , వైద్యశాలలో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రాచీన ఆయుర్వేదంలోని విశిష్టతను నేటి తరానికి చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేద వైద్యులు ప్రణాళికాబద్ధంగా పరిశోధనలు చేపట్టి మార్గదర్శకులుగా నిలవాలని కోరారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కళాశాలలోని సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల సమస్యలు, కళాశాల మౌలిక సదుపాయాలు, సిబ్బంది, భద్రత వంటి అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు ఆయుర్వేదంలో నూతన పరిశోధనలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు.అంతకుముందు ఆయన విద్యార్థులతో ముచ్చటించి, వారి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బోధనా సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్ కళాశాల పురోగతి, వైద్యశాలలో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలను జెఇఒకు వివరించారు.

# భూత వాహనంపై సోమస్కంధమూర్తి



**తిరుమల,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు మంగళవారం ఉదయం సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మ సమేతంగా భూత వాహనంపై అభయమిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. భూతాలను వశీకరించి శ్మశానాలలో ఉంచి బ్రహ్మసృష్టిని రక్షిస్తున్నాడని, నాటి నుండి 'భూతపతిగా కీర్తించే జీవులకు భయాలను తొలగించి శివుడు రక్షి స్తున్నాడని భక్తుల విశ్వాసం. అందుకు ప్రతీకగా లయకారుడు భూతవాహనంపై అభయమిచ్చారు. ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం చేపట్టారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీకామాక్షి దేవిలకు చందనంతో అభిషేకం చేశారు. ఈ వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, అదికారులు, ఆలయ అర్చకులు, ,భక్తులు పాల్గొన్నారు.

# బంగారుదేవుడికి భూరి విరాళాలు

## - పలు ట్రస్ట్‌లకు రూ.1.40కోట్లు అందజేత



**తిరుమల,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి దాతలు తమవంతుగా విరాళాలందించి భక్తిని ,సేవానిరతిని చాటుకుంటున్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బంగారుదేవుడుగా కూడా ఖ్యాతి చెందాడు. ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లకు దాతలైన భక్తులు మంగళవారం భూరీ విరాళాలందించారు. ఒక్కరోజే 1.40కోట్ల రూపాయలు విరాళాల డిడిలు టిటిడికి అందాయి.

-ఎస్వీప్రాణదానంకు రూ.కోటి: హైదరాబాద్ కు చెందిన గుత్తా శ్రీహర్షసాయి చౌదరి శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు మంగళవారం కోటి రూపాయలు విరాళంగా అందించారు.తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు డిడి అందజేశారు.ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

-పలు ట్రస్ట్‌లకు రూ.30లక్షలు: హైదరాబాద్ కు చెందిన స్మార్ట్ సాఫ్ట్ వేర్,మోహన్ ఇండస్ట్రీస్ అధినేత యలమంచిలి మదన్మోహన్ రావు మంగళవారం టిటిడికి 30 లక్షలు రూపాయలు విరాళాలిచ్చారు. దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి చైర్మన్ బీఆర్‌నాయుడుకు డిడిని అందజేశారు. ఈ విరాళాన్ని శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్‌తో బాటు ఇతర ట్రస్టులకు వినియోగించాలని దాత కోరారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఉన్నారు.

-రూ.10లక్షలు విరాళం : గుంటూరుకు చెందిన ఎన్.సుధారాణి టిటిడి ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు మంగళవారం 10,01,116 రూపాయలు విరాళంగా అందించారు. తిరుమలలోని అదనపు ఇఒ క్యాంపు కార్యాలయంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి డీడీని అందజేశారు.

# మార్చిలోపు ఐఒసి గ్యాస్‌ప్లాంట్ పూర్తి

## - వసతి గదుల్లో సమస్యలపై టిటిడి చైర్మన్ నాయుడు ఆరా

**తిరుమల,పిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో కాకులమానుతిప్ప వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఐఒసీఎల్ గ్యాస్ ప్లాంట్ పూర్తిస్థాయిలో మార్చినెలాఖరు లోపు పనులు చేపట్టి,మేనెలలో అందు బాటులోకి తీసుకురావాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధికారులను ఆదేశించారు. మే నెల నుండి ఈ గ్యాస్‌ప్లాంటు ద్వారా కార్యాకలాపాలు ప్రారంభించాలన్నారు. రోజుకు 40 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి సామర్థంతో ప్లాంట్ నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా టిటిడికి సంవత్సరానికి 1.52 కోట్లు రూపాయలు ఆదా అవుతుందని, చెత్తను పునర్వినియోగించడంతో తిరుమల డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోకుండా ఉంటుందని ఛైర్మన్ తెలిపారు. అలాగే వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులతో మంగళవారం ఉదయం సుదర్శన్ సత్రాలవద్ద ఛైర్మన్ బిఆర్‌నాయుడు మమేకమై టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలపై స్వయంగా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్ సత్రాన్ని తనిఖీ చేసి గదుల్లో వాటర్ లీకేజీని అరికట్టాలని ఆదేశించారు. ఈ భవనాన్ని ఆధునీకరణ, పునర్నిర్మాణం చేసే విధంగా అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అక్కడ ఉన్న ఫుడ్ కౌంటర్ లో శ్రీవారి సేవకులతో కలిసి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. అన్న ప్రసాదాల రుచి, నాణ్యత గురించి భక్తులనుండి ఏవిధంగా ఉందని ఆరా తీశారు. భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి పక్కనే ఉన్న టీ దుకాణంలో తేనీరుసేవించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు సోమన్నారాయణ, భాస్కర్, విఎస్‌ఒ సురేంద్ర, సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, ఆరోగ్యఅధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

## నా జన్మలో ఇదో చరిత్రాత్మకం - సంకల్పయాత్ర దీక్షతో శ్రీవారి దర్శనంలో బండ్లగణేశ్

**తిరుమల,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** గతంలో టిడిపి చంద్రబాబును అరెస్ట్ చేసిన సమయంలో ఆయనకు అన్ని విధాలా తోడుగా ఉండాలని స్వామిని వేడుకున్నాను.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండర్ ప్రకటనల వివరాలను చూడవచ్చును.
టెండర్ ప్రకటన నం. G/E.29/Tr./ టెండర్ ప్రకటన /50/2025-26
భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్ వారు క్రింది పనులకు ఇ-టెండర్లను కోరుతున్నారు.
టెండర్ నం.: GTL-TRD-29-eTN-81-2025-26, పనిపేరు: GTL డివిజన్: గూటీ-రేణిగుంట సెక్షన్‌లో మంగపట్నం స్టేషన్ వద్ద UP లూప్ లైన్‌కు కామన్ లూప్ సౌకర్యాల కొరకు క్రాస్ ఓవర్స్ ఏర్పాటు. సుమారు విలువ : (రూ).60,95,243.60. బయానా : (రూ).1,21,900/-.
టెండర్ ముగింపు తేదీ మరియు సమయం: 02.03.2026 15.00గం. వరకు.
గమనిక: టెండర్‌దారులు టెండర్ డాక్యుమెంట్‌ను www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
టెండర్ బిడ్డింగ్ కొరకు మరియు ఇతర వివరాలకు http://www.ireps.gov.inకు లాగిన్ అవ్వండి. సవరణ ఏదైనా ఆన్‌లైన్ మాత్రమే జారీ చేయబడును.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్.
A2419
తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
టి.సం. 26(1-3)TO/Adoni/2025-26 తేది: 07.01.2026
కర్నూలు జిల్లా, ఆదోనిలో రహదారి భద్రతా పనులు 3 కొరకు అంచనా విలువ: రూ.4.45 లక్షలు 3 పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు స్వీకరణకు తేదీ మరియు సమయం ప్రారంభం: 12.02.2026 నుండి 17.02.2026కు. వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ https://tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, ఆదోని.
DIPR.NO. 19040/CL/ADVT/1/1/2022-23 తేది: 10.02.2026


వార్త

జీవితంలో ప్రతి నిమిషాన్ని వ్యర్థం చేయక ఉపయోగించుకో! లేకుంటే నీవు వృథా చేసినట్టి కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.

-నెపోలియన్

# ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రకంపనలు

కొందరు ప్రముఖుల రహస్య జీవితాలు, వ్యవహారాలను బయటపెడుతున్న ఎప్‌స్టీన్ ఫైళ్లు ఇప్పుడు ప్రపంచంలోనే కలకలం సృష్టిస్తున్నాయి. అందులో నిజానిజాల లోగుట్టు పెరుమాళ్లకెరుక. అయినా ఆ ఫైళ్లలోని సమాచార నేపథ్యంలో ప్రస్తుతం యూరప్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తింది. అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన పత్రాలలో ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సంబంధించి కూడా కొన్ని అవాకులు చెవాకులు ఉన్నాయన్నది ఆ ఫైళ్ల సమాచారంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాధినేతలు, ప్రముఖులు, వారి వందిమాగధులు వగైరా అన్ని శ్రేణులకు చెందిన వారి రహస్య వ్యవహారాలు బట్టబయలవుతున్నాయి. ఉన్నవీ, లేనివీ, కనుగొన్నవీ కూడా పలు ఊహాగానాలతో ప్రపంచ రాజకీయాలను గడగడలాడిస్తున్నాయి. ఉన్నతస్థాయి వ్యక్తులపై ఈఫైళ్ల ద్వారా బయటపడిన విషయాలు, తద్వారా చెలరేగిన ఆరోపణలపై విచారణలు జరుగుతున్నాయి. ఇందులోని సమాచార నేపథ్యంలో కొంతమంది రాజకీయ పార్టీల అధినేతలు మంత్రులు సైతం రాజీనామాలు చేయాల్సి వస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో వివిధదేశాల్లో రాజకీయాలు ఎంతో చిత్ర విచిత్రంగా ఉంటాయి. ఆరోపణలు రాగానే కొన్ని దేశాల్లో ఆరోపణలెదుర్కొనవారు నిజానిజాలు వచ్చేలోపున అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం కానీ రాజీనామా చేసి ప్రజాబాహుళ్యం నుంచి అదృశ్యమైపోవడం, లేదా పదవి నుంచి వైదొలగాల్సి రావడం కూడా మామూలుగా జరిగేదే! యూరప్ దేశాల్లో ఎప్‌స్టీన్ ఫైళ్ల దుమారం ఎక్కువగా ఉంది. అమెరికాలో వీటి ప్రభావం ప్రస్తుతం తటస్థంగా ఉండగా, భారత్‌లో మాత్రం ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. భారత ప్రధాని నరేంద్రమోడీ, ఆయనకు అనుకూలంగా పనిచేశారని చెప్పబడుతున్న ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ గురించి ఎక్కువ విషయాలు ఈ ఫైళ్ల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆఖరికి చైనా దేశానికి సింహస్వప్నంగా ఉన్న టిబెట్ మత గురువు దలైలామా గురించి ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎప్‌స్టీన్ అనేవ్యక్తి లైంగిక నేరస్థుడు. అమెరికా ఫైనాన్షియల్ ఏనాడో పట్టుబడి జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆయన పత్రాలు ప్రముఖులందరినీ వేధిస్తున్నాయి. కానీ అతని సామ్రాజ్యం చాలా విస్తృతమైందని, రాజకీయ ప్రముఖు లు వ్యక్తిగత ప్రవర్తనలోని లోపాల గురించి ప్రత్యేకంగా రూపొందించిన పత్రాల్లోని అంశాల్లో అతి ప్రమాదకరమైన సమాచారం ఉందని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకుటుంబీకులు, బిలియనీర్లు, రాజకీయ మేధావులు దౌత్యవేత్తలు సైతం 'ఎప్‌స్టీన్' ఉచ్చులో పడ్డారని తెలియ వచ్చింది. ఎప్‌స్టీన్‌ను కలిసిన వారు, కలియని వారు, సోషల్ మీడియా ద్వారా వివిధ వాట్సాప్ సంకేతాల ద్వారా పరస్పరం చర్చించుకుంటూ 'లింక్'లో ఉన్నవా రందరి గురించిన విషయాలు ఈఫైళ్ల ద్వారా బట్టబయ లయ్యాయి. బ్రిటన్‌లో ప్రధానమంత్రి పదవికి ప్రధానంగా ఇబ్బందులేర్పడ్డాయి. అమెరికాలో బ్రిటన్ మాజీరాయబారి మాండెల్సన్‌కు అతనితోలింకులున్నట్లు బయట పడగానే బ్రిటన్ ప్రధాని కీర్ స్మార్టర్ సమస్యల్లోపడ్డారు. 2024లో బ్రిటన్ అత్యున్నత దౌత్య పదవిలో మాండెల్సన్‌ను నియ మించారు. కాగా మాండెల్సన్‌కు ఎప్‌స్టీన్‌కు స్నేహపూర్వక లింకులున్నాయని బహిర్గతం కావడంతో గత సెప్టెంబరులోనే ఆయనను బ్రిటన్ ప్రధానికీ స్టార్టర్ తొలగించారు. అలాంటి వ్యక్తిని కీర్‌స్మార్టర్ నమ్మడమంటే పద్ధతిగాలేదనే ఆరోపణలను బ్రిటన్ ప్రధాని ఎదుర్కొంటున్నారు. అంతేకాదు బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన అతి కీలక సమాచారాన్ని మాండెల్సన్ ఎప్‌స్టీన్‌కు అందించారన్న ఆరోపణలు తలకెత్తుకున్నారు. తీవ్ర ఆరోపణలున్నా ఈ అంశంలో తనను తప్పుపట్టేదేమీ లేదన్న ప్రధాని పదవికి రాజీనామా ఆలోచన ఏదీ లేదని కీర్‌స్మార్టర్ స్పష్టం చేశారు. అలాంటి నియామకం తన చేతుల మీదుగా జరుగకుండా ఉండాల్సిందన్న అభిప్రాయాన్ని చెబుతూ ఆయనే స్వయంగా విచారం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలోనే స్మార్టర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మోర్గాన్ మేక్ స్వీనే రాజీనామా చేశారు. మెండల్సన్ గురించి తానే సిఫార్సు చేసినందున నైతిక బాధ్యతగా తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇక మరోప్రముఖుడు బ్రిటన్ రాజకుటుంబ సభ్యుడు ప్రిన్స్ ఆండ్రూ కూడా ఎప్‌స్టీన్‌తో సాన్నిహిత్యం ఉన్నవారేనని తేలింది. బ్రిటన్ వాణిజ్య ప్రతినిధిగా ఉన్న సమయంలో ప్రభుత్వ రహస్య నిర్ణయాలు, పెట్టుబడుల వ్యవహారాలను తన అధికారిక పర్యటనలకు సంబంధించిన అంతర్గత విషయాలను ఎప్‌స్టీన్‌కు ఈ మెయిల్స్ ద్వారా సమాచారాన్ని పంపారు. జోర్డాన్‌లో నార్వే రాయబారిగా ఉన్న మోకా జూల్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆమెతోపాటు మరో దౌత్యవేత్తటెర్జే రోడ్‌లారెన్స్‌కు ఎప్‌స్టీన్ నుంచి 10మిలియన్ డాలర్ల లబ్ధి సమకూరింది. స్లోవేకియా జాతీయ భద్రతా సలహాదారు మకోస్లావ్ లజ్కాక్ కూడా పదవిని త్యజించారు. ఏరకమైన పదవి లేకుండానే ఎప్‌స్టీన్ వంటి లైంగిక నేరస్థుడు ఇంతమంది జీవితాలతో ఎందుకుఆడుకున్నాడు. అదే పనిగాప్రముఖుల రహస్య విశేషాలను వెలికి తీసి వారితో సంబంధాలు నెరపి ఈమెయిల్స్‌ద్వారా పరస్పర సమాచారాన్ని రాబట్టి వారి జీవితాలను భ్రష్టు పట్టించాడు. ఇలాంటి ఫైళ్లు ఎలాంటి ఉద్దేశంతో సేకరించినా ప్రముఖుల జీవిత విశేషాలు, వ్యవహారాలు బయటపడడంతోనే ఆయా దేశాల్లో రాజకీయ గందరగోళం చెలరేగుతోంది. పోలాండ్, లాట్వియా లిథువేనియా వంటి దేశాల తోనే కాకుండా ఇంకా రష్యా, ఇతర దేశాల నిఘా సంస్థల నుండి ఏవైనా రహస్య సమాచారంలో ఏవిషయాలు దాగి ఉంటాయన్న అంశాలపై ప్రపంచ నేతలలో గుబులు బయలుదేరింది.



మనలో చాలా మందికి ఏమీ తెలియదు. తెలిసిన కొద్దిపాటి జ్ఞానంతో మనల్ని మనం గొప్పగా ఊహించుకుంటాం. ఇదే మన అజ్ఞానం.

సోక్రటీస్



క్రమశిక్షణ నుండే జీవితం తన విలువను పొందుతుంది. కాబట్టి జీవితపు క్రమశిక్షణ అన్నది జీవితం కంటే చాలా అమూల్యమైనది.

తిరుక్కురళ్

## ప్రజావాక్కు



### నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాట్సాప్

**భారతదేశంలో** ప్రజా సంభాషణల విధానాన్ని సమూలంగా మార్చిన సందేశ మార్పిడి వేదిక వాట్సాప్. వ్యక్తిగత సంభాషణల నుంచి వాణిజ్యలావాదేవీల దాకా, కుటుంబ సమూహాలనుంచి కార్యాలయసమన్వయం వరకూ స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో ఈ వేదిక ఒక అనివార్య భాగమైంది. అటువంటి పరిస్థితుల్లో, ఇటీవలి కాలంలో భారత అత్యున్నత న్యాయస్థానం చేసిన గంభీర వ్యాఖ్యలు దేశడిజిటల్ భవిష్యత్తుపై సుదీర్ఘ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిణామాలు కేవలం ఒక సంస్థకు సంబంధించినవి కావు, ఇవి కోట్లాది మంది భారతీయుల డిజిటల్ హక్కులకు సంబంధించినవి. ఈ వ్యవహారానికి ప్రధాన నేపథ్యం 2021లో సదరు సంస్థ తన గోప్యతా విధానంలో చేసిన వివాదాస్పద మార్పులు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని తన అనుబంధ సామాజిక మాధ్యమ వేదికలతో పంచుకునేలా నిబంధనలను రూపొందించడం జరిగింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### దోమల బెడదను నివారించాలి

**రాష్ట్రంలో** దోమలు అధికంగావిహరిస్తూఉన్నాయి. దీంతో ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం వేళ బయట వాకింగ్ చేస్తున్న పెద్దలు, బయట ఆడుతున్న పిల్లలు విపరీతమైన దోమలతో ఇబ్బందిపడుతున్నారు. దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వంచర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలి. వేసవికాలం ప్రారంభమౌతున్న నేపథ్యంలో వేడి నుండిఉపశమనానికైఆరుబయటకు వస్తారుకావునా దోమలభారి నుండికాపాడాల్సిన భాధ్యతప్రభుత్వంపైనే ఉంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### పెరుగుతున్న వాయు కాలుష్యం

**దేశంలో** మహానగరాలు వాయుకాలుష్య కోరల్లో చిక్కుకునిఉన్నాయి. దేశరాజధాని అందులో ప్రధానంగా ఉంది. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికరవాయువులు విస్తరించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్థితి వస్తుంది. ఇది ఏరీతిలోమనిషికి మంచిది. వాయుకాలుష్యాన్ని అరికట్టాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### చెత్తతో విద్యుత్ ఉత్పత్తి

**తమిళనాడు** ప్రభుత్వం ఆరాష్ట్రంలో పేరుకుపోతున్న లక్షల టన్నుల చెత్తను తగల బెట్టకుండా దానిని శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సంకల్పించిదని వార్తలో చదవడం జరిగింది. ఇటువంటి పద్ధతి మరీ కొత్త విషయం కాకపోయినా ఈదశగా ప్రయత్నాలు చేయడం లేదు. మన తెలుగు రాష్ట్రాలు తమ అధికారులను తమిళనాడుకు పంపి వారు తీసుకున్న సాంకేతికతను తెలుసుకుని మనవాళ్ళు కూడా విద్యుతుత్పత్తి చేస్తే కరెంటు కొరత తగ్గుతుంది. రాబడి పెరుగుతుంది. కాదేదీ కవితకనర్హం అన్నట్టు సరిగా ఉపయోగించుకోవడం తెలిస్తే పనికిరాని వస్తువేదీ ఉండదు.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### భూమి కబ్జాలను ఆపాలి

**రెవిన్యూ** కార్యాలయంలో ప్రతి భూమి సర్వే నంబర్, విస్తీర్ణం, మ్యాపులు ఉండాలి. ప్రభుత్వం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కాలనీ వివరాలు అన్ని ఉండాలి. కానీవరంగల్ జిల్లాలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగాజరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కబ్జాలు చేసిన వారిని, అక్రమ నిర్మాణం చేసిన వారిని పట్టించు కోవడం లేదు. రెవిన్యూ అధికారులు రికార్డులులేవుఅంటున్నారు. భూమికబ్జాలకు రాజకీయజోక్యం తోడుగా ఉంటుంది. అధికా రులు రికార్డులు లేవు అని సాకులు చెప్పి రోజులు నెలలు సంవత్సరాలు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనితో భూమి కబ్జాలు ఎక్కువ అవుతున్నాయి. భూమిని కోల్పోయిన వాళ్లు రెవిన్యూ అధికారులకు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వీరికి సహాయం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### మొక్కజొన్న దిగుమతులు ఎందుకు?

**అమెరికాతో** వాణిజ్యఒప్పందానికి భారత్ఎందుకు తల ఊపింది అన్నదే ప్రధాన ప్రశ్న. అయితే అంత చేసి ఒక్క 2.5 కిలోల మొక్కజొన్న ఒక్కమనిషికి అన్నదిమాత్రమే. అక్కడి అధికారులు భారత్‌ను ఉద్దేశిస్తూ అన్న మాటలు ఆమెరికా వాణిజ్య కార్యదర్శిమాట్లాడుతూ ఇంత సిరిసంపదలు ఉన్నభారత దేశం ఒక్క మనిషి కి 2.5 కిలోల మొక్కజొన్న కొనలేదా అన్నది ఆయన వేసేప్రధాన ఆరోపణలు. ఈనేపథ్యంలో నుండిఅమెరిక జిత్తుల మారితనాన్ని అర్థంచేసుకోవాలి. భారత్‌లో మొక్కజొన్న ప్రధాన పంటలలోఉన్నది. మళ్లీ దిగుమతిఎందుకు అనేది ప్రధాన ప్రశ్న.

- భారత అవినాష్, జనగామ

**మన వి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నిధుల కొరత..నిబద్ధత కరవు

**ఒక్కమాటలో చెప్పాలంటే తెలుగురాష్ట్రాలలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలూ తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికికారణం. స్వయంకృతాపరాధం కొంత ప్రభుత్వాల అశ్రద్ధ మరికొంత ప్రధాన ఆదాయ వనరులపై పాలకవర్గాలు చిన్నచూపు. తమకు కావాల్సిన నిధులన్నీ రాష్ట్రప్రభుత్వమే ఇవ్వా లన్న ధోరణితో చాలామంది స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు. దేశంలో పట్టణాభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తమకివ్వకుండా తమకిష్టమైన అభివృద్ధి పనులకు వెచ్చిస్తోందని పాలకవర్గాలు వాదిస్తున్నాయి.**



ఎం. నారాయణ స్వామి

అడుగు ముందుకేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. సామర్థ్యం నిరూపించుకొంటేనే సత్కీర్తి సొంతమవుతుంది. పౌరుడికైనా, పురపాలక సంఘానికైనా ఇవి వర్తిస్తాయి. మహాత్ముడు. కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసే స్థానిక సంస్థలు, ఆశించినంతగా ఫలితాల్ని సాధించలేకపోతున్నాయన్నది అక్షరసత్యం. మున్సిపాలిటీల్లోని 'పాలిటిక్స్' ప్రజల పాలిటి ప్రగతి నిరోధకాలవుతున్నాయి. పాలక సంఘాల్లోని అవినీతి కింది నుంచి పైవరకూ చలవలు పలవలు వేసుకుపోతోంది. పైన పర్సనాలిటీలోని మున్సిపాలిటీ పరిహాసాలకు పురపాలక సంఘాలు లోనవుతున్నాయి. స్వాతంత్ర్యం రాకముందు నుంచి జాతిపిత మహాత్మా గాంధీ 'గ్రామస్వరాజ్యమే నిజమైన స్వరాజ్యం' అంటుండే వారు. ఆయన మాటల్లో చెప్పాలంటే పటిష్టమైన స్థానిక సంస్థలు సాగించే స్వపరిపాలనే నిజమైన ప్రజాస్వామ్యానికి దర్పణం. పైస్థాయిలో చట్టాలు రూపొందించే ప్రభుత్వాలు 'అలా చేస్తే' ఇలా జరుగుతుంది. ఈ ఫలితంవస్తుంది అని ఊహించి కాగితాల్లో రాసుకుంటారు. కానీ స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజా ప్రతినిధులు, సభ్యులంతా సామాన్య ప్రజానీకంతో మమేకమై ఉంటారు. సమాజంలో ఏం జరుగుతోంది. ప్రజానీకానికి ఏమేమి అవసరం అన్న విషయాలపై ప్రత్యక్ష అవగాహనను మొదటగా గ్రహించేది స్థానిక సంస్థల పాలకవర్గాలే. స్వాతంత్రం సిద్ధించిన తొలినాళ్లలో గ్రామీణ భారతావనిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయం వంటిప్రధాన రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మనిషి పుట్టిన వెంటనే తీసుకోవాల్సిన జనన ధ్రువీకరణ పత్రంతో మొదలుకుని, శాశ్వత నిద్రలోకి వెళ్లాక అతని కుటుంబానికి కావల్సిన మరణ ధ్రువీకరణ పత్రం దాకా ప్రతి రోజూ మున్సిపాలిటీతో ప్రతి ఒక్కరికీ అవసరముంటుంది. సమాజంలోవచ్చే మార్పులు, చట్టాలు, విధానాలకు అనుగుణంగా పౌరులు ఏదో ఒక సమయంలో మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించక తప్పదు. కళ్లముందు కనిపించే కనీస సౌకర్యాల దగ్గర నుంచి పెద్ద ఆకాశ హార్మ్యాల నిర్మాణం వరకూ ప్రతి ఒక్కపనికి మున్సిపాలిటీల అనుమతి అవసరం. చట్టాలు, విధానాలు రూపొందించేది కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలే అయినా దిగువస్థాయిలో వాటిని అమలు చేయాల్సింది, ఫలితాలను మొదట రాబట్టాల్సింది మున్సిపాలిటీలే. క్రమేణా ఏళ్లు గడిచే కొద్దీ అంతర్జాతీయంగా వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా గ్రామీణ భారతావని పట్టణ సొబగులు దిద్దుకుంటోంది. మరో చెంప వ్యవసాయంలో వస్తున్న నష్టాలు, ఇతర చేతివృత్తులకు నిరాదరణ వంటి కారణాల వల్ల పల్లె ప్రాంతీయులు పట్టణాలకు వలసపోవడం ప్రారంభమైంది. మరో కోణంలో పెద్దపెద్ద గ్రామాలన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న జనాభాతో చిన్న చిన్నపట్టణాలుగా, అప్పటి వరకూ చిన్నచిన్న పట్టణాలుగా ఉన్నవి కాస్తా మెగాసిటీలుగా రూపాంతరం చెందాయి. చెందుతున్నాయి. గత అర్ధ శతాబ్దపు భారతదేశ చరిత్రను పరిశీలిస్తే మున్సిపాలిటీల సంఖ్యతో పాటు వాటి పరిధి అనూహ్యంగా పెరుగుతున్న దృశ్యాలు కళ్ళ ముందుంటాయి. ఆధునిక జీవనం వైపు మనిషి చూపుతున్న మొగ్గుకూడా పట్టణ ప్రాంతాల విస్తరణకు మరో కారణం. క్రమేణా పచ్చని చెట్లతో అలరారుతున్న ప్రాంతాలన్నీ 'కాంక్రీట్ జంగిల్స్'గా మారుతున్న ఈఆధునిక యుగంలో వీటిని పాలించే మున్సిపాలిటీలు, వాటి పాలక వర్గాలకున్న ప్రాధా న్యం అపారమైంది. 1992ముందు ఆ తర్వాత ఇలామున్సిపాలిటీల పనితీరును, నిర్మాణాన్ని మన దేశంలో రెండు రకాలుగా విభజించారు. పి.వి.నర్సింహారావు ప్రధాన మంత్రి గా ఉన్న కాలంలో 1991 లో పార్లమెంటు





ఆమోదించిన 74వ రాజ్యాంగసవరణతో పురపాలక సంఘాల పాలనలో కొత్త శకం ఆరంభమైందని చెప్పవచ్చు. 'నగర పాలికా 'యా'గా పేరొందిన ఈచట్టంతో మున్సిపల్ కౌన్సిళ్ల నిర్మాణం, ఎన్నికల్లో పెనుమార్పులు జరిగాయి. యాల్లో పేర్కొన్న అధికారాలను మున్సిపాలిటీలకు ఇవ్వాలా వద్దా అన్న విచక్షణాధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెట్టడం కొత్తసమస్యలకు దారి తీసింది. ఈఅధికారాన్ని అటు రాష్ట్రప్రభుత్వాలు, ఇటు మున్సిపాలిటీల పాలకవర్గాలు కొత్త రాజకీయ సంగ్రామాలకు ఆసరాగా చేసుకున్నాయి. సాధరణంగా రాష్ట్రాన్ని పాలించేది ఒక రాజకీయ పార్టీ అయితే ఆ రాష్ట్రంలోగల మున్సిపాలిటీలు ఒక్కోసారి సగం, అంతకన్నా ఎక్కువగా ప్రతిపక్షాల చేతిలో ఉండటం మాములైంది. ఆంధ్రరాష్ట్రం విభజించక ముందు మొత్తం 1985లో వీటిలో 94 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించారు. అప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న తెలుగుదేశం పార్టీ34 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటే, కాంగ్రెస్ పార్టీ 42 స్థానాలతో మెరుగైన స్థితిలో నిలిచింది. ఇక అక్కడితో మొదలైంది రాజకీయ పోరాటం. మున్సిపల్ విధిగా మూడు నెలలకోమారు సమావేశమై పట్టణ ప్రజలసమస్యలపై పరిష్కారాలకు నిధులు కేటాయిస్తూ తీర్మానాలు చేయాలి. ఈ సమావేశాలు మొక్కుబడి తంతుగా సాగుతున్నాయనే అభిప్రాయం ఉంది. కౌన్సిలర్లు వ్యక్తిగత కక్షలు, రాజకీయ విభేదాలతో, వాగ్వివాదాలకు, ఘర్షణలకు దిగుతున్నారు. స్వచ్ఛందంగా అభివృద్ధికి పాటుపడాల్సిన చాలామంది కౌన్సిలర్లు, వార్డుసభ్యులు అభివృద్ధి పనుల కాంట్రాక్టుల్ని దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. ఆదాయ వనరులపట్ల నిర్లక్ష్యం చూపడంతోపాటు అభివృద్ధి పనులు దుర్వినియోగం మాములైంది. వివిధ సంక్షేమ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధుల వినియోగానికి మున్సిపాలిటీలు పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈపనులు కాంట్రాక్టుల కోసం కౌన్సిలర్ల మధ్య పోటీ సాధారణమైంది. పరస్పరావగాహనతో ఒడంబడిక కుదరనప్పుడు ఆయా పనుల్లో ఎంతెంత అవినీతి జరిగింది? ఎవరెవరికి ఎన్ని ముడుపులందాయోనన్న విషయాలుమున్సిపల్ సమావేశాల్లో బయటపడుతున్నాయి. 1965 మున్సిపాలిటీల చట్టం ఎన్నోవిధులు, బాధ్యతలను పురపాలక సంఘాలకు కల్పించింది. చట్టప్రకారం మున్సిపాలిటీలు నిర్వర్తించాల్సిన విధులు పదిహేనుకు పైగా ఉన్నాయి. వాటిని తుతూ మంత్రంగానే చేపడుతున్నారు. అవి మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్యం, అంటు వ్యాధుల నివారణ, అనాధశవాలకు అంత్యక్రియలు, ఆహార పదార్థాల్లో కల్తీ నివారణ, రోడ్లనిర్వహణ విద్యుచ్ఛక్తిసౌకర్యం, ముఖ్యగణాంకాల సేకరణ, మార్కెట్ల నిర్వహణ, నిర్మాణ వ్యవహారాలు, పన్నుల వసూళ్లు. వీటన్నింటి బాధ్యతలన్నీ సక్రమంగానిర్వహించి ప్రజాభివృద్ధికి మున్సిపాలిటీలు దోహదపడాలి. మున్సిపల్ కౌన్సిల్లో సర్వసభ్య సమావేశాల మినిట్స్ పుస్తకాలను, పన్నుకట్టే ప్రతి పౌరుడూ ఎప్పుడైనా వెళ్లి పరిశీలించవచ్చు. ఆ సమావేశాల ఎజెండా తీర్మానాల ప్రకారమే ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలని చట్టం నిర్దేశిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమల్లో కనిపిస్తున్నంత చురుకుదనం, పట్టణ ప్రాంతాల్లో కానరావడం లేదు. జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్ వంటి పథకాల అమలు తీరును ఇందుకు నిదర్శనాలుగా చెప్పాలి. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వర్ణజయంతి షహరిరోజ్ గార్ యోజన అమలు తీరు మరోప్రబల నిదర్శనం. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 75శాతం, రాష్ట్రప్రభుత్వం 25శాతం నిధులు ఇస్తాయి. ఈపథకం కింద గతంలో అమలైన కొన్నిపథకాల్ని, కొత్తగా మరికొన్నింటిని ఒకే గొడుగు కిందకు తెచ్చారు. ఈ పథకానికి విడుదలైన నిధుల్నీ, వినియోగం తీరును ఒక్కసారి పరిశీలిస్తే మున్సిపాలిటీల పనితీరు ద్యోతకమవుతుంది. నిధుల వినియోగం చురుగ్గా లేకపోవడానికి పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకర్ల సహకారాలు అందకపోవడమేనని మున్సిపల్ పాలకవర్గాలు వాదిస్తున్నాయి. ఒక్కమాటలోచెప్పాలంటే తెలుగురాష్ట్రాలలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలూ తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికికారణం. స్వయంకృతాపరాధం కొంత ప్రభుత్వాల అశ్రద్ధ మరికొంత ప్రధాన ఆదాయ వనరులపై పాలకవర్గాలు చిన్న చూపు. తమకు కావాల్సిన నిధులన్నీ రాష్ట్రప్రభుత్వమే ఇవ్వాలన్న ధోరణితో చాలామంది స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు. దేశంలో పట్టణాభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తమకివ్వకుండా తమకిష్టమైన అభివృద్ధి పనులకు వెచ్చిస్తోందని పాలకవర్గాలు వాదిస్తున్నాయి.

-సీనియర్ జర్నలిస్టు

# స్టాక్ మార్కెట్‌కు ముప్పు తప్పదా?

మహమ్మద్ ఆరిఫ్

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కొందరిని మెప్పించగా.. మరికొందరిని నిరాశపర్చింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా పడింది. ఈ బడ్జెట్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించి ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ విభాగంలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది మదుపర్లకు భద్రతగా కొందరు విశ్లేషిస్తుండగా.. మరికొందరు భవిష్యత్తులో మార్కెట్‌కు ముప్పు తప్పదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా బడ్జెట్‌లో కేంద్రం డెరివేటివ్స్ మార్కెట్‌కు సంబంధించి పన్నులను భారీగా పెంచింది. స్పెక్యులేషన్‌ను తగ్గించే పేరుతో ఎస్‌టీటీ (సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్) రేట్లను సవరించింది. ఈక్విటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్ పై ఇప్పటి వరకు ఉన్న 0.02శాతంగా ఉన్న పన్నును 150శాతం పెంచుతూ 0.05 శాతానికి పెంచింది. మరీ ముఖ్యంగా రిటైల్ ట్రేడర్లు ఎక్కువగా ఆసక్తి చూపించే ఆప్షన్స్ ట్రేడింగ్‌లో ప్రీమియం విలువపై ఇప్పటి వరకు విధిస్తున్న 0.10శాతం ఎస్‌టీటీను 50 శాతం పెంచుతూ 0.15 శాతానికి చేర్చింది. ఫ్యూచర్స్ ఎక్సర్ సైజ్ చేసేటప్పుడు ఉన్న0.125 ఎస్టీటీని కూడా 20 శాతం పెంచి 0.15 శాతానికి తీసుకెళ్లింది. ఈ పెంపు ట్రేడర్లలో గందరగోళానికి దారితీసింది. ఈ పన్ను పెంపులను సామాన్యుల రక్షణ కవచంగా కొందరు అభివర్ణిస్తున్నారు. గతంలో విడుదలైన నివేదికల ప్రకారం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న వారిలో 90 శాతం మంది నష్టాల పాలవుతున్నారు. స్టాక్‌మార్కెట్ పై పరిజ్ఞానం లేనియువత, వేతనజీవులు త్వరగా సంపన్నులవ్వాలనే ఆశతో ఇందులో దిగిఉన్నది పోగొట్టుకుంటున్నారు. పన్నులు పెంచడం ద్వారా వీరిప్రవేశాన్ని కఠినతరం చేసినట్లవుతుంది. మరోవైపు స్టాక్ మార్కెట్ అనేది సంపద సృష్టికి వేదిక. కానీ క్షణాల్లో లాభ నష్టాలను తేల్చే జూదశాలగా కొందరు మార్చేశారు. అధిక పన్నుల వల్ల స్పెక్యులేషన్ ఆధారంగా జరిగే ట్రేడింగ్ తగ్గి, పెట్టే పెట్టుబడులు స్థిరమైన ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లవైపు మళ్లే అవకాశముంది. చిన్న మొత్తాలతో పెద్ద రిస్క్ తీసుకునే ధోరణిని తగ్గించి ప్రజల్లో పొదుపు, సురక్షితమైన పెట్టుబడి అలవాట్లను ప్రోత్సహించడానికి ఈ పన్ను పెంపు దోహదపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పన్ను పెంపువల్ల మార్కెట్ పై ప్రతికూల ప్రభావంపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఆందోళనలు సైతం వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ సజావుగా సాగాలంటే కొనుగోలు, అమ్మకందారుల రద్దీ (లిక్విడిటీ/వాల్యూమ్) ఉండాలి. పన్ను భారం వల్ల ట్రేడర్లు మార్కెట్ నుంచి తప్పుకుంటే ట్రేడింగ్ పరిణామం భారీగా పడిపోతుంది. దీనివల్ల పెద్ద ఇన్వెస్టర్లు తమ షేర్లను అమ్ముకోవాలన్నా, కొనాలన్నా ఇబ్బంది అవుతుంది. ఇది మార్కెట్ పతనానికి దారితీయొచ్చుననే ఆందోళన సైతం ఉన్నది. మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు తమ నష్టాలను తగ్గించుకోవడానికి ఎఫ్‌అండ్ ఓ మార్కెట్‌ను వాడుకుంటాయి. ఇప్పుడు పన్నుల పెంపుతో ఇదిఖరీదైన వ్యవహారంగా మారుతుంది. పరోక్షంగా ఈభారం మళ్లీసామాన్య మదుపర్లపైనే పడుతుంది. ●

# బడుగులకు ఆర్థిక వనరులపై సమాన హక్కు



డా. సునీల్ కుమార్ పోతన

ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధన 2030నాటికి పేద, బడుగువర్గాలకు ఆర్థిక వనరులపై సమాన హక్కులను అందించాలి. భూమి, ఆస్తి, వారసత్వం, సహజ వనరులు, సాంకేతికత, మైక్రోఫైనాన్స్ వంటి ఆర్థిక సేవలతో సహా ప్రాథమిక సేవలను అందించాలి. భారతదేశంలో విస్తారమైన జనాభా, సామాజికఆర్థిక అసమానతలు, ప్రాంతీయ అసమానతలు, చారిత్రక అడ్డంకులతో ఈలక్ష్యాన్ని సాధించడం సంక్లిష్టంగా కనిపిస్తోంది. సేవలు, వనరులను అందించడంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, విద్య, జల్ శక్తి, పెట్రోలియం సహజ వాయువు, కమ్యూనికేషన్లు, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కీలకపాత్ర పోషిస్తాయి. కేవలం విధాన రూపకల్పన మాత్రమే కాకుండా అట్టడుగున ఉన్నవారికి సేవలను సమర్థవంతమైన అమలుతో అందించాలి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి కార్యక్రమాల ద్వారా భారతదేశం కొంత పురోగతి సాధించింది. మహిళా యాజమాన్యంలోని గృహాలు సహా పేదలకు సరసమైన గృహాలను అందించే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకుంది. 2025 నాటికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 1.1 కోట్లకు పైగా ఇళ్ళు మంజూరు చేసినట్లు ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిలో గణనీయమైన భాగం మహిళల పేరుతో ఉన్నాయి. మహిళలకు ఆస్తి, ఆర్థిక భద్రతలో మెరుగుదలను ప్రతిబింబిస్తుంది. కానీ, భూమిపై యాజమాన్యం ఒక ప్రధాన సవాలుగా మిగిలిపోయింది. మహిళల భూమి హక్కులకు చట్టపరమైన నిబంధనలున్నప్పటికీ సామాజిక నిబంధనలు, వారసత్వ పద్ధతులు, ఆస్తిపై మహిళల నియంత్రణను పరిమితం చేస్తూనే ఉన్నాయి. గ్రామీణ భారతదేశంలో మహిళలు ఇప్పటికీ భూ యజమానులుగా ఉన్నారు. భూమిపై నిజమైన సాధికారతను సాధించలేదు. గ్రామీణ, గిరిజన వర్గాలలో భూమి రికార్డులు, వివాదాలు, అసమాన వారసత్వ పద్ధతులతో ఇది మరింత క్లిష్టంగా మారింది. విధాన ఉద్దేశం, వాస్తవ యాజమాన్యం మధ్యఅంతరం కీలకమైన అవరోధంగా ఉంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రధాన పథకం 'ఆయుష్మాన్ భారత్. బడుగు వర్గాల కుటుంబాలకు ఆరోగ్య కవరేజీని అందించడం లక్ష్యం. వివిధ రకాల అనారోగ్యాలకు ఉచిత చికిత్సను అందిస్తోంది. సానుకూల దశ అయినప్పటికీ రాష్ట్రాలు, ప్రాంతాలలో ఆరోగ్య సేవల ప్రాప్యత అసమానంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ వైద్యులు, ఆసుపత్రులు, రోగనిర్ధారణ సౌకర్యాల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఆరోగ్య కవరేజ్ ఎల్లప్పుడూ నాణ్యమైన సంరక్షణకు హామీ ఇవ్వదు. విద్యలో సమగ్ర శిక్ష, మధ్యాహ్నభోజన పథకంవంటి ప్రభుత్వ కార్యక్రమాలు నమోదు రేట్లను మెరుగుపరిచాయి. ప్రాథమిక విద్య నమోదు సార్వత్రిక స్థాయికి దగ్గరగా చేరుకుంది. కాలక్రమేణాడ్రాపౌట్



రేట్లు తగ్గాయి. కానీ, ముఖ్యంగా వెనుకబడిన సమూహాలలో అభ్యాస ఫలితాలు అసమానంగా ఉన్నాయి. డిజిటల్ విద్యా సాధనాల లభ్యత మెరుగుపడిన ఇంటర్నెట్ కనెక్టివిటీ, పరికర ప్రాప్యత పరిమితంగా ఉన్నగ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అంతరాలు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ సదుపాయం మెరుగుపడింది. కానీ పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయుల సమస్య, అనధికారిక స్థావరాలు కొనసాగుతున్నాయి. అందరికీ, ముఖ్యంగా వలస కార్మికులు, మురికివాడల్లో నివసించే తక్కువ ఆదాయకుటుంబాలకు సరసమైన గృహాలను నిర్ధారించడంలో సవాళ్లను గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఎదుర్కొంటోంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో గ్రామీణ గృహాలకు ఎల్‌పిజి వంట గ్యాస్ అందుతోంది. 2025 నాటికి 99 శాతం కంటే ఎక్కువ గృహాలు శుభ్రమైన వంట ఇంధనాన్ని పొందుతున్నాయి. వాయు కాలుష్యం, ఆరోగ్య ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తుంది. దుర్బల జనాభాకు ప్రాథమిక ఇంధన వనరును అందించడంలో ఇది ఒకప్రధాన విజయం. ప్రతి గ్రామీణ ఇంటికి నల్లాల ద్వారా నీటి సరఫరాను అందించడం లక్ష్యంగా పెట్టుకున్న జల్ జీవన్ మిషన్ ద్వారా జల్‌శక్తి మంత్రిత్వ శాఖ గణనీయమైన పురోగతిని సాధించింది. 2025 నాటికి గణనీయమైన సంఖ్యలో గృహాలు నల్లాల ద్వారా నీటి సరఫరాను పొందుతున్నాయి. అనేక గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికీ అడపాదడపా నీటి సరఫరా, నాణ్యతా సమస్యలు, కాలానుగుణ కొరతను ఎదుర్కొంటున్నాయి. స్వచ్ఛభారత్ మిషన్‌తో మెరుగైన పారిశుధ్య వసతి కలిగింది. కానీ మౌలిక సదుపాయాలను నిర్వహించడంలో ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో సవాళ్లు మిగిలిఉన్నాయి. ఆర్థిక చేరిక రంగంలో లక్షలాది మందికి ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజనతో బ్యాంకు ఖాతాలను తెరిచింది. ఈ పథకంకింద 45కోట్లకు పైగా ఖాతాలు తెరిచినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అనేక గృహాలకు ఆర్థిక సేవలు, ప్రత్యక్ష ప్రయోజన బదలీలు, అధికారిక బ్యాంకింగ్‌కు ప్రాప్యతను మెరుగుపరిచింది. అదనంగా, ముద్రా వంటి మైక్రోఫైనాన్స్, క్రెడిట్ పథకాలతో మాల్ వ్యవస్థాపకులు స్వయం ఉపాధి పొందుతున్నారు. చాలా మందికి అధికారిక రుణం అందుబాటులో ఉండటం పరిమితంగానే ఉంది. పూచీకత్తులేకపోవడం, సంక్లిష్టమైన డాక్యుమెంటేషన్, అధిక లావాదేవీ ఖర్చులతో తరచుగా అనధికారిక రుణదాతలపై గ్రామీణ కుటుంబాలు ఆధారపడుతున్నాయి. మైక్రోఫైనాన్స్ విస్తరించినా ఒకే విధంగా అందుబాటులో లేదు. అధిక వడ్డీ రేట్లు, తిరిగి చెల్లించే ఒత్తిళ్లు వంటి సమస్యలు రుణగ్రహీతలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ పథకాల అమలులో లింగఅసమానతలను తగ్గించాలి. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), మైనారిటీలు వంటి అట్టడుగు వర్గాలను చేర్చడం అవసరం. మహిళల సాధికారత లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశపెట్టింది. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. గృహ ఆర్థిక అంశాలపై మహిళల నియంత్రణ ఇప్పటికీ అనేక ప్రాంతాలలో పరిమితంగా ఉంది. బలహీన వర్గాలకు ప్రాథమిక సేవలు, ఆర్థికఅవకాశాలను పొందడంలో నిర్మాణాత్మక అడ్డంకులున్నాయి. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వైపు భారతదేశ పురోగతి మిశ్రమంగాఉంది. ఒక వైపు, వివిధ మంత్రిత్వశాఖలలో చేపట్టిన ప్రభుత్వ చొరవలతో ప్రాథమిక సేవలు, ఆర్థిక చేరిక, స్వచ్ఛమైన విద్యుత్ ప్రాప్యత మెరుగైంది. 2030నాటికి లక్ష్యాలను సాధించాలంటే మంత్రిత్వశాఖల మధ్య బలమైన సమన్వయం, అట్టడుగు స్థాయిలో మెరుగైన అమలు, అసమానతలను తగ్గించడంపై దృష్టిఅవసరం. ●

# లోక్‌సభ స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాసం

## పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంటోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్పీకర్ తమ గొంతుకను నొక్కేస్తున్నారని, పక్షపాతంగా వ్యవహారి స్తున్నారని పేర్కొంటూ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. ఈ నోటీసుపై 118 మందికిపైగా ప్రతిపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94సీ ప్రకారం నోటీసు ఇచ్చినట్టు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ తెలిపారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), డీఎంకేతో సహా పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన 120 మంది ఎంపీలు నోటీ సుపై సంతకాలు చేశారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజన అంశాలను విపక్షం లేవనెత్తకుండా స్పీకర్ పదేపదే అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. విపక్ష సభ్యులు మాట్లాడటానికి అనుమతించడం లేదని, అది వారి ప్రాథమిక హక్కని అన్నారు. రాజ్యాంగ హక్కులను వినియోగించుకున్నందుకు 8మంది విపక్ష సభ్యులను ఏకపక్షంగా సస్పెండ్ చేశారని గొగొయ్ ఆరోపించారు. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీవర్గాలు పేర్కొన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని తెలిపాయి. రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని వివరించాయి. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం, 8 మంది సభ్యులను సెషన్ ముగిసే వరకూ సస్పెండ్ చేయడం, ప్రధానిపై దాడికి కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రయత్నించారని నిరాధార ఆరోపణలు చేసి బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో అవిశ్వాస తీర్మానం అంశాన్ని విపక్షాలు తెర పైకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 94 ప్రకారం స్పీకర్‌ను తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టొచ్చు. ఇందుకు కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. నోటీ సుపై కనీసం 50 నుంచి 100 మంది ఎంపీల సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విపక్షం తమ నోటీసుపై 118మంది ఎంపీలు సంతకం చేసినట్టు పేర్కొంది. దీంతో తీర్మానం తప్పకుండా ఆమోదిం చాల్సిన పరిస్థితి నెలకుంది. అదే జరిగితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతుంది. కానీ, ప్రభుత్వానికి అవసరమైన సంఖ్యాబలం ఉన్నందున ఈ తీర్మానం వీగిపోయి నప్పటికీ స్పీకర్ స్థానాన్ని వివాదాల్లోకి లాగడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.

**విపక్ష మహిళా ఎంపిలపై చర్యలు తీసుకోవాలి: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు:** లోక్‌సభలో ఈనెల 4వ తేదీన ప్రధాని మోదీ కూర్చునే సీటు వద్ద విపక్ష మహిళా ఎంపీలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు చెందిన వీడియోను ఇవాళ కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేసింది. విపక్ష మహిళా సభ్యులు బ్యానర్లు పట్టుకుని.. మోదీ కూర్చుకునే సీటు వద్ద నినాదాలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ఆ సమయంలో ప్రధాని మోదీ అక్కడకు రావాల్సి ఉన్నది. కానీ విపక్ష మహిళా



ఎంపీల నిరసన వల్ల ఆయన రాలేకపోయారు. ఆ తర్వాత ప్రధాని ప్రసంగం చేయకుండానే తీర్మానాన్ని ఆమోదించినట్లు లోక్‌సభ ప్రకటించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం ఆ రోజున జరిగిన ఘటనకు చెందిన వీడియోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి నేతృత్వంలో కొందరు మహిళా ఎంపీలు మోదీ సీటు వద్ద ఆందోళన చేపట్టారు. ప్రధానిని అడ్డుకున్న మహిళా విపక్ష ఎంపీలపై చర్యలు తీసుకోవాలని ఇవాళ బీజేపీ మహిళా ఎంపీలు స్పీకర్‌ను కోరుతూ లేఖ రాశారు.

**హద్దులు దాటుతున్న ప్రతిపక్షాలు: కంగనారనౌత్**

ప్రతిపక్ష పార్టీలు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి దేశం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ఆర్మీ మాజీ చీఫ్ నరవణే ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా ఆరోపించారు. రాహుల్ గాంధీ ఒక అనధికారిక, చట్టవిరుద్ధమైన పుస్తకాన్ని సభకు తీసుకొచ్చి మొత్తం న్యాయవ్యవస్థను అవమానించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ కూడా స్పష్టంచేసింది అని కంగనా అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగనీయకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంతో లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడింది. మాకు న్యాయం కావాల్సి అంటూ కాంగ్రెస్ ఎంపీలు



నినాదాలు చేయగా, బడ్జెట్‌పై చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వారిని కోరారు.

**నరవణే అబద్ధమా...పెంగ్విన్ సంస్థ అబద్ధమా: రాహుల్ గాంధీ:** మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ బుక్ వివాదాస్పదమైంది. ఆ బుక్‌లో ఉన్న కొన్ని అంశాలను ఇటీవల లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రస్తావించారు. దీంతో సభలో గందరగోళం



నెలకొన్నది. అయితే మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే చేసిన ఓ ట్వీట్‌ను చదివి వినిపించారు. తాను రాసిన పుస్తకం ఆన్‌లైన్‌లో దొరుకుతోందని, లింక్ ఓపెన్ చేస్తే విషయాలు తెలుస్తాయని తన ట్వీట్‌లో నరవణే పేర్కొన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఆ బుక్‌ను పెంగ్విన్ రాండమ్ హౌజ్ ఇండియా ప్రచురించినట్లు తెలిసింది. కానీ తాము ఆ బుక్‌ను ఇంకా రిలీజ్ చేయలేదని పెంగ్విన్ సంస్థ తాజాగా ప్రకటించింది. కానీ రాహుల్ మాత్రం అమెజాన్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కన్నా మాజీ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను నమ్ముతున్నట్లు రాహుల్ తెలిపారు. నేను నరవణేను నమ్ముతున్నాను, ఆయన అబద్ధం చెప్పరని భావిస్తున్నా, పెంగ్విన్ అబద్ధం చెబుతుందా అన్న అంశంలో నిజాన్ని నిర్ధారించలేమని రాహుల్ అన్నారు.

**నరవణే పుస్తకంపై స్పష్టత ఇచ్చిన పెంగ్విన్**

ఆర్మీ మాజీ చీఫ్, జనరల్ ఎంఎం నరవణె పుస్తకంపై అన్ని హక్కులు తమకే ఉన్నాయని ప్రముఖ పబ్లిషింగ్ కంపెనీ పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా పేర్కొంది. ఈ పుస్తకం




విషయంలో నెలకొన్న వివాదంపై సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. నరవణె రాసిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీకి ప్రభుత్వం నుంచి అనుమతి ఇంకా లభించకపోవడంతో ముద్రణ చేపట్టలేదని వివరించింది. ఆన్ లైన్ లో రిలీజ్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. సరిహద్దుల్లో చైనా సైన్యంతో జరిగిన భారత బలగాల ఘర్షణకు సంబంధించి నరవణె ఈ పుస్తకంలో పలు విషయాలను వెల్లడించారు. ఈ వివాదాస్పద అంశాలను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే, నరవణె పుస్తకం అసలు పబ్లిష్ కాలేదని, మార్కెట్లోకి రాని పుస్తకంలోని విషయాలను సభలో ప్రస్తావించడమేంటని అధికార పక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో మరుసటి రోజు రాహుల్ గాంధీ నరవణె బుక్‌ను సభకు తీసుకెళ్లారు. దీంతో వివాదం రేగింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ పోలీసులు సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో పెంగ్విన్ సంస్థ ప్రచురణకు ముందు రూపొందించిన పీడీఎఫ్ ప్రతి కొన్ని వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉందని గుర్తించినట్లు తెలిపారు.

# లిబియా తీరంలో పడవ మునక 53 మంది మృతి



**ట్రిపోలి, ఫిబ్రవరి 10:** లిబియా తీరంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. వలసదారులు, శరణార్థులతో వెళుతున్న ఒక రబ్బరు బోటు మధ్యధరా సముద్రంలో మునిగిపోవడంతో 53 మంది ప్రాణాలు కోల్పో యారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) అధికా రికంగా ధృవీకరించింది. లిబియాలోని అల్‌జావియా నుంచి గురువారం రాత్రి 55 మందితో ఈ బోటు బయలుదేరింది. ప్రయాణం మొదలైన ఆరు గంటల తర్వాత, జువారా తీరానికి సమీపంలో బోటులోకి నీరు చేరి మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో ఒకరు తన భర్తను కోల్పోగా, మరొకరు తన ఇద్దరు పిల్లలను కోల్పోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటన గత గురువారం జరిగినా, ఐఓఎం సోమవారం దీన్ని వెలుగులోకి తెచ్చింది. 2026లో ఇప్పటివరకు మధ్యధరా సముద్రం దాటే ప్రయత్నంలో దాదాపు 500 మంది మరణించడం లేదా గల్లంతవడం జరిగిందని ఐఓఎం తెలిపింది. ముఖ్యంగా శీతాకాలంలో స్మగ్లర్లు నడిపే పడవలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, చాలా సంఘటనలు నమోదు కావడం లేదని పేర్కొంది. 2011లో గడాఫీ మరణం తర్వాత లిబియాలో అస్థిరత పెరిగింది. ఆఫ్రికా దేశాల నుంచి యూరప్ కు వెళ్లే వలసదారులకు ఇది ప్రధాన మార్గంగా మారింది. హింస, దోపిడీ, బలవంతపు చాకిరీ వంటి భయానక పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకే ప్రజలు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో, మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అరికట్టడంతో పాటు, వలసలకు చట్టబద్ధమైన, సురక్షితమైన మార్గాలను ఏర్పాటు చేయాలని ఐఓఎం అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది.

# రూ.3.25లక్షల కోట్లతో 114 రఫేల్ యుద్ధవిమానాలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10:** భారత వాయుసేన అమ్ములపొదిని మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఈ వారంలోనే ఆమోదం తెలిపింది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్దది కానుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం విమానాల కొనుగోలుకే పరిమితం కాదు. ఇందులో భాగంగా దాదాపు 100 యుద్ధ విమానాలను "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ డీల్ ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత రఫేల్ యుద్ధ విమానాలను అత్యధిక సంఖ్యలో వినియోగిస్తున్న దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తుంది. ఇప్పటికే 36 రఫేల్ వేరియంట్ ఫైటర్ జెట్లు భారత్ వద్ద ఉన్నాయి. 2024 డిసెం బర్‌లో చివరి విమానం వాయుసేనకు అందింది.

# అమెరికా చిత్రపటంలో గ్రీన్‌ల్యాండ్ కెనడా




**వాషింగ్టన్ , ఫిబ్రవరి 10:** గ్రీన్‌లాండ్, కెనడాలను అమెరికాలో భాగంగా చూపించే మ్యాప్‌ను అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా మళ్లీ పోస్ట్ చేశారు. గ్రీన్‌లాండ్ స్వాధీ నం అమెరికా జాతీయ భద్రతతో ముడిపడిన అంశంగా పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్, మరికొందరితో తాను ఓవల్ ఆఫీస్‌లోమాట్లాడుతున్న ఫొటోను ట్రంప్ సోమవారం పోస్ట్‌చేశారు. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా డానిష్ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలనే తన ఆకాంక్షను మళ్లీ వ్యక్తంచేశారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే కెనడా అమెరికాలో 51వరాష్ట్రంగా చేరుతుందని ప్రకటించారు. అక్కడ సైనిక స్థావరాలు ఏర్పా టుచేస్తామని ప్రజలకు లక్ష నుంచి 10 మిలియన్ డాలర్ల వరకూ అందచేసి అయినా స్వాధీనం తప్పదని స్పష్టంచేసారు. తాజాగా ట్రంప్ ఓవల్ కార్యాలయంలోని తనఛాంబర్‌లో కూడా గ్రీన్‌ల్యాండ్, కెనడాలున్న చిత్రపటం వేలాడదీసారు.

# బాబ్రి పునర్నిర్మాణం అసాధ్యం: యుపి సిఎం యోగి

**లక్నో, ఫిబ్రవరి 10:** బాబ్రీ మసీదు పునర్నిర్మాణంపై ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మసీదు పునర్ నిర్మాణం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన ఉద్ఘాటించారు. శతాబ్దాలుగా సాగు తోన్న రామజన్మ భూమి బాబ్రీ మసీదు వివా దంపై 2019 నవంబర్ 9న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. వివాదాస్పద భూమి రామజన్మ భూమి ఆలయ నిర్మాణానికి అప్పగించి, దానికి ప్రత్యామ్నాయంగా మసీదు నిర్మాణం కోసం ముస్లిం వర్గానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని సర్వోన్నత న్యాయ స్థానం తన తీర్పులో స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అయోధ్య సమీపంలోని ధన్నిపూర్‌లో ఐదు ఎకరాలను యూపీ ప్రభు త్వం కేటాయించింది. ఆ స్థలంలో మసీదు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆసుపత్రి, లైబ్రరీ, మ్యూజియంతో కూడిన కాంప్లెక్స్ నిర్మి స్తున్నారు. ఈ తరుణంలో యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరిం చుకుంది. తీర్పు వెలువడిన రోజు కోసం ఎదురు చూసేవారి కలలు ఎప్పటికీ నెరవేరవని, అలాంటి రోజు



ఎప్పటికీ రాదని యోగి స్పష్టం చేశారు. మంగళవారం బారాబంకిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యూపీ సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. తన వాగ్దానాలను నెరవే ర్చడంలో ప్రభుత్వం నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. దాని పని పరిధిని మాత్రమే తమ ప్రభుత్వం మాట్లాడుతుందని అన్నారు. అయోధ్యపై బీజేపీ వైఖరిని గుర్తుచేసుకుంటూ "మేము రాముడి కోసం వస్తాం అదే స్థలంలో ఆలయాన్ని నిర్మిస్తామని చెప్పాం.. ఇందులో ఏదైనా సందేహం ఉందా? అని పేర్కొన్నారు. భారత వారసత్వం, అద్భుతమైన సంప్రదాయాలు, సనాతన ధర్మం పట్ల గౌరవాన్ని నొక్కిచెప్పిన యోగి కాషాయ జెండా ఎల్లప్పుడూ దేశ గౌర వాన్ని పెంపొందిస్తూనే ఉంటుందని అన్నారు. అయోధ్యలోని రామమందిరంపై ప్రధాని మోదీ ధ్వజారోహణాన్ని గుర్తుచేస్తూ దానిని సనాతన చిహ్నంగా అభివర్ణించారు. సంక్షోభ సమయాల్లోనే శ్రీరాముడ్ని గుర్తుచేసు కుంటారని, లేకపోతే ఆయనను మరచిపోతారని ఇలాంటి అవకాశవాదులను రాముడు కూడా మరచిపోయాడని సీఎం అన్నారు. రామ భక్తులపై కాల్పులు జరిపి, రాముడి లక్ష్యాన్ని అడ్డుకున్న వారికి ఇక చోటు లేదని ఆయన వ్యాఖ్యానించారు. శాంతిభద్రతల విషయంలో యూపీ సీఎం హెచ్చరికలు చేశారు. నిబంధనల ప్రకారం నడుచుకుని, చట్టాన్ని పాటించేవారు ప్రయోజనం పొందుతారని, లేకుంటే నరకం వైపు వెళ్తారని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించడం ద్వారా స్వర్గానికి చేరుకోగలమని నమ్మేవారి కలలు ఎప్పటికీ నెరవేరవని ఆయన అన్నారు. మసీదు నిర్మాణ కోసం ఇండోఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటయ్యింది. ఈ బోర్డు ఆధ్వర్యంలో నిధుల సేకరణ కూడా జరుగుతోంది.

# చైనా, భారత్‌లు పాకిస్థాన్‌ను నమ్మడంలేదు

### జమాయిత్ ఉలేమియా ఇస్లామ్ చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహమాన్

**రావల్పిండి, ఫిబ్రవరి 10:** షెహబాజ్ షరీఫ్ నాయ కత్వంలోని పాకిస్థాన్ ప్రభుత్వంపై ఆ దేశ నాయకుడొకరు విమర్శలు గుప్పించారు. అఫ్గనిస్థాన్ విషయంలో మన విధానం దశాబ్దాలుగా ఎందుకు దారుణంగా విఫలమైందని జమాయిత్ ఉలేమియా ఇస్లామ్ (ఎఫ్) అధ్యక్షుడు మౌలానా ఫజ్లూర్ రెహమాన్ ప్రశ్నించారు. ఉగ్రవాదులు సరిహద్దులు దాటుతూనే ఉన్నారని, సైన్యం ఏం చేస్తుందని ఆయన నిలదీశారు. రావల్పిండిలో జరిగిన కార్యక్రమంలో ఫజ్లూర్ రెహమాన్ మాట్లాడుతూ అఫ్గనిస్థాన్ నుంచి వాణిజ్యం నిలిచిపోయినప్పటికీ తీవ్రవాదులు మాత్రం వస్తూనే ఉన్నారనే వైరుధ్యాన్ని ఎత్తి చూపారు. అఫ్గన్‌పై వైమానిక దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ అలా అయితే భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సరైందేనని గతంలో అన్నారు. దశాబ్దాలుగా మన ఆఫ్ఘన్ విధానం ఎందుకు ఇంత దారుణంగా విఫలమైంది ఒక్క దానిమ్మ లేదా పుచ్చకాయ కూడా పాకిస్థాన్‌లోకి ప్రవేశించలేదు అయినప్పటికీ ఉగ్రవాదులు సరిహద్దు దాటుతూనే ఉన్నారని అన్నారు. భారత్ మన శత్రువు అఫ్గనిస్థాన్ మన శత్రువు ఇరాన్, చైనాలు మనపై కోపంగా ఉన్నాయి.. పాకిస్థాన్ ప్రజలకు సమాధానాలు తెలుసుకునే హక్కు ఉంది. ఒక దేశం విధానాలు కేవలం ఏకాకితం, అపనమ్మకం, అభద్రతను మాత్రమే సృష్టిస్తే, ఆ దేశం మనుగడ సాగించలేదని ఆయన చెప్పారు.

# 12న దేశవ్యాప్తంగా కార్మికుల నిరసన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని 10 ప్రధాన కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మెలో సుమారు 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని, దేశవ్యాప్తంగా 600కు పైగా జిల్లాల్లో దీని ప్రభావం ఉంటుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ సమ్మె చేపడుతున్నట్లు సంఘాలు ప్రకటించాయి. ముఖ్యంగా, కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఉపాధి హామీ పథకంలో మార్పులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సహా పలు రైతు సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి.




గతేడాది జూలై 9న జరిగిన సమ్మెలో దాదాపు 25 కోట్ల మంది పాల్గొనగా, ఈసారి అంతకంటే ఎక్కువ ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ ఈనెల 12న జరిగే సమ్మెలో కనీసం 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారు.

# పంజాబ్‌లో పెరుగుతున్న రిమోట్‌కంట్రోల్ హత్యలు



**అమృత్‌సర్, ఫిబ్రవరి 10:** పంజాబ్‌లో రిమోట్ కంట్రోల్ హత్యలు భద్రతా వర్గాలకు పెను సవాల్‌గా మారాయి. విదేశాల్లో తలదాచుకుంటున్న నేరగాళ్లు, స్థానిక ముఠాల ద్వారా హత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేత లక్కీ ఒబెరాయ్ హత్య వెనుక కూడా విదేశీ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్ ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం మోపారు. కొన్నేళ్లుగా పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. విదేశాల్లో ఉం టున్న ప్రధాన నేరగాళ్లు, స్థానికంగా యువకులను నియమించుకుని రాజకీయ హత్యలు, బెదిరింపు వసూళ్లకు పాల్పడు తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఈ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంది. ఖలిస్థాన్ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు వీరిని వాడుకుంటోంది. దావూద్ ఇబ్రహీంతో గతంలో కుదుర్చుకున్న తరహాలోనే ఈ ముఠాలతోనూ ఐఎస్ఐ ఒప్పందం చేసుకుంది. డ్రగ్స్ ద్వారా వచ్చిన డబ్బులో 40 శాతం వాటాను తీసుకుని, ఆ నిధులను ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

# రాజ్‌పాల్‌యాదవ్‌పై చెక్‌బౌన్స్ కేసు



**ముంబయి, ఫిబ్రవరి 10:** బాలీవుడ్ హాస్యనటుడు రాజ్ పాల్ యాదవ్ ఢిల్లీలోని తీహార్ జైలులో లొంగిపోయారు. సుమారు రూ. 2.5 కోట్ల చెక్ బౌన్స్ కేసులో కోర్టు ఆదేశాల మేరకు ఆయన జైలుకు వెళ్లారు. ఈ కేసులో ఆయనకు విధించిన ఆరు నెలల జైలు శిక్షను అనుభవించనున్నారు. డబ్బు సర్దుబాటు చేసేందుకు మరింత సమయం కావాలంటూ రాజ్ పాల్ పెట్టుకున్న చివరి అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో ఆయనకు లొంగిపోక తప్పలేదు. జైలుకు వెళ్లే ముందు రాజ్ పాల్ యాదవ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సార్, ఏం చేయను నా దగ్గర డబ్బు లేదు. నాకు వేరే మార్గం కనిపించడం లేదు. ఇక్కడ మేమంతా ఒంటరివాళ్లం. ఈ సంక్షోభాన్ని నేనే ఒంటరిగా ఎదుర్కోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆయన జైలు అధికారుల ఎదుట లొంగిపోయారు.

# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

**లక్నో, ఫిబ్రవరి 10:** ఉత్తరప్రదేశ్‌లోని మధురలోని మహావన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాపర్‌పూర్ గ్రామంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు చనిపోయి ఉండటం తీవ్ర కలకలం రేపింది. భార్యాభర్తలు, ముగ్గురు పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు చనిపోవడంతో స్థానికంగా తీవ్ర కలకలంరేపింది. ఖాపర్‌పూర్ గ్రామంలోభర్త, భార్య, ముగ్గురుపిల్లలు నివాసముంటున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునిమృతదేహాలనుస్వాధీనం చేసుకున్నారు.

## సంక్షిప్తంగా..

### బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి దారుణ హత్య



**ఢాకా, ఫిబ్రవరి 10:** బంగ్లా సార్వత్రిక ఎన్నికలకు 48 గంటల ముందు హిందూ వ్యాపారిని దారుణంగా హత్య చేశారు. మైమెన్‌సింగ్ జిల్లాలో ఆయన దుకాణంలోనే కత్తితో దాడి చేసి చంపినట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని త్రిషల్ సబ్ డిస్ట్రిక్ట్‌లోని బోగర్ బజార్‌లో బియ్యం వ్యాపారిగా, మెసర్స్ భాయ్ భాయ్ ఎంటర్‌ప్రైజె యజమాని సుషేన్ చంద్ర సర్కార్‌గా గుర్తించారు. ఇతను ఇదే ప్రాంతంలోని సౌత్‌కాండ గ్రామంలో నివసిస్తున్నాడు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం ఈ సంఘటన రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. త్రిశల్ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ఇన్ ఛార్జి మహ్మద్ ఫిరోజ్ హుస్సేన్ ఈ సంఘటనను ధృవీకరించలేదు.

### మా దేశంపై దాడిచేయండి: ట్రంప్‌ను అభ్యర్థించిన ఇరాన్ వ్యక్తి ఆత్మహత్య




**టెహ్రాన్, ఫిబ్రవరి 10:** తమ దేశంతో అమెరికా చర్చలు జరపవద్దని కోరుతూ ఇరాన్‌కు చెందిన ఓ వ్యక్తి అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ను అభ్యర్థించాడు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయడమే సరైన మార్గమంటూ సామాజిక మాధ్యమాల్లో విడియో విడుదల చేశాడు. తర్వాత ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. బాధితుడిని బుషె హర్ నగరానికి చెందిన హక్కుల కార్యకర్త పౌరియా హమీదీగా గుర్తించారు. గత వారం అతడు 10 నిమిషాల విడియోను విడుదల చేశాడు. అందులో అమెరికా ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశాడు.

### యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని రేసులో షబానా



**లండన్, ఫిబ్రవరి 10:** ఎప్‌స్టీన్ ఫైళ్ల వివాదం బ్రిటన్‌లో మరోసారి రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒకవేళ స్టార్మర్ వైదొలిగితే యుకె తదుపరి ప్రధానిగా ఎవరు ఎన్నికవుతారనే దానిపై చర్చ మొదలైంది. ఈ రేసులో మహిళా ఎంపి షబానా మహ్మద్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదే జరిగితే బ్రిటన్ చరిత్రలోనే పాక్ మూలాలు ఉన్న తొలి ముస్లిం ప్రధానిగా షబానా నిలవనున్నారు. షబానా మహ్మద్ ప్రస్తుతం స్టార్మర్ ప్రభుత్వంలో హోంమంత్రిగా కొనసాగుతున్నారు. 45 యేళ్ల షబానా 2010 నుంచి బర్మింగ్‌హమ్ లేడీవుడ్ స్థానానికి ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వృత్తిరీత్యా బారిస్టర్.

### కెనడా-అమెరికా మధ్య బ్రిడ్జిని బ్లాక్ చేస్తాం: ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 10:** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేకపోతే కఠినచర్యలు తీసుకుంటామని ఆ దేశాన్ని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను బ్లాక్ చేస్తామని బెదరించారు. 2014లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావాల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రూ. 500కోట్ల పరువు నష్టం దావా వేసిన అసోం సిఎం



**గువాహతి, ఫిబ్రవరి 10:** అసోంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబీకులు దాదాపు 1,200బిఘాల భూమి ఆక్రమించారంటూ కాంగెస్ నేతలు ఆరోపించారు. దీనిపై తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేసిన సిఎం హిమంత బిశ్వశర్మ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేసినట్లు వెల్లడించారు. జితేంద్రసింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగొయ్‌ల నుంచి రూ.500కోట్ల నష్టపరిహారం కోరుతూ దావా వేశాను' అని అసోం ముఖ్య మంత్రి పేర్కొన్నారు.



# శ్రీవారి లడ్డూ ప్రసాదంతో కూటమి నేతలు గేమ్స్ : మాజీ డిసిఎం

### నెయ్యిపై క్లీన్ చిట్ ఇచ్చినా రాజకీయకుట్ర ఎందుకు?

**సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం తయారీలో ఎటువంటి జంతు కొవ్వు కలవలేదని సీబిఐ సిట్ ల్యాబ్ రిపోర్ట్‌లో తేలిపోయిందని అయినా కూటమి నేతలు దీనిపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కూటమి ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. మంగళవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ రిపోర్ట్ ప్రకారం సీఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి ఇప్పుడు కొత్తగా లడ్డులో ఏవో కెమికల్స్ కలిసాయని ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. అలాగే దీనిని ఇంతటితో ముగించకుండా భక్తుల మనోభావాలతో కూటమి నేతలు గేమ్స్ ఆడుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా శ్రీవారితో ఆటలాడని చూస్తే ఈ పాపం ఊరికే పోదన్నారు. ఇంకా టీడీపీ అండ్ కో పచ్చి అబద్ధాల్లో చెబుతూ రాష్ట్రంలో విద్వేషాలను రెచ్చగొడుతుందని క్లారిటీ ఇచ్చారు. దేవుడంటే భక్తి ఉన్నవారు, హిందూ మతంపై విశ్వాసం ఉన్నవారు ఇంకా సనాతన ధర్మం పాటించే వారు ఇలా ఆరోపణలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

## మాడిపోతున్న పూత.. మామిడి రైతుకు గుండె కోత..



**చీపురుపల్లి (విజయనగరం జిల్లా) ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** విస్తారంగా కురుస్తున్న మంచు ప్రభావంతో మామిడి తోట పూతలు మాడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పది రోజులుగా అడుగు దూరంలో గల ఎదుటి మనిషి కూడా కనబడకుండా దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా మామిడి పూతలు మాడిపోతున్నాయి. చీపురుపల్లి మండలంలో సుమారు రెండువేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తుండగా మంచు ప్రభావంతో ప్రస్తుతం ఈ ఏడాది పూసిన పూత మొత్తం మాడిపోతూ నేలరాలిపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో గల మేరకముదాం మండలంలో 10,357 ఎకరాల్లోనూ అత్యధికంగా మామిడి తోటలు సాగు చేస్తుండగా గరివిడి మండలంలో 4965 ఎకరాల్లోనూ రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. అదేవిధంగా గుర్ల మండలంలో 4311 ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తుండగా చీపురుపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 25వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది మామిడిపండ్లను సాగు చేస్తున్నారు. అధికంగా కురుస్తున్న మంచు ప్రభావంతో రైతులు రానున్న రోజుల్లో తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభ దశ నుండి పూత ఆశాజనకంగానే ఉన్నప్పటికీ పింజె కాసే సమయానికి మంచు ప్రభావంతో పిందెలు సైతం నేల రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మామిడి పిందెలపైన తామర పురుగు ఆశించడంతో బూడిద తెగులు సోకి కొన్ని చోట్ల మామిడిపండ్లను దెబ్బతీస్తున్న అంటూ రైతులు వాపోతున్నారు. మంచు ప్రభావంతో మామిడి పంటలకు సోకుతున్న తెగులు నివారణకి దయామేతక్సం 0.5 గ్రాములు, హెక్స కోణాజల్ రెండు మిల్లీ మీటర్ల నీటిలో కలిపి తెగులు చూపులు మామిడి తోటలకు పూత పైన పిచికారి చేయాలని సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. అదేవిధంగా మామిడి పిందెలను నాశనం చేసే పచ్చ పురుగు ఈ ప్రాంతంలో అధికంగా దర్శనమిస్తున్నంతో వాటి నివారణకు సమీపమును గల ఉద్యానవన శాఖ అధికారులను ఆశ్రయించి తగిన మందులను పిచికారి చేయాలంటూ పలువురు సూచిస్తున్నారు.

## ఉల్లిపాయల మాటున గంజాయి స్మగ్లింగ్

### రూ. 44.65 లక్షల విలువైన 179 కేజీల గంజాయి స్వాధీనం

### ఇద్దరు అరెస్ట్ - నలుగురి కోసం గాలింపు : ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసు యంత్రాంగం మరో భారీ గంజాయి స్మగ్లింగ్‌ను ఛేదించింది. ఉల్లిపాయల వ్యాపారం ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముఠాను మదనపల్లె తాలూకా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియాకు వెల్లడించారు. డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ, సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం తిరుపతి ప్రధాన రహదారిలోని యర్రగానిమిట్ట వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నంబర్ లేని లగేజీ ఆటోను తనిఖీ చేయగా, పైన ఉల్లిపాయల బస్తాలు పేర్చి, కింద ఉన్న తొమ్మిది ఉల్లిపాయల బస్తాల్లో దాచిన దాదాపు 179 కేజీల గంజాయి బయటపడింది. దీని విలువ సుమారు రూ. 44,65,000 గా అంచనా వేశారు. ఆటోలో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న చంద్రాకాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఆవుల నాగరాజ (23), ఆవుల సుగుణ (29) ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వీరిపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశసరు. ఈ ముఠాలో ఉన్న మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మదనపల్లె పరిసర ప్రాంతాల్లో యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్న ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడంలో సహకరించాలని కోరారు. భారీ గంజాయిని పట్టుకున్న మదనపల్లె తాలూకా పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## కొల్లేరుపై త్వరలోనే సుప్రీం కోర్టుకు నివేదిక

### కేంద్ర మంత్రి, సిఇసి సభ్యులతో ఎంపి పుట్టా మహేష్‌కుమార్ భేటీ

**ఏలూరు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10:** కొల్లేరు ఆక్వా రైతుల కష్టాలకు ముగింపు పలికే రోజు త్వరలోనే వస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీ లో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను, కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు సీపీ గోయల్ ను కలిసిన ఎంపీ కొల్లేరు సమస్యపై చర్చించారు. చర్చల సారాంశాన్ని వీడియో ద్వారా మీడియాకు విడుదల చేశారు. లక్షలాది ఆక్వా రైతుల, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన కొల్లేరు సమస్యపై దృష్టి పెట్టాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రికి ఇచ్చిన లేఖలో కోరినట్లు ఎంపీ తెలిపారు. ఈ సమస్యపై ఆంధ్రప్రదేశ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.వి. రామరాజు ఇచ్చిన వినతి పత్రాన్ని కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖకు జత చేశారు. కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ క్షేత్ర సరిహద్దుల నిర్ణయంలో సుదీర్ఘ జాప్యం జరుగుతుండటం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖలో సుప్రీంకోర్టు ఆదేశాలు, అనంతరం కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని కేంద్ర సాధికార కమిటీ సందర్శించిన అంశాలను ఎంపీ ప్రస్తావించారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిని మించి సీఈసీ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అదనపు సమాచారం కోరడం వల్ల మరిన్ని సంక్లిష్టతలు ఏర్పడటమే కాకుండా, కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ క్షేత్ర సరిహద్దుల హేతుబద్ధీకరణపై జాతీయ వన్యప్రాణి మండలి ఇచ్చిన సూచనల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎంపీ తన లేఖలో వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్య పరిష్కరించని కారణంగా స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతంలోని తొమ్మిది మండలాల పరిధిలోని 122 గ్రామాల్లో నివసిస్తున్న దాదాపు మూడు లక్షల మంది ప్రజలు వ్యవసాయం, మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ సమస్య వల్ల వారి జీవనోపాధి ప్రభావితమవుతోందని చెబుతూ సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా, అదే సమయంలో స్థానిక ప్రజల న్యాయసమ్మత హక్కులు, జీవనోపాధి కాపాడేలా కేంద్ర ప్రభుత్వం మానవీయ దృష్టితో జోక్యం చేసుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కి విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి, సీఈసీ సభ్యులు కొల్లేరు సమస్య పట్ల సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొద్ది రోజుల్లో సమాచారం సుప్రీం కోర్టు నియమించిన సాధికారిక కమిటీకి చేరుతుందని, అనంతరం నివేదిక తయారు చేసి సుప్రీం కోర్టుకు సమర్పిస్తామని వారు హామీ ఇచ్చినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. కొల్లేరు రైతాంగానికి అనుకూలంగానే సుప్రీం కోర్టు తీర్పు వస్తుందనే అశాభావాన్ని ఎంపీ వ్యక్తం చేశారు.

# భక్త కన్నప్ప ధ్వజారోహణతో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తూ పూజలందుకున్న దివ్య క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తుడు కన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మొదటి పూజలు భోళాశంకరుడు తన భక్తుడు తిన్నడు అనే భక్తకన్నప్పకు ప్రసాదించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం భక్తకన్నప్ప కొండపై శాస్త్రోక్తంగా పూజలుజరిపి ధ్వజారోహణ కార్యక్రమాల్ని జరిపారు. భక్తకన్నప్ప విగ్రహాన్ని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేసి కొండపైకి తీసుకెళ్ళారు. అక్కడి ఆలయం వద్ద ప్రతిష్ఠించి ఆలయప్రధానార్చకులు డాక్టర్ ఎస్ఎంకె స్వామినాధన్ గురుకుల్ కలశస్థాపన చేయగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితులు వేదమంత్రాల్ని పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం కొత్తగా ఏర్పాటు చేసిన పంచలోహ కవచంతో అలంకరించిన ధ్వజస్థంభంపై వస్త్రాన్ని అధిరోహించారు. ఈ కార్యక్రమాల్లో హర హర మహాదేవ శంభోశంకరా అంటూ నినాదాలు చేస్తూ ధ్వజారోహణ జరిపారు. ఈ పూజలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. అనంతరం భక్తకన్నప్పను పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు తెలుగుదేశం నాయకులు ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓలు మోహన్, హేమామాలిని, విద్యాసాగర్‌రెడ్డి ఉత్సవాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ప్రోటోకాల్ ఇన్‌చార్జి నాగభూషణం, ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, సుదర్శనం తదితరులు హాజరయ్యారు. బుధవారం ఉదయం ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజారోహణ జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో మొదటి పూజలు శివయ్యభక్తుడు తిన్నడికి ఇస్తారు. ఇది అది నుంచి వస్తున్న ఆచారం. అప్పటితోనే శివరాత్రి బ్రహోత్సవాలకు అంకురార్పణ గావిస్తారు. ఇక్కడి ఆలయంలో వెలసిన స్వయంభువుకు రెండోరోజు పూజలు నిర్వహిస్తారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా ఒకేధ్వజ స్తంభం ఉండటం అనవాయితీ. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆలయప్రధాన ద్వారం వద్ద సుమారు 40 అడుగుల ఎత్తుగల రాతిస్తంభం, దానిపక్కనే గురుదక్షిణామూర్తికి బంగారు ధ్వజస్థంభం, ఆలయంలోపల ప్రవేశించిన తరువాత మరో బంగారు తాపటం ధ్వజస్తంభం కనబడుతుంది. శ్రీకృష్ణదేవరాయులు విజయయాత్ర నిర్వహిస్తు ఇక్కడికి వచ్చినపుడు తన విజయచిహ్నాంగా ఆలయంలో ఏదైనా నిర్మాణం చేపట్టాలని ఇక్కడినిర్వాహాకులను కోరగా అప్పటికే ఆలయ నిర్మాణం పూర్తి అయ్యింది. మరి ఆయన విజయయాత్రకు సూచకంగా ఇక్కడ సుమారు 40 అడుగుల ఎత్తుగల ఏకశిల రాతి స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పై భాగాన నంది విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీన్ని చుట్టూ పెన్సింగ్ వేశారు. దాంతో ఉత్తరం చూస్తున్న ఏకశిలా విగ్రహంపై నందిని చూడాలనుకునే భక్తులు కోట మండపం వద్దకు వెళ్ళి నందిని దర్శించుకొని దండం పెట్టడం జరుగుతోంది. ఈ విజయస్థంభం వద్దే గతంలో మహిళా భక్తులు నేతి దీపాలు వెలిగించే వారు. కాగా ఆలయంలో స్వామి వారి గర్భగుడి ఎదురుగా ఉన్న స్థంభాన్ని 'ధ్వజస్తంభం' అంటారు. శ్రీకాళహస్తీశ్వరునికి నవగ్రహకవచం ప్రత్యేకార్షణ. సాధారణంగా ఏ శివాలయంలో అయినా విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేయటం ఆచారం. కాని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇందుకు భిన్నంగా ఉంటాయి. ఇక్కడి మూలవిరాట్టును తాకరు. శంఖంతోనే అభిషేకాలు నిర్వహిస్తారు. పూజలు, హారతులు కేవలం



పంచమూర్తుల దర్శనం

మూలవిరాట్టుకు అలంకరించి సవగ్రహా కవచానికే అందిస్తారు. మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో మూలవిరాట్టుకు భక్తులు అభిషేకాలు నిర్వహించరు. 13 రోజులపాటు దేవస్థానమే ఉభయదారులుగా పూజలు జరుపుతుంది. ఇక ఇక్కడి ధ్వజస్తంభంలో కూడా నాలుగువైపులా పంచమూర్తులను చిత్రించటం గమనించదగ్గ విషయం. అలాగే ధ్వజారోహణం సందర్భంగా కూడా పంచమూర్తుల కలశాలను నాలుగుదిక్కులా ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తారు. ఈ ధ్వజస్థంభానికి బంగారు తాపడం ను మాజీ చిత్తూరు శాసనసభ్యురాలు జరిపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహోత్సవాల్లోస్వామి ధ్వజారోహణలో ప్రత్యేకం భక్తులు సమర్పించిన చీరలను ధ్వజస్తభంపై అధిరోహించటం. అయితే ఇక్కడ మొక్కులు మొక్కుకున్నవారికి తప్పక భక్తజన వలభుడు తీరుస్తాడని ప్రతీతి. దాంతో ఏడాదికి ఆ ఏడాది భక్తులు సమర్పిస్తున్న చీరల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలంటే ఎంతో సంబరం. చుట్టుపక్కల జనానికి పండగ వాతావరణం.

## కన్యాశుల్కంతో బాల్య వివాహం.. బాలికా వధువుకు అన్యాయం

### చిన్నాన్న సాయంతో బయటపడ్డ బాలిక



**పుంగనూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** కన్యాశుల్కానికి ఆశపడి ఒక తల్లి రూ.2 లక్షలకు 14 ఏళ్ళు కూడా నిండు తన కూతురుని బేరం పెట్టింది. రూ.50 వేలు అడ్వాన్సుగా తీసుకొని 14 ఏళ్ల చిన్నారిని వ్యక్తికిచ్చి వివాహం జరిపించింది. అభం శుభం ఎరుగని ఆ చిన్నారి పెళ్లికూతురు వరుడి వేధింపులు భరించలేక చిన్నాన్న లోకేష్ సాయంతో బయటపడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఉదంతం వెనుక వివరాలివి. అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలోని ప్రకాశం కాలనీకి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలికను కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు చెందిన రాజశేఖర్‌అనే వ్యక్తికిచ్చి పది రోజుల క్రితం వివాహం జరిపించిన పెద్దమనిషి రెడ్డప్ప. బాలిక తల్లిదండ్రులు ఘర్షణ పడి కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. తండ్రి రామరాజుకి తెలియకుండా తల్లి శోభ ఎదురుకట్నం ఇచ్చేలా రెడ్డప్ప అనే పెద్దమనిషి తో ఒప్పందం కుదుర్చుకుని ఇదంతా జరిపించారు. వివాహం అనంతరం వరుడి వేధింపులు తాళలేక బాలికా వధువు చిన్నాన్న లోకేష్ కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. లోకేష్ మాట్లాడుతూ హేమశ్రీ ని చిత్రహింసలకు గురి చేసి ఇష్టం లేని వివాహం జరిపించారాని తెలుసుకొని అతను సోమవారం పోలీసులకు ఈ విషయం చెప్పడంతో వారి సాయంతో బాలిక తండ్రి చెంతకు చేరింది. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా పెద్దకుమార్తె హేమశ్రీకి తల్లి వివాహం చేసిందని తండ్రి, బంధువులు చెబుతున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## 7,514మంది ఉద్యోగులకు ప్రమోషన్లు, 20ఫిబ్రవరి లోపు ఎంప్యానెల్ పూర్తి లక్ష్యం

**- ఆర్టిసీలో వివిధ విభాగాల్లో 7,673పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతిపై ప్రతిపాదన**

### ఆర్టీసిపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమీక్ష



**సచివాలయం,ఫిబ్రవరి 10,ప్రభాతవార్త :** రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రాసాద్ రెడ్డి మంగళవారం సచివాలయంలోని తన చాంబర్లో ఏపిఎస్ఆర్టీసి లోని పలు అంశాలపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ప్రమోషన్లు, నియామకాలు, బకాయిల చెల్లింపులు, వైద్య కారణాలతో రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలు, కారుణ్య నియామకాలు, సినియార్టి జాబితాలు, కోర్టు కేసుల స్థితి గతులపై మంత్రి విస్తృతంగా చర్చించారు. 2025--206 డిపిసి కింద అర్హులైన 7,514మంది ఉద్యోగులకు ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, 20-02-2026లోపు ఎంప్యానెల్ పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. లెవల్స్ 3,4,5 ఈఈల సీనియారిటి జాబితాల ఆధారంగా డిపిసిలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో 7,673పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరనున్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2020లో 51,488మంది ఉద్యోగులు ఉండగా ప్రభుత్వం 44,131మందికి మాత్రమే సేవల్లో ఉన్నారని, 2026, 2027, 2028సంవత్సరాల్లో పెద్దసంఖ్యలో ఉద్యోగులు రిటైర్ కానున్నారని వివరించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్ తదితర పోస్టులకు ప్రాధాన్యతతో భర్తీ చేయాలని మంత్రి సూచించారు. 01-01-2020 నుంచి వైద్య కారణాలతో 682మంది ఉద్యోగులు రిటైర్ అయినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 36మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగం, మిగిలిన 646మందికి ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని వివరించారు. ఒక్కో ఉద్యోగికి రూ.15లక్షల చొప్పున మొత్తం ఆర్థిక భారం రూ.96.90కోట్లుగా అంచనా వేశారు. ఉమ్మడి కడప ప్రాంతంలో కండక్టర్ ఖాళీలు లేకపోవడంతో 191కారుణ్య నియామక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 28-09-2023, 29-09-2023తేదీల్లో సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయినా ఇప్పటివరకు నియామకాలు జరగలేదని, కలెక్టర్ కార్యాలయం నుంచి స్పష్టమై స్పందన రాలేదన్నారు.

## వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా రోడ్‌మ్యాప్

### నెరవేరని మధ్యతరగతి, యువ వ్యవస్థాపకుల ఆశలు

### కేంద్ర బడ్జెట్ పై చర్చలో వైసిపి ఎంపి మేడా రఘునాథరెడ్డి



**రాజంపేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** దేశ ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ కనిపిస్తోందని, దేశ ఆర్థిక వృద్ధి ప్రధానంగా మధ్యతరగతి ప్రజలు, చిన్న వ్యాపారులు, యువ వ్యవస్థాపకులపై ఆధారపడి ఉందని అయితే బడ్జెట్లో వారి ఆశలు నెరవేరలేదని వైసిపి ఎంపీ మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మూడు ముఖ్య అంశాలను బడ్జెట్ పై చర్చలు మంగళవారం రాజ్యసభదృష్టికి తీసుకువచ్చారు. మధ్యతరగతికి పన్ను భారంలో ఉపశమనం లేదన్నారు. వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్ల పెరుగుతున్నప్పటికీ పన్ను స్లాబులు యథాతథంగా కొనసాగడం వల్ల ద్రవ్యోల్బణ ప్రభావంతో మధ్యతరగతి ప్రజలపై అదనపు భారముందని పేర్కొన్నారు. సంవత్సరానికి సుమారు 15 లక్షల ఆదాయం ఉన్న కుటుంబాలు గృహం, ఆరోగ్యం, విద్య ఖర్చులతో తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాయని తెలిపారు. 30 శాతం గరిష్ట పన్ను రేటు తక్కువ ఆదాయ స్థాయిలోనే వర్తించడంతో పెట్టుబడులు, వినియోగం దెబ్బతింటున్నాయని, ఈ పరిమితిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచకపోవడం కూడా నిరాశ కలిగించిందని విమర్శించారు. వ్యాపారాలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లోపం వ్యాపార వాతావరణాన్ని మెరుగుపర్చాల్సిన సమయంలో దీర్ఘకాలిక పన్ను వివాదాల పరిష్కారానికి ప్రత్యేక పథకం లేకపోవడం నిరుత్సాహకరమన్నారు. ప్రస్తుతం లక్షలాది పన్ను అప్పీలు పెండింగ్‌లో ఉండటంతో వ్యాపార మూలధనం నిలిచిపోతోందని తెలిపారు. జీఎస్టీ అమలులో కొంతమంది ఫీల్డ్ అధికారులు అనవసర నోటీసులు జారీ చేస్తూ వ్యాపారులను వేధిస్తున్నారని తెలియజేశారు. నమ్మకపూరిత విధానం అవసరమన్నారు. అలాగే, వర్క్స్ కాంట్రాక్టుల్లో ఉపకాంట్రాక్టర్లకు 5!! జీఎస్టీ రాయితీ సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ వల్ల ఎంఎస్ఎంఈలకు నష్టం జరుగుతోందని, జీఎస్టీ రిఫండ్లు సమయపాలనతో ఇవ్వాలని కోరారు. జనాభా లాభాన్ని ఉపయోగించుకునే విధానాలు అవసరం అన్నారు. దేశ జనాభాలో దాదాపు 65!! మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు ఉన్నారని, 2041 నాటికి యువభారత్ గరిష్ట స్థాయికి చేరుకుంటుందని అంచనా. ప్రభుత్వ ఉపాధి మాత్రమే ఏటా అవసరమైన దాదాపు కోటి ఉద్యోగాలను సృష్టించదు. కాబట్టి, ముఖ్యంగా అధిక వృద్ధి చెందుతున్న రంగాలలో యువ వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడంపై విధానం దృష్టి పెట్టాలని సూచించారు. మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, టియర్-2, టియర్-3 నగరాల్లోనూ వ్యాపార అవకాశాలు పెంపొందించేలా క్రెడిట్ గ్యారంటీ, నియంత్రణ సడలింపులు అవసరమన్నారు. వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా దీర్ఘకాలిక ఎంట్రప్రెన్యూర్‌షిప్ డివిడెండ్ రోడ్‌మ్యాప్ రూపొందించాలని కోరారు. దేశ ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర బడ్జెట్ 2026-27కు వైసిపి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి రాజ్యసభలో తెలిపారు.

## రాష్ట్రంలో నీట్, ఇఎపి సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ : మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్

**విజయవాడ,ఫిబ్రవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నీట్, ఇఎపి సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్ తెలిపారు. మైనార్టీ సంక్షేమశాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంటు ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ద్వారా మైనార్టీ విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్, ఇఎపి సెట్ పోటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి మంచి ర్యాంకులతో వైద్య, ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు వీలుగా మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో 45 రోజులపాటు అందించనున్నట్లు పేర్కొన్నారు. నీట్, ఇఎపి సెట్ శిక్షణలో నిష్ణాతులైన అధ్యాపకులతో ఈ బోధనా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సిఇడిఎం వెబ్‌సైట్ లోనూ లేదా విజయవాడలోని సిఇడిఎం కార్యాలయంలోనూ సంప్రదించాలని కోరారు. మెయిల్ అడ్రస్ ఫోన్ నెంబర్లు 0866 2970567, మొబైల్ నెంబరు 7386 78 9966కు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

# స్వావలంబని పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించాలి

### - స్త్రీలు స్వయం సంవృద్ధిని సాధించేందుకు అవకాశం కల్పించండి

### - లోక్ సభలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి

**విజయవాడ,ఫిబ్రవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రభుత్వం ఉన్నత ఆశయంతో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన "స్వావలంబని పథకాన్ని" ఆంధ్రప్రదేశ్లో విస్తరించి, మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించి, మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలని కేంద్ర నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. తద్వారా స్త్రీలు స్వయం సంవృద్ధిని సాధించేందుకు వీలవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ప్రజా సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ పథకాలను.. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మార్గ నిర్దేశంలో ఆంధ్రప్రదేశ్కు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన "స్వావలంబని పథకాన్ని" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తన వంతు పాటుపడున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం లోక్ సభలో స్వావలంబని పథకానికి సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా కోరినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలియజేశారు. ఇందులో ముఖ్యంగా దేశవ్యాప్తంగా స్వావలంబిని పథకం కింద ఉన్నత విద్యా సంస్థల సంఖ్య ఎంత..? వ్యవస్థాపకత అవగాహన కార్యక్రమం వ్యవస్థాపకత అభివృద్ధి కార్యక్రమం కింద నమోదు చేసుకున్న మహిళా విద్యార్థుల మొత్తం సంఖ్య..? ఆంధ్రప్రదేశ్లో ఉన్నత విద్యా సంస్థలకు కార్యక్రమాన్ని విస్తరించినందుకు ప్రభుత్వం ప్రణాళికలు కలిగి ఉందా..? అయితే కవర్ చేయాలని ప్రణాళిక చేసిన సంస్థల సంఖ్యతో పాటు టైం వివరాలేంటి..? అలాగే స్వావలంబిని పథకం అమలు కోసం కేటాయించిన, ఆమోదించబడిన, విడుదల చేసిన మొత్తం నిధుల వివరాలు, విత్త నిధులు, మెంటర్‌షిప్, అవార్డుల కోసం కేటాయించిన ఫండెంత..? అదేవిధంగా ప్రభుత్వం, స్వావలంబిని పథకం కింద నైపుణ్య అభివృద్ధి సంస్థల మధ్య ఏవైనా భాగస్వామ్యాలు లేదా అవగాహన ఒప్పందాలు ఏర్పాటు చేయబడ్డాయా, అయితే, దాని వివరాలేంటి..? కార్యక్రమం ఫలితాలను ట్రాక్ చేయడానికి ఏదైనా పర్యవేక్షణ లేదా అంచనా విధానం ఉందా..? అన్న అంశాలకు సంబంధించిన వివరాలను లోక్ సభలో కేంద్ర నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ కోరినట్లు ఆయన తెలిపారు.

దీనికి సంబంధిత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తక్షణం స్పందించి, లిఖిత పూర్వకంగా తమకు సమాధానం ఇచ్చినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు వెల్లడించారు.

# ఇక గ్రేటర్ తిరుపతి నగర పాలక సంస్థకే ఎన్నికలు

## - బడ్జెట్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష




**తిరుపతి,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరప్రాధాన్యత,పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు రూరల్ మండలంలోని పలు పంచాయతీలు తిరుపతినగరంలో కలిసే ప్రణాళికలు సిద్ధమయ్యాయని తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష తెలిపారు. ఈ కారణంగా రానున్న ఎన్నికలు మాత్రం గ్రేటర్ తిరుపతి నగర పాలక సంస్థకే జరుగుతాయని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందుకు మరోసారి రాష్ట ప్రభుత్వానికి తిరుపతి కౌన్సిల్ తరపున, తిరుపతి నగర ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. గతంలో నే కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ తిరుపతికి ఆమోదం తెలిపారు. బడ్జెట్ అనేది ఒక నిర్ణీత కాలానికి (సాధారణంగా ఒక సంవత్సరం) రాబోయే ఆదాయ, వ్యయాల యొక్క అంచనా ఆర్థిక ప్రణాళిక. ఇది కుటుంబం, వ్యాపారం లేదా దేశం మరియు మన లాంటి నగరం యొక్క ఆర్థిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి, అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవడానికి , పొదుపును పెంచుకోవడానికి సహాయపడే ఒక నివేదికఅన్నారు. తిరుపతి నగరపాలకసంస్థ బడ్జెట్ సమావేశం మంగళవారం తిరుపతి ఎస్వీయూ సెనేట్‌హాల్‌లో జరిగింది. తిరుపతి నగరపాలక సంస్థ చివరి ఐదవ బడ్జెట్ సమావే శాలను మేయర్ డాక్టర్ శిరీష ప్రవేశపెట్టారు. తిరుపతి నగర ప్రజలకు తాము చెల్లిస్తున్న ప్రతి రూపాయిని మేము ఎన్నుకున్న మా ప్రతినిధులు చాలా జాగ్రత్తగా, బాధ్యతగా ఖర్చు పెడుతున్నారనే భావంతో ఉన్నారన్నారు. తిరుపతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం కావున భవిష్యత్తు నగర అభివృద్ధి అవసరమైన మౌలిక వసతుల కోసం మన ఆలోచనలు ఉండాలన్నారు.

ఈ సమావేశంలో తిరుపతి నగర కమిషనర్ మౌర్య,ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం,ఎమ్మెల్యే శ్రీనివాసులు,కార్పొరేటర్లు , అధికారులు పాల్గొన్నారు.

# మార్చి 10 నాటికి 50 టిఎంసిలు తీసుకురావాలన్నదే లక్ష్యం

## - హంద్రీనీవా ద్వారా ఇప్పటికి 44 టిఎంసిల నీళ్లు తీసుకొచ్చాం

## - హంద్రీనీవా ఎస్ఇ రాజా స్వరూప్ కుమార్



**అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో** హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా వచ్చే మార్చి 10వ తేది నాటికి 50 టీఎంసీలు నీటిని తీసుకురావాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 44 టీఎంసీల నీరు వచ్చినట్లు హంద్రీనీవా(హెచ్ఎన్ఎస్ఎస్) హంద్రీనీవా జిల్లా ఎస్ఈ ఎ.రాజాస్వరూప్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. హంద్రీనీవా నీటితో రాయలసీమ మరో కోస్తా కానుందని హంద్రీనీవా కాలువలకు లైనింగ్ పనులు చేయడం ద్వారా నీటిని ఎక్కువగా తీసుకొచ్చేందుకు అవకాశం ఏర్పడిందని ఈ ఏడాది కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లామని కుప్పం నియోజకవర్గం ఉన్న అన్నమయ్య జిల్లాకు 4.4 టీఎంసీల నీరు తీసుకెళ్లామని ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ద్వారా 190 చెరువులకు నీళ్ల ఇచ్చినట్లు రాష్ట ప్రభుత్వం బృహత్తర ఆశయంతో ఎక్కువ నిధులు వెచ్చించడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని ఆయన వెల్లడించారు. మంగళవారం ప్రభాతవార్తకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హంద్రీనీవా కింద చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. హంద్రీనీవా పథకంలో భాగంగా కాలువలు లైనింగ్ పనులు చేస్తే నీటి సామర్థ్యం పెరుగుతుందని రాష్ట ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా 3,850 క్యూ సెక్కుల సామర్థ్యంతో నీరు వచ్చే 0 కిలోమీటర్లు 216 కిలోమీటర్ల వరకు అంటే మాల్యాల నుంచి జీడిపల్లి వరకు లైనింగ్ పనులు చేపట్టామన్నారు. 216 కిలోమీటర్ నుంచి 400 కిలోమీటర్ల వరకు 2,500 క్యూ సెక్కులతో లైనింగ్ పనులను కాలువ వెడల్పు పనులకు ప్రధాన కాలువ చేపట్టినట్లు ఆయన తెలిపారు. కాలువ లైనింగ్ పనులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తుతం కాలువలో నీరు ఉన్నందున చేపట్ట లేదని కాలువలో నీరు ఆగిన తర్వాత టెండర్ షెడ్యూల్‌లో ఏపీ అభివృద్ధి పనులు పేర్కొన్నారో వాటన్నింటినీ 100కి 100 శాతం పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల లైనింగ్ పనులను 100 రోజుల్లోనే పూర్తి చేసి జులై 17 నుంచి 3,850 క్యూ సెక్కులతో నీటిని తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని హంద్రీనీవాను టాప్ ప్రయారిటీగా రాష్ట ప్రభుత్వం బావిస్తోందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. హంద్రీనీవా పథకం కింద వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు సిబ్బంది, ఇంజినీర్ల కొరత కూడా లేదని ఆయన చెప్పారు. ఈ ఏడాది హంద్రీనీవా పథకం కింద ఇప్పటి వరకు కర్నూలు

జిల్లాకు 1.48 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో అనంతపురం నుంచి జీడిపల్లి వరకు 3.8 టీఎంసీలు, మొత్తం అనంతపురం జిల్లాలో 27.5 టీఎంసీలు, శ్రీ సత్యసాయి జిల్లాకు 24 టీఎంసీలు, కుప్పం నియోజకవర్గం ఉన్న అన్నమయ్య జిల్లాకు 4.4 టీఎంసీల నీటిని తీసుకొచ్చినట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ ఎ.రాజాస్వరూప్‌కుమార్ వెల్లడించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

## పాలవ్యాను సహా 6 టన్నుల రేషన్ బియ్యం సీజ్

## రేషన్ బియ్యం అక్రమ రవాణాలో డ్రైవర్ అరెస్ట్: సిఐ సురేష్‌కుమార్



**చంద్రగిరి(తిరుపతి జిల్లా), ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** రైతుల వ్యవసాయ పొలాల వద్ద గల ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను చోరీ చేసుకుని వెళుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సిఐ సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రాన్స్ ఫార్మర్లలో కాపర్ వైర్లు చోరీ జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని అన్నారు. ఈ విషయమై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు .. డిఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో సిఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు రవిప్రకాష్ రెడ్డి, అరుణాచలం, ప్రవళ్ళిక, మురళీమోహన్‌లను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి నిందితుల కోసం ప్రణాళిక బద్ధంగా గాలింపు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం చంద్రగిరి బైపాస్ నాగాలమ్మ మలుపు వద్ద తిరుపతి, ఐఎస్ మహల్ ప్రాంతానికి చెందిన షేక్ మహమ్మద్ యూనస్ (20), చంద్రగిరి మండలం, అగరాలకు చెందిన షేక్ అబ్దుల్లా అలియాస్ అబ్దుల్ కలాం (21) రెండు సంచులు పట్టుకుని అనుమానాస్పందంగా వుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని సంచులను పరిశీలించగా వాటిలో సుమారు రూ.40 వేలు విలువైన 36 కేజీలు కాపర్ వైర్‌ను సీజ్ చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను విచారణ చేయగా రామచంద్రా పుర ం, చంద్రగిరి మండలాలలో పగలు రెక్కీ నిర్వహించి, రాత్రివేళ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును చోరీ చేస్తున్నట్లు అంగీకరించారన్నారు. ఆ మేరకు చోరీ చేసిన కాపర్‌ను విక్రయించేందుకు వెళుతుండగా ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, ఏఎస్ఐ మునిరత్నం, శీను, పురంధర్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారంతో నూర్ జంక్షన్ వద్ద నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రైతుల వ్యవసాయ పొలాల వద్ద వంతుల వారీగా ట్రాన్స్‌ఫార్మర్లను గమనించాలన్నారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని కొత్తవ్యక్తులు సంచరిస్తున్నట్లయితే 100కు లేదా 112కు నంబర్లకు కాల్‌చేసి చెప్పాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రైతులను సమన్వయం చేసుకుని చోరీల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.అదేవిధంగా పాలవ్యాన్‌లో రేషన్ బియ్యంను అక్రమంగా తలిస్తున్న ముళబాగళ్‌కు చెందిన డ్రైవర్ పి.లక్ష్మీపతిని అరెస్ట్ చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. పలమనేరుకు చెందిన కిషోర్‌రెడ్డి సహకారంతో తిరుపతి నుండి 6100 కేజీలు రేషన్ బియ్యంను కర్ణాటకకు తరలిస్తుండగా ఎస్ఐ ప్రవళ్ళిక బృందానికి అందిన రహస్య సమాచారంతో తొండవాడ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో అనుమా స్పదంగా వున్న వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను తనిఖీ చేయగా రేషన్ బియ్యం వెలుగుచూసినట్లు తెలిపారు. రేషన్ బియ్యంను సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ సురేంద్రకు అప్పగించగా విఆర్ఓ రుకేష్, విఆర్ఏ లోకేష్‌కు గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

# లడ్డు విషయంలో చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డాడు

## మీడియా సమావేశంలో టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి




**తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** తిరుమల లడ్డు కలిపి విషయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆత్మ రక్షణలో పడ్డాడని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూటమి ప్రభుత్వం, టిటిడి యాజమాన్యంపై నిప్పులు చెరిగాడు. తన నివాస గృహంలో మంగళవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయ సంప్రదాయాలకు,ఆచారాలకు భిన్నంగా మొదటి సారిగా పెద్ద జీయంగార్‌తో మఠం లేఖ రాయించారని,రాజకీయ హోమంలో వాడుకునేందుకు చంద్రబాబు, బి.ఆర్.నాయుడు, ఈవో రవి చంద్ర ఆడుతున్న నాటకమన్నారు. సెప్టెంబర్ 23 ....2024 బంగారు బావి దగ్గర శాంతి హోమం, ఆలయ సంప్రోక్షణ చేశారని,ఇక మీదట తప్పులు జరగవని, దోషాలు ఉండవని అప్పటి ఈవో శ్యామల రావు , జె.ఈ. వో తో కలిసి వాస్తు శుద్ధి ,శాంతి హోమం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ఒత్తిడి కు లోనై జీయర్ స్వాములు లేఖ రాశారులడ్డు లో ఆవుకొవ్వు,ఫిష్ ఆయిల్, పంది కొవ్వు కలవలేదని సిట్ రిపోర్ట్ ఇచ్చిన తర్వాత కూడా విషం చిమ్మడం ఏమిటి అని ప్రశ్నించారు హిందూ మతం విద్వేషాలు రెచ్చగొట్టడానికి లడ్డు విషయం తీసుకుని రావడం బాధాకరమన్నారు. జగద్గురువు రామానుజాచార్యులు పరంపర లో ఉన్న పెద జీయర్ మఠం కూడా పావుగా మారింది.నేను పేద జీయర్ స్వామీజీ ను ప్రశ్నిస్తున్నా.. రాజకీయనేతలకు, పాలక మండలి సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని సిట్ నివేదిక చెప్పిన తర్వాస్వాములను భయపెట్టి ఆయన చేతనే ఇలాంటి లేఖలు రాయించ ˊడంధను ర్మాసం లో పెద్ద పెద్ద వాళ్ళతో తిరుప్పావై పఠనం చెప్పించారు. వైఎస్సార్ హయాంలో,జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఆర్థిక ఇబ్బందులు తో జీయర్ మఠం కు టిటిడి ధన సహాయం పెంచిన వాస్తవం గుర్తు చేశారు .చంద్రబాబు క్షుద్ర రాజకీయాలు కు ఆధ్యాత్మిక ప్రముకులు నలిగి పోవడం బాధాకరంఅత్యంత అవినీతి పరుడైన బొక్కసం ఇంచార్జి గురు రాజా రెండు గంటలు పాటు ఒత్తిడి చేసి లేఖ విడుదల చేశారుపెద జీయర్ తమిళుడు, తెలుగులో రాసి ఆయనతో హిందీలో సంతకం చేయించారుసెలెక్టెడ్ స్వామీజీలుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పై బురద చల్లుతున్నారుచంద్రబాబు అధర్మ క్షుద్ర హోమంలో మీరు పావులుగా మారొద్దని హితవు పలికారు.సీబీఐ నివేదికపై విష ప్రచారం చేస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి హిందూ ద్వేషి అని ప్రచారం చేయిస్తున్నారుహైందవ సమాజానికి వైఎస్ఆర్ చేసిన కృషి చంద్రబాబు ఏనాడు చేయలేదుఅలిపిరి వద్ద శ్రీనివాస దివ్యనుగ్రహ హోమం చేస్తున్నది వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలోనేరెడ్ బుక్ రాజ్యాంగం పెద్ద జీయర్ నే కబళించింది జగన్ మోహన్ రెడ్డి ను రాజకీయంగా ఎదుర్కోలేక

మమ్మల్ని. తగిన మూల్యం చెల్లించు కుంటారువైకుంఠ ఏకాదశి 10 రోజుల పాటు చేయాలనీ పెదజీయర్ అనుమతితో నిర్ణయం తీసుకున్నాం.

చంద్రబాబు పాలనలో ఏ.ఆర్ డైరీ కల్తీ నెయ్యి ట్యాంకర్ లు పట్టుబడ్డాయి, వాటిని తిరిగి లడ్డు ప్రసాదంచంద్రబాబు పాలనలో తిరిగి 4 ట్యాంకర్లు కల్తీ నెయ్యి తో లడ్డూలు తయారు చేశారు.వెంకటేశ్వర స్వామినే రాజకీయంగా వాడుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# వికసిత్ ఆంధ్రప్రదేశ్, భారత్ లక్ష్యంతోనే ఎన్డీయే ప్రభుత్వం ముందుకు సాగుతోంది :ఎమ్మెల్యే సుజనా చౌదరి

## - బిజెపి శాసనసభా పక్ష సమావేశంలో సుజనా చౌదరి, విష్ణుకుమార్‌రాజులు ఎమ్మెల్యేలకు మార్గదర్శనం

**విజయవాడ,ఫిబ్రవరి10,ప్రభాతవార్తప్రతినిధి:**వికసిత్ ఆంధ్రప్రదేశ్, భారత్ లక్ష్యంతోనే ఎన్డీయే ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్ రాజు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ శాసనసభ్యుల సమావేశంలో సుజనా చౌదరి మాట్లాడుతూ శాస్త్రీయ విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ కు జరిగిన నష్టాన్ని కేంద్రం భర్తీ చేస్తోందని తెలిపారు. రాష్టానికి సంబందించిన హై స్పీడ్ ట్రైన్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం, బ్లూ ఎకానమీ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించడం హర్షణీ యమన్నారు. అదేవిధంగా, కేంద్రం నుండి గరిష్ట నిధులు సాధించేలా సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. వ్యవసాయానికి గ్లోబల్ బ్రాండింగ్, ప్రత్యేకించి కొబ్బరి, కోకో, జీడిమామిడి పంటలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారని కొనియాడారు. పర్యాటకం, ప్రకృతి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని గుర్తు చేశారు. గత 12 ఏళ్లుగా శాస్త్రీయత లేకుండా రాష్ట్రాన్ని విభజించిన కారణంగా మనం కోల్పోయిన వాటిని భర్తీ చేయడానికి మోదీ నాయకత్వంలో కేంద్రం అండగా ఉంటోందని తెలిపారు. హై స్పీడ్ ట్రైన్ కారిడార్ల ఏర్పాటు, మహిళల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, బ్లూ ఎకానమీలకు ప్రోత్సాహాలలో రాష్టానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని వివరించారు. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్ గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం సెక్టార్ల వారీగా కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. 2014- 15 నుండి ప్లానింగ్ కమిషన్ స్థానంలో నీతి ఆయోగ్ వచ్చిన తర్వాత బడ్జెట్ రూపకల్పన మారిందని. రైల్వే బడ్జెట్‌ను కూడా సాధారణ బడ్జెట్‌లో విలీనం చేశారన్నారు. ఇప్పుడు రాష్టాల వారీగా కాకుండా, సెక్టార్ల వారీగా, వినియోగం ఆధారంగా నిధులు కేటాయిస్తున్నారు కావున ప్రజలు విషయాన్ని అవగాహన పర్చుకోవాలని సూచించారు. గతంలో కొన్ని జిల్లాలకు కేంద్రం నిధులు ఇచ్చినప్పటికీ, రికార్డులు సమర్పించక పోవడం వల్ల నిధులు నిలిపివేశారని తెలిపారు. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చి ఆకాంక్షాత్మక జిల్లాలు గా పేరు మార్చారన్నారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉన్న ప్రకాశం జిల్లాకు ఇప్పుడు ప్రాధాన్యతనిస్తూ రోడ్లు, ఎక్స్‌ప్రెస్ వేలు మరియు ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కాలానికి అనుగుణంగా మనం మారాలి, సమాజం మారాలని, గతంలో టెలిగ్రామ్‌లు ఉండేవని, ఇప్పుడు ఈమెయిల్‌లు వచ్చాయి కదా అదే విధంగా మార్పులు సహజమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఏపీ లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి టాప్ 1 ర్యాంక్ రావడం అభినందనీయమన్నారు. మా పార్టీ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రాతినిధ్యం వహిస్తోన్నందున ఆయనను పార్టీ తరపున సత్కరించామని తెలిపారు. నియోజకవర్గంలో ఆయన చేస్తున్న సేవలకు ఇది గుర్తింపు అని కొనియాడారు.



బిజెపి శాసనసభా పక్ష సమావేశంలో సుజనా చౌదరి, విష్ణుకుమార్‌రాజులు

# అంబటి రాంబాబుకు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలి: పోలీసులకు హైకోర్టు ఆదేశం

**విజయవాడ.ఫిబ్రవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఘటనలో వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై రాష్ట వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో నమోదైన 33 కేసుల్లో బీ.ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదుదారులకు నోటీసులు ఇచ్చి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తనపై నమోదు చేసిన 33 కేసులను కొట్టేయాలని అంబటి రాంబాబు అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ జరిపింది. హైకోర్టులో సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అంబటి రాంబాబు తరఫున వాదనలు వినిపించారు. ఒకే ఘటన పై రాష్ట వ్యాప్తంగా మొత్తం 35 కేసులు నమోదు చేశారని అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందించారు. ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి వీల్లేదని సుప్రీం కోర్టు పలు తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఒకే ఘటనపై చాలా కేసులు నమోదు చేసిన నేపథ్యంలో పోలీసులకు తగిన సూచనలు చేయాలని పీపీ (పబ్లిక్ ప్రాసిక్యూటర్)ని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ నల్లపాడు ఠాణాలో నమోదైన కేసును ప్రధానమైనదిగా పరిగణించి మిగిలిన కేసుల ఎఫ్ఐఆర్‌లను సీఆర్‌సీపీ సెక్షన్ 162 ప్రకారం వాంగ్మూలాలుగా పరిగణించే విషయాన్ని పరిశీలించి తగిన సూచనలు చేస్తానన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలను పోలీసులు నిరోధించలేరని, ఈ నేపథ్యంలో వివిధ ఠాణాల్లో కేసులు నమోదు అయ్యాయన్నారు. వెన్నుపోటు దినం పేరుతో అనుమతి లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు అడ్డుకున్న సీఐ పై దూషించి బెదిరించారని అంబటి రాంబాబు పై పట్టాభిపురం పోలీసులు, జూట్‌మిల్ భూ వివాదంలో అంబటి రాంబాబు జోక్యం చేసుకొని తనను బెదిరించారంటూ ఓ కార్మిక నాయకుడు ఇచ్చిన ఫిర్యాదు పై గుంటూరులోని పట్టాభిపురం, నగరంపాలెం పోలీసులు గతేడాది నమోదు చేసిన 2 కేసుల్లో అంబటికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# చెల్లిని వివాహమాడి, అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుని మరణించేంత వరకు జైలు శిక్ష

**విజయవాడ. ఫిబ్రవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** స్వయానా చెల్లెలు మాయమాటలతో నమ్మించి, పెళ్లి చేసుకుని ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భానికి కారణమైన యువకుడి కేసులో విజయవాడ పోక్సో కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. నిందితుడికి మరణించే వరకూ జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ కుటుంబానికి చెందిన దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా తల్లిదండ్రులు విడిగా నివసిస్తున్నారు. తల్లి ఇద్దరు కుమార్తెలతో కలిసి కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మంటాడ గ్రామంలో ఉండగా, తండ్రి కుమారుడితో కలిసి ప్రకాశం జిల్లా కొండపి మండలం పెంట్లూరులో స్థిరపడ్డాడు. 2023లో 21 ఏళ్ల కుమారుడు తల్లి, చెల్లెళ్లను కలిసేందుకు వస్తున్నానని చెప్పి మంటాడకు చేరుకున్నాడు. అక్కడ పెద్ద చెల్లి (17)తో సన్నిహితంగా ఉన్న ఫొటోలు తీసి బెదిరిస్తూ పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2024 క్రిస్మస్ సందర్భంగా మళ్లీ మంటాడకు వచ్చిన అతడు.. తండ్రి వద్దకు తీసుకెళ్తానని చెప్పి బాలికను విజయవాడలోని ఓ చర్చికి తీసుకెళ్లి తాళి కట్టాడు. అనంతరం ఆమెను హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ కూడా అనేకసార్లు లైంగిక దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. బాలిక గర్భం దాల్చిన విషయం తెలిసిన తరువాత నిందితుడు ఆమెను గత ఏడాది ఫిబ్రవరిలో ఒంగోలు బస్టాండులో వదిలేసి హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చిన బాలిక కొన్ని రోజులకే జ్వరం, వాంతులతో అస్వస్థతకు గురి కావడంతో తల్లి వైద్య పరీక్షలు చేయించగా బాలిక గర్భిణిగా తేలింది. ఆమెను తల్లి గట్టిగా ప్రశ్నించగా జరిగిన విషయం మొత్తం చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు పమిడిముక్కల పోలీసులు నిందితుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ నిందితుడిని పెంట్లూరులో అరెస్టు చేశారు. ఈ కేసును స్పీడ్ ట్రయల్‌గా విజయవాడ పోక్సో కోర్టు జడ్జి వి.భవానీ విచారణ జరిపి నిన్న తీర్పు వెల్లడించారు. నిందితుడికి మరణించే వరకు జీవితకాల కారాగార శిక్ష, రూ.6 వేల జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.30 వేలు చెల్లించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి బాలికకు అందాల్సిన రూ.5 లక్షల సహాయం త్వరగా అందేలా చూడాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని కోర్టు ఆదేశించింది.

# చంద్రబాబుకు జగన్ ఫోబియో పట్టుకుంది

## - తిరుమల లడ్డుపై సిట్ నివేదిక ఇచ్చినా గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు - కూటమి నేతలు జగన్‌కు క్షమాపణ చెప్పాలి - వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



**అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వైఎస్.జగన్ ఫోబియో పట్టుకుందని, నిద్రలో కూడా జగన్ గుర్తుకు వస్తున్నాడని అన్ని మతాల వారు తిరుపతి లడ్డును ప్రసాదంగా భావిస్తున్నారని ఆ తిరుపతి లడ్డుపైనే సిట్ నివేదిక ఇచ్చినా వైసిపి నేతలపై అసత్య ప్రచారాన్ని వీడనాడటం లేదని సీనియర్ నేత వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు నియమించిన సిట్ బృందాలు తిరుమల లడ్డు వ్యవహారంలో ఆ నివేదికల్లో ఎలాంటి జంతువుల కొవ్వు కలపలేదని నివేదికలు స్పష్టం చేసినా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, ఇతర టీడీపీ నేతలు అవాస్తవ ప్రచారాన్ని కొనసాగించడం ఎంత వరకు కరెక్టు అని ఈ విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సీఎం చంద్రబాబు, ఇతర కూటమి నేతలు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అనంత వెంకటరామిరెడ్డి మాట్లా డుతూ. .టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు నాలుగు సార్లు సీఎం అయ్యారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు రాజకీయంగా ఆయన అభద్రత భావంతో ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబు పాపం పండటం వల్లే శ్రీవారి లడ్డు విషయంలో ఆయన చేసిన ఆరోపణలపై వాస్తవాలన్నీ బయటకు వస్తున్నాయని ఇప్పటికైనా చంద్రబాబు, కూటమి నేతలు వైఎస్.జగన్‌కు క్షమాపణలు చెప్పి ఇచ్చిన హామీలపైన, పరిపాలన పైన దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను ఇప్పటికే చంద్రబాబు దెబ్బతీశారని, ఇప్పటికైనా చేసిన తప్పును ఒప్పుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎపి వైద్య మండలికి 13 మంది సభ్యులు ఎన్నిక

**విజయవాడ,ఫిబ్రవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ వైద్య మండలి(ఏపీ మెడికల్ కౌన్సిల్) కి ఎన్నికైన 13 మంది సభ్యుల ఆన్‌లైన్ ఫలితాల్నివిడుదల చేసారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి, డైరెక్టర్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు మంగళవారం తన కార్యాలయంలో రిజల్ట్స్ విడుదల చేశారు. 10,293 కోట్లతో కోల అలేఖ్య ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా బొల్ల మోనిక 10,189 ఓట్లతో ద్వితీయ స్థానంలో, మనీష్ మండల 10,123 ఓట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. మంతిని వినోద్ కుమార్ కు 9,857 ఓట్లు, అరవ వెంకట సుబ్బారెడ్డికి 9,174 , ఓ. శివమోర్య గుప్తకు 8,884, ఇసుకపల్లి వాణికి 8,819, ఎం. వెంకటరమణకు 8,632, మెట్ల జయచంద్రారెడ్డికి 8,494, బొలెం తేజ్ నవీన్ కు 7,820, గార్లపాటి నంద కిషోర్ కు 7,705 శ్రీహరి కరువకు 7,553, కార్తీక్ తుమ్మలకు 7,154 ఓట్లు లభించాయి ఎన్నికల్లో విజయం సాధించిన వారికి ఆయన ధృవీకరణ అందజేశారు. ఈ సందర్భంగా చక్రధరబాబు మాట్లాడుతూ మొత్తం 56,156కు గాను 30,773 మంది (55 ) వైద్యులు "ఈ ఓటింగ్" ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం శుభ పరిణామన్నారు. ఎపిఎంసిలో 13 సభ్యుల స్థానాలకు 84 మంది వైద్యులు పోటీపడా రన్నారు. 20 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఈ ఎన్నికలు జరిగాయన్నారు.ఒక్కొక్కరు 13 ఓట్లు వేసేందుకు అవకాశం ఉండగా, మొత్తం 3,15,745 ఓట్లు పోలయ్యాయని. క్యుము లేటివ్‌గా ఎవరికైతే అధిక శాతం ఓట్లు వచ్చాయో వారు సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. ప్రజా స్వామ్యబద్ధంగా పారదర్శకంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు నిర్వహించా మన్నారు. అధునాతన టెక్నాలజీని ఉపయోగించి ఎన్నికల ప్రక్రియను సమర్థవంతగా నిర్వహించామని, ఓటర్లకు హెల్ప్ లైన్ ద్వారా రియల్ టైం విధానంలో సహాయ సహకారాల్ని అందించామన్నారు. అలాగే ఎపిఎంసి చునావ్ బాట్ అనే చాట్ బాట్ ను చాలా మంది వైద్యులు వినియోగించుకోవడం అభినందనీ యమన్నారు. మొత్తమ్మీద ఓటర్లుగా నమోదు, ఈ ఓటింగ్ విధానం పట్ల వైద్యుల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. వారి వారి ఉద్యోగాలు చేసుకుంటూ ఎంతో బిజీ షెడ్యూల్స్ లో చాలా మంది దేశ విదేశాల్లో ఉన్నా కూడా ఎపిఎంసి లో ఓటు వేసేందుకు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు సహకరించి సమర్థవంతంగా పనిచేసినందుకు ఎపిఎంసి రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ ను, రాత్రి పగలు పనిచేసిన ఎన్ఐసి, ఏపీఆన్‌లైన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్నికైన అభ్యర్థులు 13 మంది ఈ కౌన్సిల్ లో ఉంటారని, మరికొంతమందిని నామినేటెడ్ సభ్యుల్ని కూడా ప్రభుత్వం తరపున నియామకం జరుగుందని, మొత్తం 25 మంది సభ్యులతో ఎపిఎంసి సేవలందిస్తుందని చక్రధరబాబు తెలిపారు. ఎంబిబిఎస్ చదివిన వారు, పీజీ డిప్లమా చేసిన వారు, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు కూడా ఎన్నికల్లో పాల్గొన్నారన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు ఎన్నికల్లో పాల్గొన్నారన్నారు. ఎన్నికైన సభ్యులు వారి వారి వృత్తిపరమైన అనుభవాన్ని మండలి దృష్టికి తీసుకొచ్చి రానున్న రోజుల్లో ఎపిఎంసికి వన్నెతెస్తారనే నమ్మకం తనకుందని చక్రధరబాబు తెలిపారు. హైకోర్టు వారి ఆదేశాల మేరకు అత్యంత తక్కువ సమయంలో జవాబుదారితనంగా, పారదర్శకంగా ఎన్నికల్ని నిర్వహించామన్నారు.

### ప్రజా ప్రతినిధులకు మార్చి 5నుండి 7వరకు క్రీడాపోటీలు,సాంస్కృతిక కార్యక్రమాలు

### - స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సచివాలయం,ఫిబ్రవరి 10,ప్రభాతవార్త : అసెంబ్లీ సమావేశాల్లో ఆటవిడుపుగా ప్రజాప్రతినిధులకు క్రీడాపోటీలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వమించాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశి ంచారు. క్రీడల నిర్వహణపై సన్నద్ధతపై మంగళవారం స్పీకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

నెల రోజులపాటు జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు మార్చి 5,6,7 తేదీల్లో క్రీడాపోటీలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించి వారికి ఆటవిడుపు కలిగించాలని క్రీడలు,సాంస్కృతిక విభాగాల అధికారులకు సూచించారు.

## వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అజిత్‌కు జాతీయ రికార్డు




**న్యూఢిల్లీ:** జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2026లో అజిత్ జాతీయ రికార్డును సమం చేశాడు. పురుషుల 71 కిలోల విభాగంలో రైల్వేకు చెందిన ఎన్ అజిత్ మొత్తం 320 కిలోలతో ఆధిపత్యం చెలాయించాడు. 145 కిలోల స్నాచ్, కేటగిరీ బెస్ట్ 175 కిలోల క్లీన్ జెర్క్ ద్వారా హైలైట్ చేయబడిన 320 కిలోల మొత్తంతో ఎన్ అజిత్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. టి మాధవన్ మొత్తం 317 కిలోలతో దగ్గరగా ఉన్నాడు. క్లీన్ జెర్క్‌లో అజిత్ 175 కిలోలతో సరిపెట్టుకున్నా స్నాచ్‌లో 142 కిలోలతో కొంచెం తక్కువకు పడిపోయాడు. ఇక మొత్తం 300 కిలోల ఎత్తి యష్ ఖండగలే కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. యష్ ఖండగలే జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో మొత్తం 300 కిలోలు (138 కిలోల స్నాచ్ / 162 కిలోలు క్లీన్ జెర్క్) ఎత్తి జూనియర్ బంగారు పతకాన్ని సాధించాడు. అభినోబ్ గొగోయ్ మొత్తం 276 కిలోల బరువు ఎత్తి రజతం సాధించాడు, అందులో బలమైన 123 కిలోల స్నాచ్ కూడా ఉంది. కల్లోల్ మల్ 270 కిలోలతో పోడియంను పూర్తి చేసి కాంస్యం సాధించాడు.

## రైఫిల్ పిస్టల్ ఛాంపియన్‌షిప్స్‌లో షూటర్ నమ్యకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా రైఫిల్ పిస్టల్ ఛాంపియన్‌షిప్స్ 2026లో జూనియర్ షూటర్ నమ్య కపూర్ స్వర్ణం సాధించింది. షూట్‌ఆఫ్ థ్రిల్లర్ తర్వాత ఒలింపిక్ డబుల్ పతక విజేత, భారత్‌కు చెందిన మను భాకర్ రజతంతో సరిపెట్టుకుంది. దీంతో ఈ ఆసియా రైఫిల్/ పిస్టల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల సంఖ్య 60కి చేరుకుంది. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో, నమ్య కపూర్ ఇండోనేషియాకు చెందిన రిహాదతుల్ అసిఫాపై జరిగిన షూట్‌ఆఫ్‌లో విజయం సాధించి స్వర్ణ పతకం సాధించింది. ఇద్దరు షూటర్లు 29 షాట్‌లతో టైగా ముగించారు, తర్వాత నమ్య షూట్‌ఆఫ్‌లో మూడు హిట్‌లు కొట్టగా, ఆమె ప్రత్యర్థి స్కోరు నమోదు చేయలేకపోయింది. ఇక మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో నాటకీయ డబుల్ షూట్‌ఆఫ్ తర్వాత మను స్వర్ణ పతకాన్ని తృటిలో కోల్పోయింది, ఇషా సింగ్ కాంస్య పతకాన్ని సాధించింది. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో పోటీ పడిన మను భాకర్ ఫైనల్ ముగింపులో వియత్నాంకు చెందిన తుయ్ ట్రాంగ్ న్గుయెన్‌తో 35 షాట్‌లతో సమం చేయడంతో టైటిల్‌ను నిర్ణయించడానికి షూట్‌ఆఫ్ అవసరం అయింది. రెండవ షూట్‌ఆఫ్‌లో, మను మూడు షాట్లు పడగొట్టినప్పటికీ న్గుయెన్ ఆధిక్యాన్ని నిలుపుకుంది. ఈ తీవ్రమైన పోటీ తర్వాత రజతంతో మను సరిపెట్టుకుంది. ఈషా సింగ్ ఈ టోర్నీలో తన రెండవ వ్యక్తిగత పతకాన్ని గెలుచుకుంది. మాజీ ప్రపంచ ఛాంపియన్ అంజలి భగవత్ కాంస్య పతకం సాధించింది. ఫలితంగా మొత్తం పతకాల సంఖ్య 60కి చేరుకుంది, వీటిలో 37 స్వర్ణాలు, 13 రజతాలు మరియు 10 కాంస్య పతకాలు ఉన్నాయి.





## నెదర్లాండ్స్ ఘన విజయం

### నమీబియా 7 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ బోణీ కొట్టింది. పాకిస్థాన్‌తో తృటిలో చేజారిన పరాజయం నుంచి త్వరగానే కోలుకుంది. గ్రూప్ ఏ లో భాగంగా మంగళవారం ఢిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. బాస్ డీ లీడే(72 నాటౌట్, 2/20) ఆల్‌రౌండ్ షోతో నెదర్లాండ్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 156 పరుగులు చేసింది. జాన్ నికోల్ లాఫ్టీ(38 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 42),



జాన్ ఫ్రైలింక్(26 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నమీబియా బ్యాటర్లలో నలుగురు మాత్రమే రెండెంకలే స్కోర్ చేయగా, మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డీ లీడే(2/20), లోగన్ వాన్ బీక్(2/13) రెండేసి వికెట్లు తీయగా.. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 159 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. బాస్ డి లీడే(48 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కొలిన్ అకెర్‌మన్(38 బంతుల్లో సిక్స్‌తో 32), మైఖేల్ లెవిట్(15 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 28) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్(9 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 18 నాటౌట్) దూకుడుగా ఆడాడు. నమీబియా బౌలర్లలో బెర్నార్డ్, రుబెన్, జాన్ నికోల్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ గ్రూప్‌ఏలో రెండో స్థానంలో నిలిచింది. తదుపరి మ్యాచ్‌ల్లో ఆ జట్టు అమెరికా, భారత్‌తో ఆడనుంది.

## టి20 వరల్డ్‌కప్‌లో చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్

### యుఎఇపై ఘనవిజయం

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ డీలో భాగంగా యూఏఈతో మంగళవారం చెన్నై వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. న్యూజిలాండ్ ఆల్‌రౌండ్ షో ముందు యూఏఈ తేలిపోయింది. టీమ్ సీఫెర్ట్(89 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన



యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. మహమ్మద్ వసీమ్(66 నాటౌట్), అలిషాన్ షరఫురీ(55) హాఫ్ సెంచరీతో రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(2/37) రెండు వికెట్లు తీయగా, జాకోబ్ డఫ్ఫీ, లాకీ ఫెర్గూసన్, మిచెల్ సాంట్నర్, గ్లేన్ ఫిలిప్స్ తలో వికెట్ తీసారు. అనంతరం న్యూజిలాండ్ 15.2 ఓవర్లలో 175 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్ ఓపెనర్లు టీమ్ సీఫెర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించారు.తొలి వికెట్‌కు అజేయంగా 175 పరుగులు జోడించిన సీఫెర్ట్, ఫిన్ అలెన్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్య రికార్డ్ అందుకున్నారు. ఈ క్రమంలో ఇంగ్లండ్ ఓపెనింగ్ జోడీ అలెక్స్ హేల్స్, జోస్ బట్లర్ పేరిట ఉన్న రికార్డ్‌ను బ్రేక్ చేశారు. ఈ మ్యాచ్‌లో 175 పరుగుల భాగస్వామ్యంతో ఈ రికార్డ్‌ను టీమ్ సీఫెర్ట్, అలెన్ అధిగమించారు. ఈ విజయంతో న్యూజిలాండ్ గ్రూప్ డీలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌ను న్యూజిలాండ్ ఓడించిన సంగతి తెలిసిందే. తమ తదుపరి మ్యాచ్‌లను సౌతాఫ్రికా, కెనడాతో న్యూజిలాండ్ ఆడనుంది.










## టి20 వరల్డ్ కప్‌లో అరుదైన ఫీట్

### రెండుసార్లు ట్రోఫీ నెగ్గిన కెప్టెన్

**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ అంటే ఉత్సాహం, దూకుడు మరియు అద్భుతమైన ముగింపులు. క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రసిద్ధ మరియు మరపురాని క్షణాలను సృష్టించింది. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు, అద్భుతమైన క్యాచ్‌ల నుండి దిగ్గజ ఆటగాళ్ల సూపర్ హ్యూమన్ ప్రదర్శన ఉత్కంఠ కలిగిస్తుంది. క్రికెట్ ప్రపంచంలో ప్రతి ప్లేయర్‌కు ఒక వరల్డ్ కప్ గెలవాలనేది పెద్ద డ్రీమ్. అలాంటిది కెప్టెన్‌గా తన జట్టును రెండుసార్లు విశ్వవిజేతగా నిలబెట్టడం అంటే అది మామూలు విషయం కాదు.

2007 నుంచి 2024 వరకు జరిగిన టీ20 వరల్డ్ కప్ ప్రయాణంలో ఎందరో దిగ్గజ కెప్టెన్లు తమ అదృష్టాన్ని పరీక్షి ంచుకున్నారు. కానీ ఒక్కరు మాత్రం ఒక అరుదైన రికార్డును తన పేరిట రాసుకున్నారు. ఎంఎస్ ధోనీ నుంచి రోహిత్ శర్మ వరకు ఎందరో సక్సెస్‌ఫుల్ కెప్టెన్లు ఉన్నా, ఈ ఘనత ఒక్కరికే సాధ్యమైంది. 2007 ఎడిషన్‌లో ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్‌ఇండియా అరంగేట్రం టోర్నీలోనే సంచలనం సృష్టించింది. సౌతాఫ్రికా వేదికగా జరిగిన ఆ టోర్నీలో యువ భారత్ పాకిస్థాన్‌ను ఓడించి మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ధోనీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు, యువ ప్లేయర్ల పట్టుదల భారత్‌కు ఆ అరుదైన ట్రోఫీని అందించాయి. టీమ్‌ఇండియా భవిష్యత్తు కూడా ఆ విజయం నుంచి మరో స్థాయికి వెళ్లింది. ధోనీ తర్వాత ఆ రేంజ్ కెప్టెన్సీతో రోహిత్ శర్మ భారత్‌ను మళ్లీ వరల్డ్ కప్ విజేతగా నిలిపాడు. 2024లో జరిగిన గత సీజన్‌లో రోహిత్ తన పక్కా ప్లానింగ్‌తో టీమ్‌ఇండియాను ఓటమి లేకుండా నడిపాడు. ఫైనల్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాను ఓడించి భారత్ రెండోసారి టీ20 వరల్డ్ కప్‌ను ముద్దాడింది. రోహిత్ శర్మ ప్లేయర్‌గా 2007లో, కెప్టెన్‌గా 2024లో ట్రోఫీని గెలిచిన ఏకైక భారత ప్లేయర్‌గా అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ విజయంతో భారత్ మళ్లీ టీ20 ఫార్మాట్‌లో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. డారెన్ సామి కెప్టెన్సీలో వెస్టిండీస్ జట్టు టీ20 ఫార్మాట్‌లో ఎంత ప్రమాదకరమో 2012లో ప్రపంచానికి తెలిసింది. డారెన్ సామి సారథ్యంలో విండీస్ తన మొదటి టీ20 వరల్డ్ కప్ సాధించింది. శ్రీలంక వేదికగా జరిగిన ఆ టోర్నీ ఫైనల్‌లో హోస్ట్ టీమ్ శ్రీలంకను ఓడించి కరీబియన్లు కప్పును కైవసం చేసుకున్నారు. సామి తన నాయకత్వంతో జట్టును ఏకతాటిపైకి తీసుకువచ్చి అద్భుతమైన ఫలితాలను సాధించారు.

## గోల్డ్, సిల్వర్ ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడుల వెల్లువ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** గోల్డ్ ఎక్స్ఛేంజి ట్రేడెడ్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి. జనవరి నెలలో రూ.24,040 కోట్లమేర పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది డిసెంబరులో వచ్చిన రూ.11,647 కోట్లతోపోలిస్తే జనవరిలో రెండురెట్లుపెరిగాయి. సిల్వర్ ఇటిఎఫ్‌లు కూడా పెరుగుదలను సూచించాయి. ఇన్వెస్టర్లు రూ.9500 కోట్లు పెట్టుబడులు కుమ్మరించారు. అదే గత ఏడాది డిసెంబరులోచూస్తే 3962 కోట్లుమాత్రమే ఉన్నాయని మ్యూచువల్‌ఫండ్స్ అసోసియేషన్ ఆంఫీ ప్రకటించింది. పసిడి, వెండిల్లో భారీ అనిశ్చితి నెలకొనడం, జనవరిలో పసిడిధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో 17శాతం పెరగడం, వెండి కూడా 39శాతంపెరిగాయి. ఒకేసారి పతనం అయిన తర్వాత కూడా మళ్లీ పెరగడంతో ఇటిఎఫ్‌లపై ఆసక్తిపెరిగింది సిల్వర్, గోల్డ్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడులు పెరుగుతుంటే ఈక్విటీల్లో మాత్రం తగ్గుతున్నాయి. జనవరిలో రూ.24,040 కోట్లు వచ్చాయని గడచిన ఏడు నెలలతోపోలిస్తే కనిష్టమొత్తం పెట్టుబడులు వచ్చినట్లు ఆంఫీ వెల్లడించింది. గతనెలలో ఈక్విటీలనుంచే రూ.41,639 కోట్లు విత్‌డ్రాచేసారు. గడచిన 18 నెలల్లో భారీ స్థాయిలో విత్‌డ్రా కావడం ఇదే తొలిసారి. ఇక సిస్టమేటెడ్ ఇన్వెస్ట్‌మెంట్‌ప్లాన్ సిప్ పెట్టుబడులు పెరిగాయి. ఈక్విటీ ఫండ్స్‌లోకి సిప్ ఇన్‌ఫ్లోలే పెరిగాయి. స్థూలంగా పెట్టుబడులు రూ65,667కోట్లు వచ్చినట్లు ఆంఫీ తెలిపింది. అయితే డిసెంబరుతో పోలిస్తే ఐదుశాతం తగ్గాయి. ఒక్క సిప్ పెట్టుబడులే రూ.31,002 కోట్లుగా ఉన్నాయి. విలువైన ఖనిజవనరుల్లోకి పెట్టుబడులు మళ్లిస్తున్న ఇన్వెస్టర్లు విభిన్న రంగా లమూచువల్‌ఫండ్స్‌లోకి కూడా రూ.10వేల కోట్లవరకూ పెట్టుబడులు కుమ్మరించినట్లు తెలుస్తోంది. రానురాను మూచువల్‌ఫండ్స్ విభాగం ఇపుడు పెట్టుబడులకు ఎంతో సానుకూలంగా ఉండటంతో ఇన్వెస్టర్లు తమ దృష్టిని అటువేపు మళ్లించినట్లు ఆంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

## పాన్‌కార్డు నిబంధనలు ఏప్రిల్ 1నుంచి అమల్లోకి!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** దేశంలో పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం2025ను తీసుకువస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం పలు నిబంధనలను



సులభతరం చేశారు. ముఖ్యంగా పాన్ కార్డు వినియోగానికి సంబంధించిన లావాదేవీల పరిమితుల్లో గణనీయమైన మార్పులు ప్రతిపాదించారు. ఈ కొత్త చట్టానికి సంబంధించిన ముసాయిదా నిబంధనలను ఆదాయపు పన్ను శాఖ ఇప్పటికే విడుదల చేసింది. వీటిపై ప్రజలు, నిపుణుల నుంచి ఈ నెల 22 వరకు అభిప్రాయాలను స్వీకరించనుంది. ఈ ముసాయిదా ప్రకారం పలు ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు తప్పనిసరి చేసే పరిమితులను సవరించారు. ప్రస్తుతం బ్యాంకులో ఒక్కసారి రూ. 50 వేలకు మించి నగదు డిపాజిట్ చేస్తే పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంది. కొత్త నిబంధనల ప్రకారం, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షలు, అంతకుమించి మించి నగదు డిపాజిట్ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసినప్పుడు మాత్రమే పాన్ కార్డు వివరాలు సమర్పించాలి. ఇప్పటివరకు ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాల కొనుగోలుకు పాన్ తప్పనిసరిగా ఉండేది. కొత్త విధానంలో మోటార్ సైకిళ్లతో సహా ఏ రకమైన వాహనం కొనుగోలు చేసినా దాని విలువ రూ. 5 లక్షలు దాటితేనే పాన్ వివరాలు అందించాల్సి ఉంటుంది. ఏదైనా స్థిరాస్తిని అమ్మినా, కొనుగోలు చేసినా, బహుమతిగా ఇచ్చినా ఆ ఆస్తి విలువ రూ. 20 లక్షలు దాటినప్పుడే పాన్ వివరాలు అవసరం. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 10 లక్షలుగా ఉంది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు లేదా బాంక్వెట్ హాళ్లలో చేసే చెల్లింపులు ఒకేసారి రూ. 1 లక్ష దాటితే పాన్ కార్డు వివరాలు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 50,000గా ఉంది. అలాగే, ఇన్సూరెన్స్ కంపెనీలో కొత్తగా ఖాతా తెరవాలంటే ప్రీమియంతో సంబంధం లేకుండా పాన్ తప్పనిసరి చేశారు. వీటితో పాటు కంపెనీలు తమ ఉద్యోగులకు అందించే ఉచిత భోజనం లేదా పానీయాల విలువ ఒక్కో మీల్‌కు రూ. 200 మించరాదని కూడా కొత్త చట్టంలో స్పష్టం చేశారు.

వాణిజ్యం



## భారీ షాకిచ్చిన బంగారం..

### ఒక్కరోజే రూ.15000 పెరిగిన వెండి

**ముంబయి, ఫిబ్రవరి 10:** పసిడి ప్రియులకు అలర్ట్. దేశీయ మార్కెట్ల బంగారం, వెండి ధరలు మళ్లీ భారీగా పెరిగాయి. క్రితం రోజు స్థిరంగా ఉన్నప్పటికీ ఈరోజు మళ్లీ పెరగడం గమనార్హం. వెండి ఒక్కరోజే రూ.15 వేలు పెరిగి మళ్లీ రూ.3 లక్షల మార్క్ తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి రేట్లు భారీగా పెరుగుతుండడం దేశీయంగా ప్రభావం చూపిస్తోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్ మార్కెట్లో గోల్డ్, సిల్వర్ రేట్లు తెలుసుకుందాం. భారత ప్రజలకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహిళలు ఆభరణాలుగా ధరిస్తుంటారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, వాణిజ్య యుద్ధాలు, సుంకాలు, డాలర్ విలువ, మార్కెట్లలో ఒడుదొడుకులు వంటి ఎన్నో కారణాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. ఇతర మార్గాల్లోని పెట్టుబడులను బంగారంలోకి మళ్లిస్తున్నారు. దీంతో గిరాకీ పెరిగి ధరలు దూసుకెళ్తున్నాయి. ఒకప్పుడు ఆభరణాల కోసమే కొనుగోలు చేసే బంగారం ఇప్పుడు ఒక పెట్టుబడి సాధనంగా మారిపోయింది. దీంతో పసిడి రేట్లు ఆకాశమే హద్దుగా పరుగులు పెడుతోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్ మార్కెట్లో 22,24 క్యారెట్ల గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి రేట్లు మళ్లీ భారీగానే పెరిగాయి. ఇవాళ స్పాట్ గోల్డ్ రేటు 1 ఔన్సుకు 68 డాలర్లకు పైగా పెరిగింది. దీంతో ఔన్స్ బంగారం 5034 డాలర్ల పైన ట్రేడవుతోంది. స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 4.86 శాతం మేర పెరిగింది. దీంతో ప్రస్తుతం ఔన్స్ వెండి 81.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు కాస్త ఊరట కల్పించినట్లు కనిపించినా మళ్లీ పెరిగి షాకిచ్చాయి. ఈరోజు 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు రూ.1310 మేర పెరిగింది. దీంతో తులం బంగారం ధర రూ.1,57,910 వద్దకు దూసుకెళ్లింది. ఇక 22 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములపై రూ. 1200 మేర పెరిగింది. దీంతో తులం గోల్డ్ రేటు 1,44,750 వద్దకు ఎగబాకింది. ఇక బంగారంతో పాటు వెండి రేటు సైతం మళ్లీ భారీగా పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో ఇటీవల భారీగా పడిపోయిన వెండి ధర మళ్లీ పుంజుకుంటోంది. ఈరోజు ఒక్కరోజే కిలో వెండి రేటు రూ.15 వేలు పెరిగింది. దీంతో మరోసారి వెండి కిలో రూ.3 లక్షల మార్క్ దాటింది. ప్రస్తుతం కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్లో రూ.3,00,000 వద్ద ట్రేడవుతోంది.

## మూడోరోజు లాభాల్లోనే ఈక్విటీ సూచీలు

### ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, త్రైమాసిక ఫలితాలు బూస్ట్



**ముంబయి, ఫిబ్రవరి 10:** ఈక్విటీసూచీలు వరుసగా మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. విదేశీ సంస్థగత ఇన్వెస్టర్లుకొనుగోళ్లు పెంచడంతో మార్కెట్లకు ఊతం లభించింది. ఇండో అమెరికా మధ్యంతర డీల్, యూరోపియన్ డీల్ వంటివి మార్కెట్లకు మద్దతిచ్చాయి. నిఫ్టీ 25,900 మార్కుఉ దాటేసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 208.17 పాయింట్లుపెరిగి 84,273.92 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ కూడా 67.85 పాయింట్లు పెరిగింది. మూడుట్రేడింగ్‌లలో సెన్సెక్స్,నిఫ్టీలు రెండూ కూడా 1.15శాతం, 1.14శాతం చొప్పునపెరిగాయి. మహీంద్ర అండ్ మహీంద్ర 1.79శాతం, ఎల్‌అండ్‌టి 1.32శాతం, ఐసిఐసిబ్యాంకు 0.60శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలోమిడ్‌క్యాప్‌సూచీ 0.21శాతం స్మాల్‌క్యాప్‌సూచీ 0.46శాతంచొప్పున పెరిగాయి. బిఎస్ఇలో 2620 కంపెనీల షేర్లుపెరిగాయి. 1631 కంపెనీలు తిరోగమించాయి. 172 కంపెనీలు స్తిరంగాకొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి డాలరుతో చెలామణిని చూస్తే 90.57 వద్ద కదలాడింది. అంతకుముందురోజు 90.60గా కొనసాగిన సంగతి తెలిసిందే. బ్రెంట్‌ముడి చమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి 13 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 69.04 డాలర్లుగా కొనసాగింది. షేర్లలో బిఎస్ఇ 6.26శాతం పెరిగితే బాటా ఇండియా 3.86శాతం, నెల్‌కాస్ట్ 7.96శాతం, ఐఎస్‌జిఇసి హెవీ ఇంజినీరింగ్ 18.32శాతం చొప్పున పెరిగాయి. సైన్‌పోస్టు ఇండియా 15.23శాతం పెరిగినట్లు ప్రకటించింది. త్రైమాసిక ఫలితాలే ఈ కంపెనీలు భారీ ఊతం ఇచ్చాయి. అలాగే వేక్‌ఫిట్ ఇన్నొవేషన్స్‌కూడా 8.15శాతం, టెక్‌సమాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ 2.55శాతం, ఎన్ఆర్‌బి బేరింగ్స్ 2.95శాతం పెరిగితే రూట్ మొబైల్ 1.64శాతం హ్యాపియస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ 0.68 శాతం, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ 2.13శాతం చొప్పున క్షీణిస్తే గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా మాత్రం 1.28శాతం షేర్లుపెరిగి ట్రేడ్ అయ్యాయి. ఇక ఐపిఒలపరంగా ఫ్రాక్టాల్ అనలిటిక్స్ 36,25,120 షేర్లకుబ ఇడ్లు సాధించింది. వాస్తవనికి 1,85,79,360గా మాత్రమే ఆహ్వానిస్తే 0.20రెట్లుపెరిగింది. తొమ్మిదిన ప్రారంభం అయిన ఈ ష్యూ 11న ముగుస్తుంది. ఐపిఒ ధరలు రూ.857 నుంచి 900మధ్యలో ఉంటాయి. ఆయేఫైనాన్స్ కూడా 72,72,272 షేర్లకు బిడ్లు రాబట్టింది. 0.16 రెట్లు ఎక్కువ బిడ్లు వచ్చాయి. 9న ప్రారంభం అయి 11న ముగుస్తుంది. ఐపిఒ ధరలు రూ.122 నుంచి రూ.129గా నిర్ణయించింది.

## 61% పెరిగిన టైటాన్ జ్యుయెలరీ నికరలాభాలు




**ముంబయి, ఫిబ్రవరి 10:** టాటాగ్రూపు జ్యుయెలరీ సంస్థ టైటాన్ కంపెనీ మంగళవారం నికరలాభాల్లో 61శాతం వృద్ధిని సాధించినట్లుప్రకటించింది. డిసెంబరుతో ముగిసన త్రైమాసికంలో రూ.1684 కోట్లు ఆర్జించింది. అదే గత ఏడాది ఇదేకాలంలో రూ.1047 కోట్లు సాధించింది. కంపెనీ రాబడులు కూడా 42శాతంపెరిగి రూ.24,915 కోట్లుగా ఉనానయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.17,550 కోట్లు మాత్రమే రాబట్టింది. జ్యుయెలరీ విభాగంలో పటిష్టమైన డిమాండ్ రావడంతో సంస్థ లాభాలుపెరిగాయి. బంగారం ధరలు భారీగాపెరిగినప్పటికీ పండుగల సీజన్ టైటాన్‌కు భారీగా కలిసొచ్చింది. కంపెనీ ఇబిడిటా 2475కోట్లుగా ఉంది. ఐకేర్ విభాంలో రూ.231 కోట్లు వచ్చింది.
18శాతంపెరిగింది. టైటాన్ ఇంజినీరింగ్ ఆటోమేషన్ టీల్ రాబడులు రూ.323కోట్లుగా ఉన్నాయి. 67శాతంపెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ షేర్లు మంగళవారం బిఎస్ఇలో నిలకడగా అంటే రూ.4267.05 చొప్పున కొనసాగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. 101, R.S.No. 660/2-A, Maruti Nagar, K.G.N. Road, Kurnool-518001 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No. APTE:/2001/05322